ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 16, మే 2024

ఉమ్మడి ప్రకాశంలోని తూర్పుప్రాంతంలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో అధిక శాతం టీడీపీ కూటమి కైవసం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీడీపీకి జనసేన, బీజేపీల కలయిక కలిసి వచ్చింది. ఆరు స్థానాలలో ఆపార్టీ స్థానిక అభ్యర్థులను రంగంలోకి దించింది. వైసీపీ స్థానికేతరులను బరిలో నిలిపింది. అన్నిచోట్లా గ్రూపు విభేదాలు అధికార పార్టీకి సమస్యాత్మకంగా మారాయి. టీడీపీ కూటమి ఐదు స్థానాల్లో విజయంపై పూర్తి నమ్మకంతోనూ, రెండు స్థానాల్లో గట్టి పోటీ మధ్య బయటపడతామని అంచనా వేస్తోంది. వైసీపీ విషయానికొస్తే అద్దంకి, పర్చూరులో విజయావకాశాలపై ఆపార్టీ నేతల్లో ఆశలు సన్నగిల్లాయి. మిగిలిన స్థానాల్లో విజయంపై నమ్మకంతో ఫలితాల వైపు చూస్తున్నారు. మొత్తం పరిస్థితిని చూస్తే చీరాల, కందుకూరులో గట్టిపోటీ జరగ్గా మిగిలిన ఐదు స్థానాల్లో టీడీపీ కూటమి అనుకూల వాతావరణం నెలకొంది. అయితే ప్రలోభాలపైనే నమ్మకంతో వైసీపీ శ్రేణులు ఉన్నాయి.

- కూటమికే అనుకూల పవనాలు
- టీడీపీకంతా స్థానిక అభ్యర్థులు.. వైసీపీకి స్థానికేతరులు
- ఇటు ఐక్యత.. అటు విభేదాలు
- ఏడు స్థానాల్లోనూ విజయంపై తెలుగు తమ్ముళ్ల ధీమా
- ఐదుచోట్ల గెలుపుపై అధికారపార్టీలో ఆశలు


ఒంగోలులో ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న మద్దిరాలపాడు టీడీపీ నేతలు

తూర్పున తిరుగులేదు!

ఒంగోలులో మారిన వాతావరణం


పోలింగ్ రోజు ఒంగోలులోని ఓ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జనార్దన్

ప్రతిష్ఠాత్మక పోటీ జరిగిన ఒంగోలు నియోజకవర్గంలో వాతావరణం టీడీపీకి అనుకూలంగా మారింది. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి బాలినేని 23వేల అధిక్యతను పొందారు. అప్పట్లో వైసీపీకి అధిక్యతను ఇచ్చిన ఉద్యోగ, వ్యాపారవర్గాలతోపాటు కాపు సామాజికవర్గ ఓటర్లలో ఈసారి భారీగా గండిపడింది. గత ఎన్నికల్లో 10వేల ఓట్లు పొందిన జనసేన, ఈ పర్యాయం టీడీపీకి గట్టి మద్దతుగా నిలిచింది. టీడీపీ అభ్యర్థి జనార్దన్ పోల్‌మేనేజ్‌మెంట్‌లో పూర్తి జాగ్రత్తలు తీసుకున్నారు. వైసీపీ.. దళిత, ముస్లిం, బీసీల్లో యాదవ సామాజికవర్గ ఓటర్లలో అధిక్యత వస్తుందన్న నమ్మకంతో ఉంది. అయితే కులాలకతీతంగా ఉద్యోగ, వ్యాపారవర్గాలు, యువత, నిరుద్యోగులు టీడీపీ వైపు మొగ్గుచూపడంతో వైసీపీకి భారీ నష్టం జరిగిందని విశ్లేషకుల అంచనా. బ్రాహ్మణ ఓటర్లతోపాటు, యాదవేతర బీసీ ఓటర్లలో టీడీపీ కూటమికి ఓట్లు పెరగడం కనిపిస్తోంది. కమ్మ, కాపు, ఆర్యవైశ్యుల్లో టీడీపీ మంచి అధిక్యతను పొందినట్లు వెల్లడైంది. అభివృద్ధి అంశాలు దామచర్లకు కలిసొచ్చాయి. మరోవైపు గత నాలున్నరేళ్లలో నగరంలో జరిగిన భూదందాలు, అల్లరి మూకల ఆగడాలు, వైసీపీ శ్రేణుల దాడులు ఆ పార్టీకి కనిపించని నష్టాన్ని కలిగించింది. మొత్తంగా చూస్తే ఒంగోలురూరల్ మండలంలో టీడీపీ అధిక్యత గతంకన్నా మూడింతలు పెరగబోతుంది. కొత్తపట్నం మండలంలో గత ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన అధిక్యతకు భారీగా గండిపడబోతోంది. నగరం నడిబొడ్డు ప్రాంతంలోని అన్ని బూత్‌లలో టీడీపీ అనుకూల వాతావరణం కనిపించగా, శివారు కాలనీల్లో వైసీపీకి అధిక్యత వచ్చే అవకాశం ఉంది. గెలుపుపై ఇరు పార్టీల్లోనూ ధీమా ఉన్నప్పటికీ అనుహ్య పరిస్థితులు మినహా టీడీపీకే మొగ్గు కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉన్న తూర్పు ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల ఫలితాలపై యావత్తు ప్రజానీకం దృష్టి సారించింది. ఈ ప్రాంతంలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో కొత్త ప్రకాశంలో మూడు, బాపట్ల జిల్లాలో 3, నెల్లూరు జిల్లా పరిధిలో ఒకటి ఉన్నాయి. గత ఎన్నికల్లో జగన్ అనుకూల వాతావరణంలోనూ ఈ ఏడింటిలో టీడీపీ నాలుగు స్థానాలను కైవసం చేసుకొంది. ప్రస్తుతం టీడీపీతో జనసేన, బీజేపీలు కలవడం ఉద్యోగులు, యువత, విద్యార్థులు, వ్యాపార వర్గాల్లో కూటమి అనుకూల వాతావరణం నెలకొనడం తోడైంది. అలాగే కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల పట్ల ఓటర్లలో ఆకర్షణ కనిపించింది. వీటికి మించి స్థానికంగా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించడం, కూటమి పార్టీల శ్రేణులు సమష్టిగా పనిచేయడం అన్నిచోట్ల కనిపించింది. వైసీపీలో ఎక్కువచోట్ల స్థానికేతర అభ్యర్థులు కావడం, పార్టీలో నెలకొన్న అనైక్యతలు సమస్యలుగా కనిపించాయి. కొన్ని వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకతను వైసీపీ నేతలు అంగీకరిస్తూనే వృద్ధులు, మహిళా ఓటర్లపై నమ్మకంతో ఉన్నారు. ఎక్కువ స్థానాల్లో ఓటర్లను ప్రలోభపరిచే అంశాల్లో ముందు ఉండటంపై వైసీపీ నాయకులు ఆశలు పెట్టుకోవడం విశేషం.

అద్దంకి, పర్చూరులో...

గత ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన అద్దంకి, పర్చూరుల్లో ఈసారి పట్టుకోసం వైసీపీ అధినాయకత్వం ముందు నుంచి పలు ప్రయత్నాలు చేసింది. స్థానికేతరులైన అభ్యర్థులను రంగంలోకి దించగా, టీడీపీ కూటమి తిరిగి రవికుమార్, సాంబశివరావులను బరిలోకి దింపింది. అద్దంకిలో డాక్టర్ గరటయ్య వైసీపీకి రాజీనామా చేయగా, పర్చూరులో మండల, గ్రామస్థాయిల్లో పలువురు బలమైన నేతలు టీడీపీలో చేరారు. మరికొందరు సైలెంట్ అయ్యారు. ఓటర్ల ప్రభావిత చర్యలకు వైసీపీ ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ టీడీపీ కూటమి నుంచి కూడా ఎక్కడా తగ్గలేదు. పోలింగ్ అనంతరం పరిణామాలను పరిశీలిస్తే.. అద్దంకి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ టీడీపీకి సానుకూల వాతావరణం నెలకొంది. సంతమాగులూరు మండలంలోనూ టీడీపీకే ఆధిక్యత వచ్చే అవకాశాలున్నాయి. బల్లికురవ మండలంలో టీడీపీకి గతంలో 800 ఓట్ల మెజారిటీ రాగా, ఇప్పుడు రెట్టింపు అయ్యే పరిస్థితి ఉంది. అద్దంకి పట్టణంలో టీడీపీ ఆధిక్యత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. పంగులూరు కొరిశపాడు మండలాల్లో మంచి మెజారిటీ లభించే అవకాశాలున్నాయి. పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాం మండలంలో వైసీపీ ఆధిక్యతకు పూర్తిగా గండిపడింది. జనసేన కలయిక, ఇతర అంశాలతో పర్చూరు, కారంచేడు మండలాల్లో టీడీపీ మెజారిటీ పెరిగే పరిస్థితులు స్పష్టంగా ఉన్నాయి. యద్దనపూడి మండలంలో స్థానిక పరిస్థితులు, గొట్టిపాటి వర్గీయుల్లో కూడా కొందరు అదనంగా కలిసిరావడం.. ఏలూరికి దళిత, బలహీనవర్గాల్లో పలువురు కొత్తగా మద్దతు ప్రకటించడంతో అక్కడా ఆధిక్యం లభించనుంది. . ఇంకొల్లు మండలంలో గట్టిపోటీ జరిగినప్పటికీ దగ్గుబాటి వర్గీయులు ఎక్కువమంది టీడీపీతో కలిసివచ్చారు. దీంతో నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎప్పుడూ రాని ఆధిక్యత టీడీపీకి లభించే అవకాశాలు లేకపోలేదు.

ఎస్ఎన్‌పాడులో వార్ వన్‌సైడ్

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో స్థానికేతరుడైన వైసీపీ అభ్యర్థి నాగార్జునకు ఆ పార్టీలో అన్ని గ్రూపుల నుంచి అవసరమైన సహకారం లభించలేదు. అసమ్మతివాదులను కలుపుకొని పోయేందుకు నాగార్జున చేసిన ప్రయత్నాలు పూర్తిగా ఫలించ లేదు. టీడీపీ అభ్యర్థి విజయ్‌కుమార్ కూటమి నాయకులను ఐక్యంగా నడపడంలో సఫలీకృతులయ్యారు. తెలుగు తమ్ముళ్లు పట్టుదలతో పనిచేశారు. ముఖ్యంగా చీమకుర్తి మండలంలో వైసీపీ అధిక్యతకు గండిపడింది. అక్కడ బూచేపల్లి కుటుంబం దర్శిలో రంగంలో ఉండటం అందుకు ఒక కారణం. చీమకుర్తిలో జనసేన ఓట్లు బదిలీకావడం, బూచేపల్లి వ్యతిరేకవర్గం సహకరించడం కూడా టీడీపీకి కలిసొచ్చింది. ఎస్ఎన్‌పాడు, ఎన్‌జీపాడు మండలాల్లో టీడీపీ కూటమికి మంచి అధిక్యత లభించబోతోంది. మద్దిపాడు మండలంలో ఇరుపార్టీల పరిస్థితి పోటాపోటీగా ఉన్నప్పటికీ ఎవరికైనా స్వల్ప అధిక్యత కనిపిస్తోంది. దీంతో సుమారు 10వేల మెజారిటీ లభిస్తుందన్న ధీమాలో టీడీపీ ఉండగా, కనీసం నాలుగు, ఐదు వేలతోనైనా బయటపడగలమన్న ఆశతో వైసీపీ వారు ఉన్నారు

చీరాల, కందుకూరులో నువ్వానేనా..

చీరాల, కందుకూరు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ నువ్వానేనా అన్నట్లు సాగింది. చీరాలలో త్రిముఖ పోటీ జరిగింది. వైసీపీ అభ్యర్థి వెంకటేష్, టీడీపీ అభ్యర్థి కొండయ్యయాదవ్, మధ్యలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమంచి రంగంలోకి వచ్చారు. మూడు పార్టీల్లోనూ విజయావకాశాలపై ధీమా ఉన్నప్పటికీ త్రిముఖ పోటీ టీడీపీకి కలిసివచ్చే అవకాశాలను కొట్టేయలేమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలలో టీడీపీ, వైసీపీలు పోటీపడగా.. కాంగ్రెస్ అభ్యర్థి కొంతమేర వెనుకబడ్డారు. అయితే యాదవులు అధికంగా ఉండే గ్రామంలో టీడీపీ అభ్యర్థి కొండయ్య యాదవ్‌పై దాడి జరగడం బలహీనవర్గాల్లో ఆయనకు కొంత మేర కలిసొచ్చింది. పోలింగ్ చివర్లో వైసీపీ, కాంగ్రెస్ శ్రేణులు ఘర్షణలో మునిగితేలుతుండగా, మిగిలిన ఓట్లను పోల్ చేయించుకోవడంలో టీడీపీ సఫలీకృతమైంది. ఆర్యవైశ్యుల ఓట్లలో టీడీపీకి ఊహించిన దానికన్నా ఎక్కువే పడ్డాయి. వేటపాలెం మండలంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రధాన పోటీదారులుగా ఉండగా చీరాల మునిసిపాలిటీలో ముగ్గురు మధ్య పోటీ నడిచింది. యాదవ సామాజికవర్గం ఉన్న గ్రామాలన్నీ టీడీపీకి సానుకూలంగా మారాయి. వైసీపీ ఓట్ల చీలక కలిసిసొస్తుందన్న భావన టీడీపీ శ్రేణుల్లో విజయంపై నమ్మకాన్ని పెంచింది. కందుకూరులో వైసీపీ, టీడీపీల మధ్య గట్టిపోటీ నెలకొంది. అయితే వైసీపీ అభ్యర్థి మధుసూదన్ స్థానికేతరుడు కావడం, ప్రధానంగా బలమైనవర్గం కలిగిన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి రంగంలో లేకపోవడం వైసీపీకి మైనస్‌లుగా మారాయి. కందుకూరు పట్టణంలో ఆర్యవైశ్య ఓటర్లు టీడీపీకి అండగా నిలిచారు. జనసేన రూపంలో కాపు సామాజికవర్గం ఓట్లు టీడీపీకి పడ్డాయి. అలాగే వలేటివారిపాలెం, లింగసముద్రం మండలంలో టీడీపీకి ఆధిక్యత వస్తుంది. గుడ్లూరు మండలంలో వైసీపీకి మెజారిటీ ఉంది. ఉలవపాడు మండలంలో ఆధిక్యతపై ఇరుపార్టీలూ విశ్వాసంతో ఉన్నాయి. రెడ్డి సామాజికవర్గానికి సంబంధించి వైసీపీ ఓట్లను టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి మార్చుకోగలిగారన్న ప్రచారం ఉంది. దీంతో టీడీపీ ఆశలు పెరిగాయి. గ్రూపులకతీతంగా నియోజకవర్గంలో బలమైన కమ్మ, యాదవ సామాజికవర్గం అభ్యర్థులను రంగంలోకి దించడంతో అంచనాల విషయంలో అందరిలోనూ తడబాటు కనిపిస్తోంది.

కొండపిలో మళ్లీ అదే ఫలితం

కొండపిలో ఈ పర్యాయం కూడా టీడీపీకి సానుకూలత కనిపిస్తోంది. అభ్యర్థి స్వామి స్థానికుడు కావడం, అండగా దామచర్ల కుటుంబం ఉండటం, మాగుంట రాక కలిసొచ్చింది. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు మద్దతు టీడీపీకి లాభించింది. వైసీపీ అభ్యర్థి సురేష్ స్థానికేతరుడు కావడం, నియోజకవర్గ వైసీపీలో గ్రూపు విభేదాలు తారస్థాయిలో ఉండటం ప్రతికూల అంశాలు. డబ్బు పంపిణీలో వైసీపీ ముందు ఉన్నప్పటికీ సొంత సామాజికవర్గం ఓటర్ల మద్దతుగా వారు చేసిన ప్రయత్నం ప్రత్యర్థి సామాజికవర్గంలో ఓట్ల చీలకకు తావిచ్చింది. వైసీపీకి బలమైన సింగరాయకొండ మండలంలో ఆ పార్టీ అధిక్యతకు భారీగా గండిపడటం ఖాయంగా కనిపిస్తోంది. టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లో టీడీపీకి మెజారిటీ అధికంగానే వచ్చే అవకాశం ఉంది. పొన్నలూరు, మర్రిపూడి మండలాల్లో అధిక్యతపై వైసీపీ కూడా ఆశతో ఉన్నప్పటికీ అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. కొండపి మండలంలో టీడీపీకి స్పష్టమైన అధిక్యత కనిపిస్తోంది. ఇక్కడ తెలుగుదేశం అభ్యర్థి స్వామి గెలిచే ఆవకాశం కనిపిస్తోంది.


పోలింగ్ రోజు మర్రిపూడిలోని ఓ కేంద్రాన్ని సందర్శిస్తున్న స్వామి

కాంట్రాక్టు మోసం

- కొవిడ్ సమయంలో వైద్యశాఖలో పోస్టుల భర్తీలో అక్రమాలపై విచారణ
- కాంట్రాక్టు పేరుతో ఏజెన్సీ ద్వారా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు
- పది నెలలు జీతాలు లేకుండా పనిచేసిన వైనం
- రాజమహేంద్రవరంలో విచారణ చేసిన ఆర్డీ



ఒంగోలు (కలెక్టరేట్), మే 15: వైద్యారోగ్యశాఖలో ఉద్యోగ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కొవిడ్‌ను అసరా చేసుకొని అప్పట్లో పనిచేసిన వారు ఇష్టారీతిన వైద్యశాఖలో నియామకాలు చేపట్టారు. ఇప్పుడు విచారణను ఎదుర్కొంటున్నారు. కొవిడ్ సమయంలో ప్రభుత్వం అత్యవసరంగా ఉద్యోగ నియామకాలను చేపట్టింది. ఆ సమయంలో కలెక్టర్లు వైద్యశాఖకే పూర్తి బాధ్యతలను అప్పగించారు. దీనిని ఆసరా చేసుకొని కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఇష్టారీతిన నియామకాలు చేపట్టారు. ఆ పోస్టులపై అవగాహన లేని వారు వైద్యశాఖలో పనిచేసే కొందరి మాటలు నమ్మి మోసపోయారు. అవుట్ సోర్సింగ్‌లను కూడా కాంట్రాక్టు ఉద్యోగాలుగా చెప్పడంతో భారీగా మామూళ్లు ఇచ్చి కొలువులో చేరారు. అలా వైద్యశాఖలో ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో పోస్టుల్లో 18మందిని నియమించారు. సాధారణంగా అవుట్ సోర్సింగ్ పోస్టులను ఏజెన్సీల ద్వారా భర్తీచేస్తారు. కానీ ఆయా పోస్టులకు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియామక ఉత్తర్వులు తెచ్చి కాంట్రాక్టు ఉద్యోగాలుగా నమ్మించారు. కొద్దినెలలు పనిచేసిన తర్వాత వారిని తొలగించారు. అయితే వారికి విషయం చెప్పకుండా అనధికారికంగా కొనసాగించారు. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో అనధికారికంగా ఉద్యోగాలు చేస్తున్న వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. కొద్దిరోజుల పాటు ఆ ఫిర్యాదులు బయటకు రాకుండా వైద్యశాఖ ఉద్యోగులు మేనేజ్ చేశారు. అలాగే ఏదోవిధంగా కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చి రెగ్యులర్ చేసేవిధంగా చూసుకుంటామని డబ్బులు ఇచ్చిన వారికి నమ్మబలికారు. కానీ నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో తమను మోసం చేస్తున్నారని గుర్తించిన ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి నివేదికను అందజేయాలని రాజమహేంద్రవరం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మశశిధర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆయా పోస్టుల నియామకాలను చేపట్టిన అప్పటి డీఎంహెచ్‌వో రత్నావళితోపాటు సూపరింటెండెంట్, ఏవో, ఇతర సెక్షన్ ఉద్యోగులను సంబంధిత రికార్డులతో హాజరు కావాలని ఆర్డీ నోటీసులు జారీచేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో విచారణ చేశారు.

హమ్మయ్యా!

- ప్రశాంతంగా పోలింగ్
- ఊపిరిపీల్చుకున్న యంత్రాంగం
- ఒత్తిడి నుంచి ఉపశమనం
- స్ట్రాంగ్‌రూమ్‌లలో ఈవీఎంలు
- వచ్చేనెల 4న కౌంటింగ్
- తదుపరి ఏర్పాట్లపై దృష్టి
- ఒంగోలు పార్లమెంట్, దర్శి అసెంబ్లీ స్థానాల్లో రాష్ట్రంలోనే అధికశాతం పోలింగ్


ఓటు వేసేందుకు ఒంగోలులోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

ఒంగోలు, మే 15 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల్లో అత్యంత కీలకఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. కొన్నిచోట్ల వైసీపీ శ్రేణులు అరాచక వాతావరణం సృష్టించి ప్రతిపక్ష టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డాయి. అయినా పోలింగ్ వాయిదా వేయాల్సిన పరిస్థితి రాకుండా ప్రక్రియను ముగించడంలో యంత్రాంగం విజయవంతమైంది. పోలింగ్ అనంతరం ఈవీఎంలను ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలకు చేర్చి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే ప్రక్రియ మంగళవారం రాత్రికి ఒక కొలిక్కి వచ్చింది. వచ్చేనెల 4న లెక్కింపు జరగనుంది. అందుకు ఇంకా దాదాపు 19రోజుల సమయం ఉంది. దీంతో ఎన్నికల విధుల్లో ఇప్పటివరకూ తీవ్ర ఒత్తిడితో పనిచేసిన యంత్రాంగానికి ఉపశమనం లభించింది.

కోడ్ వచ్చినప్పటి నుంచీ డ్యూటీలోనే

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మొత్తం యంత్రాంగం పూర్తిగా ఎన్నికల విధుల్లోనే ఉంది. పోలింగ్ కేంద్రాల ఎంపిక నుంచి అక్కడ ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓటర్ల తుది జాబితాల ప్రకటన, ఆతర్వాత వచ్చిన దరఖాస్తులు పరిశీలన, ఓటర్ల అవగాహన కార్యక్రమాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఓటర్ల స్లిప్పుల పంపిణీ వంటి అనేక పనుల్లో రెండు మాసాలుగా తీరిక లేకుండా పనిచేస్తూ వచ్చారు. ఇక కీలక ఘట్టమైన పోలింగ్ ఈనెల 13న జరగ్గా 12వతేదీన నియోజకవర్గాల వారీ మెటీరియల్ పంపిణీ, 14వతేదీ ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు చేర్చడం వరకూ బిజీబిజీగా ఉన్నారు. ఈ మూడు రోజులు వందలాది మంది అధికారులు, కిందిస్థాయి ఉద్యోగులు రాత్రింబవళ్లూ పనిచేయాల్సి రాగా మంగళవారం రాత్రితో ఆ పనులన్నింటినీ పూర్తిచేసి ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు.

పకడ్బందీగా పనిచేసిన సిబ్బంది

ఒక్క పోలింగ్ రోజే దాదాపు 15వేల మంది ఉద్యోగులు విధుల్లో పాల్గొన్నారు. మరో ఐదువేల మంది వరకూ పోలీసు, రెవెన్యూ, ప్రజారవాణా ఉద్యోగులు పోలింగ్‌కు సహకరిస్తూ భద్రతా చర్యలు, రవాణా, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పన పనుల్లో నిమగ్నయ్యారు. పోలింగ్ విధుల్లో సగం మందిపైగా ఉపాధ్యాయులే ఉండగా వేసవి సెలవుల్లో వివిధ కార్యక్రమాలు, టూర్లు పెట్టుకునే వారంతా వాటిని వాయిదా వేసుకున్నారు. అలా వందలాది మంది జిల్లా, డివిజన్, సబ్ డివిజన్ స్థాయి అధికారులు, వేలాది మంది ఉద్యోగులు ఉమ్మడిగా పనిచేసి ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన పోలింగ్‌ను ప్రశాంతంగా ముగించారు. కొన్నిచోట్ల ఉద్రికత్తలు ఏర్పడటం, టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడులు చేయడం, పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు అంతగా లేక ఓటర్లు ఇబ్బందులు పడటం వంటివి అలా ఉంచితే రీ పోలింగ్ పెట్టాల్సిన అవసరం లేకుండా ఆ ఘట్టం ముగిసింది. పీవోలు, ఏపీవోలుగా పనిచేసిన ఉపాధ్యాయులు పకడ్బందీగా పనిచేశారు. ఎక్కడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రాలేదు.

ఓటర్లు పోటెత్తారు

రాష్ట్రంలోనే ఈసారి ఓటింగ్‌లో జిల్లా ఆగ్రభాగాన నిలిచింది. రాష్ట్ర ఎన్నికల అధికారులు ప్రకటించిన ప్రకారం పార్లమెంట్ స్థానాల్లో ఒంగోలు, అసెంబ్లీ సెగ్మెంట్‌లలో దర్శి నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలతోపాటు బాపట్ల పరిధిలోని సంతనూతలపాడు నియోజకవర్గం ఉంది. రాష్ట్రంలో అత్యధికంగా ఒంగోలు పార్లమెంట్ స్థానంలో 87.17శాతం ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ స్థానాల్లో దర్శిలో అత్యధికంగా 90.91శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంత ఎక్కువగా జిల్లాలో పోలింగ్ శాతం నమోదు కావడంపై అధికారులు సంతృప్తిగా ఉన్నారు. మొత్తంగా కీలక ఘట్టమైన పోలింగ్ ముగిసి ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరడంతో ఆ ప్రక్రియలో భాగస్వామ్యమైన యంత్రాంగం టెన్షన్ నుంచి బయటపడి రిలాక్స్ అవుతోంది. ఇదిలా ఉండగా కౌంటింగ్ వచ్చేనెల 4న జరగనుండగా ఆలోపు నిదానంగా అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించనున్నారు.

బాధితులపైనే బైండోవర్ కేసులు

- వెంగముక్కలపాలెం టీడీపీ శ్రేణులపై పోలీసుల ఒత్తిడి
- గ్రామానికి చేరుకుని బాధితులు, పోలీసులతో మాట్లాడిన దామచర్ల
- కావ్యశ్రీ, భాస్కర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డిలపై కేసు పెట్టాలని డిమాండ్

ఒంగోలు (కార్పొరేషన్), మే 15 : ఎన్నికల పోలింగ్ సందర్భంగా వెంగముక్కలపాలెంలో జరిగిన ఘర్షణలో బాధితులపైనే పోలీసులు బైండోవర్ కేసులకు సిద్ధమయ్యారు. ఈనెల 13న పోలింగ్ సమయం ముగిసిన తర్వాత వెంగముక్కలపాలెంలోని ఓ కేంద్రంలోకి వెళ్లిన వైసీపీ అభ్యర్థి బాలినేని కోడలు కావ్యశ్రీ, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి, ఆయన వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డి ఓట్లు వేసే ప్రయత్నం చేశారు. దానిని టీడీపీ ఏజెంట్లు అడ్డుకున్నారు. దీంతో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ నేతలు దౌర్జన్యానికి దిగి దాడి చేశారు. వారి అనుచరులు అర్ధరాత్రి టీడీపీ శ్రేణుల ఇళ్లలోకి చొరబడి మరో విడత దాడికి దిగారు. దీంతో బాలినేని ప్రణీత్‌రెడ్డి, కావ్యశ్రీ, కుండా భాస్కర్‌రెడ్డితోపాటు వారి అనుచరులపై బాధితులు తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నేటికీ వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఇదిలా ఉంచితే బుధవారం బాధితులైన టీడీపీ శ్రేణులను బైండోవర్ చేసేందుకు పోలీసులు అత్యుత్సాహం చూపారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు వెంగముక్కలపాలెంకు వెళ్లడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దాడిచేసిన వారిని అరెస్టు చేయకుండా, కనీసం కేసు నమోదు చేయకుండా తమను బైండోవర్ చేయడం ఏమిటని బాధితులు నిలదీశారు. పోలీసులు మరింత ఒత్తిడి చేయడంతో విషయం తెలుసుకున్న టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ హుటాహుటిన వెంగముక్కలపాలెంకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేసమయంలో పోలీసులతో మాట్లాడిన దామచర్ల.. చట్టప్రకారం నిందితులపై చర్యలు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. ముందుగా ప్రణీత్‌రెడ్డి, కావ్యశ్రీ, భాస్కర్‌రెడ్డితోపాటు దాడికి పాల్పడిన వారి అనుచరులపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వెంగముక్కల పాలెంలో జరిగిన వైసీపీ మూకల దాడిని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, డీజీపీకి, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని ఆయన విలేకరులకు తెలిపారు. 24 గంటల్లో వారిపై కేసు నమోదు చేయకుంటే ఎస్పీ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు.


వెంగముక్కలపాలెంలో పోలీసులతో మాట్లాడుతున్న జనార్దన్

ఓటరు తీర్పు ఎటు?

మండలంలో విస్తృత చర్చ ● విజయంపై కూటమి నేతల ధీమా



టంగుటూరు, మే 15 : మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 87.41శాతం ఓటింగ్ జరిగింది. ఉదయం నుంచే పెద్దఎత్తున ప్రజలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో వారు తీర్పు ఎలా ఉంటుందన్న చర్చ మండలంలో విస్తృతంగా సాగుతోంది. టీడీపీ కూటమి నేతలు విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కొండపి అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గత ఐదేళ్లుగా అటు అసెంబ్లీలోనూ, ఇటు బయట తన వాడివేడి మాటలతో పలు సందర్భాల్లో అధికార పార్టీని ఇరుకున పెట్టారు. దీంతో ఎలాగైనా కొండపిలో ఆయన్ను ఓడించాలన్న నిర్ణయంతో ముఖ్యమంత్రి స్వయంగా కల్పించుకొని మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఎర్రగొండపాలెం నుంచి కొండపికి తెచ్చి రంగంలోకి దించారు. ఇప్పటి వరకూ సురేష్‌కు ఓటమి లేదు. ఎలాగైనా కొండపిని సొంతం చేసుకోవాలని ఆయన చివరివరకూ తీవ్రంగా ప్రయత్నించారు. సురేష్ రాక ముందు వైసీపీ కొండపి ఇన్‌చార్జిలుగా వ్యవహరించిన వారిలో వరికూటి అశోక్‌బాబుకు వేమూరులో అవకాశం కల్పించారు. డాక్టర్ మాదాసి వెంకయ్యను ఒంగోలు నియోజకవర్గ పరిశీలకునిగా నియమించారు. వీరిరువురూ, వారి అనుచరులు మంత్రికి ఏమేరకు సహాయపడ్డారన్న విషయం తేలాలంటే ఫలితాలు వచ్చేదాకా ఎదురు చూడక తప్పదు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ స్వామి తనదైన శైలిలో ముందుకు సాగారు. ఆయనకు వెన్నుదన్నుగా దామచర్ల సత్య కొనసాగారు. సత్య తండ్రి పూర్ణచంద్రరావు సైతం స్వామి గెలుపే లక్ష్యంగా పని చేశారు. టీడీపీ కూటమి నాయకులు విజయం తమదేనన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

మౌనంగా ఉంటున్నామని..

మరీ రెచ్చిపోవద్దు..!

ప్రణీత్‌రెడ్డి, కావ్యశ్రీ, భాస్కర్‌రెడ్డిలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నిందితులపై 24గంటల్లో చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళన ● వెంగముక్కలపాలెం ఘటనపై దామచర్ల హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), మే 15: ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో వైసీపీ మూకలు దాడులకు పాల్పడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని, మౌనంగా ఉంటున్నామని మరీ రెచ్చిపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ హెచ్చరించారు. బుధవారం వెంగముక్కలపాలెంలో బాధితులను పరామర్శించిన దామచర్ల అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఒంగోలు నియోకవర్గంలో వైసీపీ ముఠా చేసే అరాచకాలు ప్రజలు చూస్తున్నారని చెప్పారు. ప్రజలు టీడీపీకి ఓటు వేశారనే కారణంతో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దొంగఓట్లు వేసేందుకు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత 7గంటల సమయంలో బూత్‌లోకి వచ్చి గందరగోళం సృష్టించడంతోపాటు, ప్రశ్నించిన టీడీపీ ఏజెంట్లపై ప్రత్యక్ష దాడులు చేయడం దుర్మార్గమన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు టీడీపీ ఏజెంట్‌ను చెప్పుతో కొడుతున్న వీడియోలు అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా ఉన్నాయని చెప్పారు. వైసీపీ మూకల దాడిలో గాయపడి టీడీపీ శ్రేణులు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికి వారిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన దామచర్ల, దాడులు సంస్కృతి టీడీపీకి లేదన్నారు. మంచిగా, మౌనంగా ఉంటున్నామని చేతకాని తనంగా భావించవద్దని స్పష్టం చేశారు. వైసీపీ దాడులను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, డీజీపీ, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. 24 గంటల్లో దాడికి పాల్పడిన వైసీపీ ముఠాపై కేసు నమోదు చేసి అరెస్టు చేయకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని దామచర్ల హెచ్చరించారు. మరో ఇరవై రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడతాయని, ప్రజాతీర్పులో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని ఆయన చెప్పారు. అధికారులు కూడా వాస్తవాలు గుర్తించాలని, బాధితులపై బైండవర్ కేసులు ఎలా నమోదు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కావ్యశ్రీ, ప్రణీత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు దాడి కేసులు కూడా నమోదు చేయాలని దామచర్ల డిమాండ్ చేశారు.

బీఎన్ కార్యాలయంలో నేతల సందడి

విజయ్‌కుమార్‌కు పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకుల శుభాకాంక్షలు

ఒంగోలు, మే 15 (ఆంధ్రజ్యోతి): గెలుపుపై పూర్తి ధీమాతో ఉన్న సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు జోష్ మీద కనిపిస్తున్నారు. పలు గ్రామలకు చెందిన నాయకులు బుధవారం పెద్దసంఖ్యలో ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని బీఎన్ కార్యాలయానికి తరలివచ్చారు. పార్టీ అభ్యర్థి విజయకుమార్‌ను కలిసి బొకేలు ఇచ్చి, శాలువాలు కప్పి ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని దాదాపు ఇరవైకి పైగా గ్రామాల నాయకులు, కార్యకర్తలు అలా బీఎన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలపడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కూటమికి ప్రజలు సానుకూలంగా ఉండటంతో పాటు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయడం, అభ్యర్థి విజయకుమార్ వైపు వివిధ వర్గాలు మొగ్గు చూపడం వంటి కారణాలతో మూడొంతులకు పైగా గ్రామాల్లో మెజార్టీ వస్తుందని ఆయా ప్రాంతాల నాయకులు బీఎన్ దృష్టికి తెచ్చారు. గ్రామాల వారీ ఆధిక్యంపై వారితో బీఎన్ సమీక్ష చేసి ఈ ఎన్నికల్లో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ శ్రేణులు పనిచేసిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



బీఎన్‌ను సత్కరిస్తున్న చీమకుర్తి పట్టణ నేతలు

కొండపి నియోజకవర్గంలో భారీ పోలింగ్

88.07శాతం ఓటింగ్

అత్యధికంగా మర్రిపూడిలో 91.91శాతం నమోదు

కొండపి, మే 15: కొండపి నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో భారీ పోలింగ్ నమోదైంది. 88.07శాతం ఓటింగ్ జరిగింది. అత్యధికంగా మర్రిపూడి మండలంలో 91.91శాతం ఓట్లు పోలయ్యాయి. కొండపి మండలంలో 91.37 శాతం, జరుగుమల్లి మండలంలో 90.22శాతం ఓటింగ్ జరిగింది. పొన్నలూరు మండలంలో 89.56శాతం, టంగుటూరు మండలంలో 87.41శాతం, సింగరాయకొండ మండలంలో 81.72శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,39,609మంది ఓటర్లు ఉండగా 2,11,016 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మర్రిపూడి మండలంలో 34,298 మంది ఓటర్లు ఉండగా, 31,534మంది ఓటు వేశారు. వారిలో 16,233 మంది పురుషులు, 15,301 మంది మహిళలు ఉన్నారు. పొన్నలూరు మండలంలో మొత్తం 33,913మంది ఓటర్లకు 30,371 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. వీరిలో 15,202 మంది పురుషులు, 15,169 మంది మహిళలు ఉన్నారు. జరుగుమల్లి మండలంలో మొత్తం 34,156 మంది ఓటర్లు ఉండగా 30,817 మంది ఓటు వేశారు. వారిలో పురుషులు 15,336 మంది, మహిళలు 15,480 మంది ఉన్నారు. కొండపి మండలంలో ఉన్న మొత్తం 34,304మంది ఓటర్లలో 31,345 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వారిలో పురుషులు 15,466 మంది, మహిళలు 15,878 మంది ఉన్నారు. టంగుటూరు మండలంలో 49,731 మంది ఓటర్లు ఉండగా.. 43,470 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 21,128 మంది, మహిళలు 22,342మంది ఉన్నారు. సింగరాయకొండ మండలంలో మొత్తం 53,207మందిలో 43,479 మంది ఓటు వేశారు. వారిలో 21,584 మంది పురుషులు కాగా, 21,895 మంది మహిళలు.

ఎక్కువ గ్రామాల్లో 90శాతంపైనే నమోదు

నియోజకవర్గంలోని ఎక్కువ గ్రామాల్లో 90శాతానికిపైగా ఓటింగ్ జరిగింది. మొత్తం 283 పోలింగ్ బూత్‌లు ఉండగా మొదటి బూత్ మర్రిపూడి మండలంలోని రాజుపాలెం నుంచి మొదలవుతుంది. ఇక్కడ 97.09శాతం పోలింగ్ నమోదైంది. సింగరాయకొండ మండలంలోని 260వ నెంబరు పోలింగ్ బూత్‌లో నియోజకవర్గంలోనే అతి తక్కువగా 65.86శాతం పోలింగ్ జరిగింది. ఇదేమండలంలోని 261 నంబరు పోలింగ్ కేంద్రంలో కూడా 68.68శాతం ఓటింగ్ నమోదైంది. ఈ మండలంలోని 250 నుంచి 266వ నంబరు బూత్‌ల వరకు పోలింగ్ 70 నుంచి 80శాతం లోపు మాత్రమే జరిగింది. ఇక్కడ పోలింగ్ శాతం తగ్గడానికి ఎక్కువగా వలస ఓటర్లు ఉండటమే కారణమంటున్నారు. మొత్తంగా పెరిగిన పోలింగ్ ఎవరికి లాభిస్తుందన్న అంశంపై ఆయా పార్టీలు తలమునకలయ్యాయి.

రేపటి నుంచి

కొండపిలో ఐదో విడత వేలం

ఇప్పటి వరకూ 5 మిలియన్ కిలోల కొనుగోలు

కిలోకు రూ.236.84 లభించిన సగటు ధర

కొండపి, మే 15 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో గురువారం నుంచి ఐదో విడత కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ 57 రోజులు జరిగిన వేలంలో 5 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరిగాయన్నారు. అందులో మేలు రకం 15శాతం, మీడియం గ్రేడ్ 16శాతం, లోగ్రేడ్ 69శాతం ఉన్నదన్నారు. రైతులకు సరాసరి ధర కిలోకు రూ.236.84 లభించిందన్నారు. అత్యధికంగా కిలోకు రూ.300, అత్యల్పంగా రూ.205 దక్కిందని తెలిపారు.

అత్యధిక పోలింగ్‌తో విజయంపై ధీమా

దర్శి, మే 15 : నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 90.91 శాతం పోలింగ్ నమోదుకావటంతో టీడీపీ కూటమి విజయంపై పూర్తి ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఓటర్లు వచ్చి ఓటు వేశారని భావిస్తున్నారు. వైసీపీ అరాచన పాలపై విసుగుచెంది ఆ పార్టీని ఓడించాలనే పట్టుదలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి టీడీపీకి ఓట్లు వేశారని ఆ పార్టీ వాళ్లు అంచనాలు వేస్తున్నారు. ఇతర దేశాల్లో ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు వారం రోజులు ముందే ఓటు వేసేందుకు వచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఉద్యోగులు ఒక్కసారిగా రావటంతో పట్టణాలు, గ్రామాలు కిలకిటలాడాయి. పోలింగ్ కేంద్రాల వద్ద 6 గంటలకే ఓటర్లు బారులు తీరటం, మండుటెండను సైతం లెక్కచేయకుండా ఓటు వేయటం చూస్తే రాష్ట్రాభివృద్ధి కాంక్షించి టీడీపీ కూటమికి ఓటు వేశారని స్పష్టమవుతుందని నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు. అంచనాకు మించి దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని పార్టీ క్యాడర్ ధీమా వ్యక్తం చేస్తుంది. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి అదేస్థాయిలో మెజార్టీ లభిస్తుందని చెబుతున్నారు. కేంద్రాల వారీగా లెక్కలు వేసి కొంతమంది మెజార్టీలను వివరిస్తున్నారు.

అవీ..ఇవీ..

ప్రైవేటు పాఠశాలల్లో 600 మందికి ఉచిత అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), మే 15 : బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో 600 మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డిసుభద్ర బుధవారం తెలిపారు. పాఠశాలల్లో మొదటి విడత ప్రవేశాలకు 696 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో బీసీలు 234 మంది, ముస్లింలు 53మంది, ఓసీలు 147 మంది, ఎస్సీలు 244, ఎస్టీలు 18 మంది ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మొదటి విడత ప్రవేశాలకు ఎంపికైన వారు వారికి కేటాయించిన పాఠశాలల్లో ఈనెల 10వతేదీలోపు సంబంధిత సర్టిఫికెట్లతో సమర్పించి ప్రవేశంపొందాలి. నిర్ణీత గడువులోపు జిల్లాలో మొత్తం 600 మంది విద్యార్థులు తమకు కేటాయించిన పాఠశాలల్లో ప్రవేశం పొందారు. 91 మంది తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరేందుకు విముఖత చూపారు. మిగిలిన ఐదు మందికి ప్రవేశాల కోసం ఈనెల 20 వరకు అవకాశం కల్పించారు. మొదటి విడత మిగిలిపోయిన సీట్లను రెండో విడత లాటరీలో ఎంపికైన విద్యార్థులతో భర్తీ చేస్తామని సుభద్ర తెలిపారు.

మోటార్‌సైకిల్ ఢీకొని యాచకుడికి గాయాలు

మద్దిపాడు, మే 15: గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్ ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. అద్దంకి వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న మోటార్‌సైకిల్ కారును అధిగమించబోయి అదుపుతప్పి యాచకుడు పి.రామచంద్రయ్యను ఢీ కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతుడిని చికిత్స కోసం మేదరమెట్లకు తరలించారు.

వెల్లంపల్లిలో కిలో పొగాకు రు.299

మద్దిపాడు, మే 15: వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు కొనుగోలు ఊపందుకుంది. కిలో రూ.299 గరిష్ఠ ధర పలికింది. సీతారాంపురం, బసవన్నపాలెం నుంచి 1020 బేళ్లు రాగా 985 బేళ్ల పొగాకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అయితే కనిష్ఠ ధర రూ.270, సరాసరిన కిలో రూ.269 వచ్చిందని వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ తెలిపారు. రైతులు నాణ్యమైన పొగాకును వేలం కేంద్రానికి తీసుకురావాలని ఆయన సూచించారు.

ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 15: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024-24 విద్యా సంవత్సరంలో మొదటి విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా కన్వీనర్, ఒంగోలు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీ.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను వచ్చేనెల 10వ తేదీ సాయంత్రం ఐదుగంటల లోపు నమోదు చేసుకోవాలన్నారు. నమోదుకు సంబంధించిన పత్రాలను ప్రింట్ తీసుకోవాలని, దరఖాస్తుల ప్రింట్ కాపీని, ఒరిజనల్ సర్టిఫికెట్లను తీసుకొని ప్రభుత్వ ఐటీఐలలో కచ్చితంగా వచ్చేనెల 10వతేదీలోపు వెరిఫికేషన్‌ను చేయించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8143130711 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

మాజీ సైనికుల సేవలు అభినందనీయం

ఒంగోలు(కలెక్టరేట్), మే 15: ఒంగోలు డివిజన్‌లో ఈనెల 13వతేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మాజీ సైనికులు విధులను సమర్థవంతంగా నిర్వహించారని మాజీ సైనికుల వెల్ఫేర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెప్పల్లి నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ ఆదేశాల మరకు 200మంది మాజీ సైనికులు ఎన్నికల విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఒంగోలు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో పోలింగ్ కేంద్రాల్లో విధులకు కేటాయించారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పనిచేసిన మాజీ సైనికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఆర్జేసీ ఫలితాల్లో వికాస్ విద్యార్థుల ప్రతిభ




నవీన్, జ్యోష్ణతేజ

ఒంగోలు(విద్య), మే 15: ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో ఒంగోలు నగరం అంజయ్యరోడ్డులోని శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. బైపీసీ విభాగంలో కొండపికి చెందిన కె.జ్యోష్ణతేజ 110 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 115వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో కొత్తపట్నంపల్లెపాలెంకు చెందిన చాపల నవీన్ 119 మార్కులతో 174వ ర్యాంకు సాధించారు. శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన వారిలో 15 మంది విద్యార్థులు 500లోపు ర్యాంకులు, 25 మంది వెయ్యిలోపు ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ కె.మోహనరావు, డైరెక్టర్ పి.వీరయ్య తెలిపారు. విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

మహిళా ఓటర్లలో ఉప్పొంగిన చైతన్యం

నాగులుప్పలపాడు మే 15: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మహిళా ఓటర్లలో చైతన్యం ఉప్పొంగింది. మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలోని 74 పోలింగ్ కేంద్రాలలో 56,139 ఓటర్లు ఉండగా, పురుష ఓటర్లు 27,437, మహిళా ఓటర్లు 28,701 మంది, థర్డ్ జెండర్ 1 కాగా ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో ఒకటి, రెండు పోలింగ్ కేంద్రాల మినహా మిగిలిన అన్ని చోట్ల మహిళా ఓటర్లదే పైచేయిగా నిలిచినట్లు అధికారులు ప్రకటన ద్వారా తెలుస్తున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా ఓటర్లు గంటల కొద్ది క్యూలైన్ లో నిలబడి మరీ తమ ఓటుహక్కును వినియోగించుకోవడం విశేషం. తిమ్మసముద్రం గ్రామంలోని 227 పోలింగ్ కేంద్రంలో 100 శాతం పోలింగ్ నమోదైంది. టీడీపీ కూటమికి మద్దతుగా నిలిచేందుకే మహిళా ఓటర్లు దండులా కదలి వచ్చినట్లు రాజకీయ వర్గాలలో చర్చ సాగుతోంది. మొత్తం మీద మహిళా ఓటర్ల చైతన్యానికి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

23 నుంచి సెల్‌ఫోన్ రిపేర్ ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, మే 15 : ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో ఈ నెల 23వ తేదీ నుంచి నిరుద్యోగ యువతకి సెల్‌ఫోన్ రిపేరుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న గ్రామీణ నిరుద్యోగ యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని, రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగిన వారు మాత్రమే ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో వసతి, ఉచిత భోజనం కల్పించబడుతుందని, వివరాలకు 9573363141 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

మాచవరం హైస్కూల్ విద్యార్థినికి 272వ ర్యాంకు



సుమశ్రీ

నాగులుప్పలపాడు, మే 15 : మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేసిన కందుకూరి సుమశ్రీ బుధవారం ప్రకటించిన గురుకుల పాఠశాల ప్రవేశపరీక్షా ఫలితాలలో 272 ర్యాంక్ సాధించారు. ఇటీవల విడుదల చేసిన పదో తరగతి ఫలితాలలో 587 మార్కులను సాధించిన సుమశ్రీ అనంతరం పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షా ఫలితాలలో 248 ర్యాంక్‌తో శభాష్ అనిపించుకున్నారు. గురుకుల పాఠశాల ప్రవేశపరీక్షలోనూ పాల్గొని ఉత్తమ ర్యాంక్ సాధించడంతో ఆమెను పాఠశాల హెచ్ఎం బి.శివరామప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందిచారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



విజేత కోటి ఫ్రెండ్స్‌కు ప్రథమ బహుమతిని అందిస్తున్న దాతలు

నాగులుప్పలపాడు, మే 15: ఉప్పుగుండూరు గ్రామంలో అడ్వాన్స్‌డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఎస్ఏ)ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. చీరాల కోటి ఫ్రెండ్స్ టీం విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో చీరాల కోటి ఫ్రెండ్స్, స్టార్ బాయ్స్ రజానగరం జట్ల మధ్య ఉత్కంఠంగా జరిగిన మ్యాచ్‌లో కోటి ఫ్రెండ్స్ విజేతగా నిలిచి ప్రథమ బహుమతి రూ.30,116 అందుకొన్నారు. రెండవ బహుమతి స్టార్ బాయ్స్ రజానగరం రూ.20,116, మూడవ బహుమతి యువ లెవన్స్ ఒంగోలు రూ.15,116 నాల్గవ బహుమతి అడ్వాన్స్‌డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రూ.10,116 దక్కించుకున్నారు. విజేతలకు దాతలైన కొలకలూరి విజయ్, కొలకలూరి వినయ్, కొంజేటి సురేష్, మాదాసు రాంబాబు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది.

దర్శిలో జోరుగా బెట్టింగులు

ఒంగోలు ఎంపీతోపాటు దర్శి అసెంబ్లీ అభ్యర్థుల గెలుపుపై పందేలు

రాష్ట్రంలో పలు స్థానాలపైనా గురి...

నమ్మకమైన మధ్యవర్తుల సమక్షంలో చేతులు మారుతున్న డబ్బు

దర్శి, మే 15 : ఎన్నికల ఫలితాలపై దర్శి ప్రాంతంలో జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ఈ బెట్టింగులు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక నుంచే ఆరంభమయ్యాయి. తొలుత ఏ పార్టీ తరఫున ఎవరు అభ్యర్థి అవుతారనేదానిపై పందెలు కాయగా.. ఇప్పుడు పోలింగ్ పూర్తయిన తర్వాత పార్టీల విజయాలపై బెట్టింగ్‌లు మరింత ఊపందుకున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభిమానులతో పాటు మరికొంత మంది ఇతర రంగాలకు చెందిన వ్యాపారులు కూడా లాభాపేక్షతో బెట్టింగులు పెడుతున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వర్గీయులు, వైసీపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ సానుభూతిపరులు బెట్టింగులు పెడుతున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందనే విషయంపై పందేలుకు తొలుత ఉధృతంగా ముందుకు వచ్చిన వైసీపీ అభిమానులు పోలింగ్ తర్వాత వారు కాస్త వెనకు అడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దర్శి అసెంబ్లీ సీటు ఎవరు గెలుస్తారు.. ఒంగోలు పార్లమెంట్ సీటు ఎవరు గెలుస్తారు.. జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనే అంశాలపై అధికసంఖ్యలో బెట్టింగులు జరుగుతున్నాయి. అదేవిధంగా సీఎం వైఎస్ జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, సినీహీరో బాలకృష్ణ, నారా లోకేష్‌కు ఆయా నియోజకవర్గాల్లో వచ్చే మెజార్టీలపై జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ప్రతిసారి ఎన్నికల సమయంలో బెట్టింగులు పెట్టటం ఆనవాయితీగా మారింది. 2014లో ఇరువర్గాలు కోట్లాది రూపాయలు బెట్టింగులు పెట్టగా ఆ సమయంలో టీడీపీ వర్గీయులు పందాలు గెలుచుకున్నారు.



2019లో అదేవిధంగా ఇరు పార్టీలకు చెందిన అభిమానులు పందాలు పెట్టగా వైసీపీ వర్గీయులు గెలుచుకున్నారు. ఈ సారీ కూడా కోట్లాది రూపాయలు పందాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో, పందాలు ఎవరికి దక్కుతాయోనని ఎదురు చూస్తున్నారు.

బెట్టింగ్‌లు కాస్తుంది ఇలా...

ఒంగోలు ఎంపీ వైసీపీ అభ్యర్థి తరఫున లక్షా ఇరవై వేల రూపాయలు పందెం కాస్తే.. టీడీపీ అభ్యర్థి తరఫున లక్ష రూపాయలు బెట్టింగ్ కాస్తున్నారు. అలాగే దర్శి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి గెలిస్తే లక్షా ఇరవై వేల రూపాయలు, టీడీపీ గెలిస్తే లక్ష రూపాయలు ఇచ్చేలా బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇందుకుగాను మధ్యవర్తులు కొందరు ఐదు శాతం, ఇంకొందరు రెండు శాతం కమీషన్ తీసుకుంటున్నట్లు సమాచారం.

మరో మూడు ఎన్నికల కేసుల నమోదు

దర్శి, మే 15 : ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలపై పోలీసులు మరో మూడు కేసులు నమోదు చేశారు. బొట్లపాలెంలో తమపై మరణాయుధాలతో దాడిచేసి గాయపర్చారని తమ్మిశెట్టి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు వైసీపీ వర్గీయులు గంగిరెడ్డి అంజిరెడ్డి, మరో 11 మందిపై కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన భోగిరెడ్డి సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ వర్గీయులు బత్తిన శ్రీను మరో 10 మందిపై కేసు నమోదు చేశారు. దేవరంలో కె.నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ వర్గీయులు సాని గురవయ్య మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. దర్శి-కురిచేడు రోడ్డులో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కారుపై రాళ్లతో దాడి చేసిన వైసీపీ వర్గీయులపై కేసు నమోదు చేయకపోవటంపై టీడీపీ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పక్షపాత వైఖరి అవలంభిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అక్కడ జరిగిన సంఘటన వీడియోలను పరిశీలిస్తే ఎవరు ఎవరిపై దాడులు చేశారో స్పష్టమవుతుందని టీడీపీ వర్గీయులు చెబుతున్నారు.

వైసీపీ నాయకుడిపై కేసు

పీసీపల్లి, మే 15 : టీడీపీ కార్యకర్తపై దాడి చేసిన ఘటనలో వైసీపీ నాయకుడిపై పీసీపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంగళవారం లింగన్నపాలేనికి చెందిన టీడీ పీ కార్యకర్త భైరబోయిన మల్లికార్జున్ లక్ష్మక్కపల్లికి వెళ్లాడు. అక్కడ ఉన్న అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రత్నారెడ్డి అతని అనుచరులు మరికొంతమంది తనపై దాడిచేశారంటూ మల్లికార్జున్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు రత్నారెడ్డి మరికొందరిపై కేసు నమోదు చేశా రు. ఫిర్యాదు విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు మల్లికార్జునే తమపై దాడిచేశాడని మాలకొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మల్లికార్జున్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

టంగుటూరులో పొగాకు కిలో రూ.300

టంగుటూరు, మే 15 : మేలు రకం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.300 పలికింది. స్థానిక వేలం కేంద్రంలో ఇది లభించింది. బుధవారం ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, జయవరం రైతులకు చెందిన పొగాకు బేళ్లను వేలానికి అనుమతించారు. మొత్తం 1,043 బేళ్లను రైతులు తీసుకురాగా 987 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో ఎన్‌బీ-10, ఆర్‌ఆర్-8, సీఆర్-21 అయ్యాయి. గరిష్ఠ ధర కిలోకు రూ.300 లభించగా, కనిష్ఠ ధర రూ.205 దక్కింది. సరాసరి ధర రూ.264.65గా ఉంది. కొనుగోళ్లలో 17 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

వాగులోకి దూసుకుపోయిన కారు

● డ్రైవర్ మృతి, పలువురికి గాయాలు

కారంచేడు(పర్చూరు), మే 15: కారు అదుపుతప్పి వాగులోకి దూసుకుపోయి వ్యక్తి మృతి చెందగా, పలువురికి స్వల్పగాయలైన సంఘటన కారంచేడు మండల పరిధిలోని రామానాయుడు వారధి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. చిలకలూరిపేట నుంచి కుటుంబ సభ్యులతో వాడరేవు వెళతుండగా కారు అదుపు తప్పి పక్కనే ఉన్న వాగులోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో కారు డ్రైవర్ మహబూబ్ సుభాని (55) మృతి చెందగా, కారులో ఉన్న మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న కారంచేడు పోలీసులు సంఘటనా స్థలానికి చే రుకొని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై సురేష్ తెలిపారు.

ఇనుప రాడ్‌తో దాడి

చీరాలటౌన్, మే 15 : వ్యక్తిపై మరోవ్యక్తి ఉద్దేశపూర్వకంగా ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక విఠల్‌నగర్‌లోని పోలేరమ్మ గుడి సమీపానికి చెందిన పట్నాన పాపారావు సిమెంట్ లోడ్ ఆటో డ్రైవర్, అలాగే అదే ప్రాంతానికి చెందిన బస రాంబాబు బోరింగ్స్ పని చేస్తుంటాడు. వీరిద్దరికీ మంగళవారం రాత్రి ఓ కార్యక్రమంలో భోజనాల వద్ద వివాదం జరిగింది. ఈక్రమంలోనే బుధవారం పనికి వెళ్లేందుకు ఆటో ఇంటి వద్ద బయటకు తీస్తున్న సమయంలో రాంబాబు ఒక్కసారిగా ఇనుపరాడ్డుతో గట్టిగా తలపై మోది పరారయ్యాడు. ఈ నేపథ్యంలో పాపారావు రక్తగాయలతో ఉండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

బస్సుప్రమాదంలో
చీరాలవాసి దుర్మరణం

మరో 15 రోజుల్లో కుమార్తె నిశ్చితార్థం..ఈలోపే ఘటన

ప్రమాదం జరిగిన 10 గంటల తరువాత కుటుంబసభ్యులకు సమాచారం

పెద్ద దిక్కును కోల్పోయి బోరున విలపిస్తున్న కుటుంబం

రాలేనని చెప్పినా.. ట్రావెల్స్ వారు బలవంతంగా తీసుకెళ్లారని బంధువుల ఆరోపణ

చీరాలటౌన్, మే 15 : చిలకలూరి పేట వద్ద అర్ధరాత్రి జరిగిన ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో చీరాల సమీపంలోని పేరాలకు చెందిన షేక్ మస్తాన్ షరీఫ్(45) దుర్మరణం చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. షరీఫ్ సుమారుగా 25 సంవత్సరాలుగా కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కొంతకాలంగా చీరాల్లోని ఓ ప్రైవేటు బస్సుకు కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇతనికి భార్య నజ్మా, కుమార్తె రిజ్వాన, కుమారుడు అబ్బాస్ సంతానం. అయితే కుమారుడిని చదివించే స్తోమత లేకపోవడంతో వెల్డింగ్ పనికి వెళుతున్నాడు. కమార్తెకు నూజివీడులో మంగళవారం సంబంధం కుదిరింది. ఈనెల 30న నిశ్చితార్థం చేసుకునేందుకు మాట్లాడుకున్నారు. అయితే నూజివీడు నుంచి ప్రయాణం చేసి రాత్రికి ఇంటికి చేరారు. అయితే ట్రావెల్స్ యజమాని కచ్చితంగా బస్సుకు రావాల్సిందేనని తీసుకువెళ్లినట్లు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కానీ రాత్రి 10 గంటల తరువాత డ్యూటీకి వెళ్లిన తరువాత బుధవారం ఉదయం 10 గంటలకు సంఘటన స్థలం నుంచి ఫోన్ వచ్చిందని కుటుంబ సభ్యులు చెప్తున్నారు. ప్రమాదంలో షరీఫ్ మృతిచెందడంతో వారు బోరున విపిస్తున్నారు. అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న షరీఫ్ మృతిపై స్థానికులు విషాదం వ్యక్తం చేశారు.



షేక్ మస్తాన్‌షరీఫ్(ఫైల్)

ధర్మం వైపు నిల్చున్న ఓటర్లు

కూటమి విజయం తథ్యం ● ప్రజా తిరుగుబాటు వైసీపీకి గుణపాఠం

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

సంతమాగులూరు (అద్దంకి), మే15 : మంచికి, చెడుకు మధ్య జరిగిన ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ధర్మం వైపు నిలబడ్డారని ఎమ్మెల్యే, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మం డలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద బుధవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నేతలతో రవికుమార్ ఎన్నికల సరళిపై చర్చించారు. ఈ సందర్భంగా రవికుమా ర్ మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే భారీ ఓటింగ్ నమోదైందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమన్నారు. చంద్రబాబు నిర్విరామ కృషికి ఈ ఎన్నికలు నిదర్శనంగా నిలువబోతున్నాయన్నారు. ఎన్నికలలో పవన్‌కల్యాణ్, బీజేపీ నేతల కృషి మరువలేనిదన్నారు. వైసీపీ సీనియర్ నాయకులకు సైతం డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి స్థానికంగా ఓటర్లు భారీగా తరలి వచ్చి ఎన్నో కష్టాలు ఎదురైనా ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు తరలివచ్చినందుకు రవికుమార్ ధన్యవాదములు తెలిపారు. ప్రజాతిరుగుబాటు వైసీపీకి గుణపాఠం కాబోతుందని, ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం, అద్దంకి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని గొట్టిపాటి ధీమా వ్యక్తం చేశారు. పలు మండలాల నేతలు ఆయా గ్రామాలలో వచ్చే మెజార్టీల వివరాలను రవికుమార్‌కు వివరించారు.

అద్దంకిలో 88 శాతం పోలింగ్

● వినియోగించుకున్న అధికులు పురుషుల ఓటర్లే

అద్దంకి, మే 15 : అద్దంకి నియోజకవర్గంలో 13వ తేదీ జరిగిన పోలింగ్ లో 88.25 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్వో సునీల్ బుధవారం విడుదల చేసినట్లు ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉండగా 2,15,375 మంది ఓటుహక్కు వినియోగించుకొని 88.25 శాతం ఓటింగ్ జరిగింది. మొత్తం 1,19,570 మంది పురుషులు కాగా 1,05,718 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 88.42 శాతం మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం మహిళా ఓటర్లు 1,24,475 మంది కాగా 1,09,654 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 88.10శాతం మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతరులు 12 మంది కాగా ముగ్గురు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 25 శాతం మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్ల పరంగా పరిగణలోకి తీసుకుంటే పురుషులు 1,05,718 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, మహిళలు 1,09,654 మంది ఓటు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం పరిగణలోకి తీసుకుంటే పురుషులు 88.42 శాతం, మహిళలు 88.10 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటర్ల పరంగా మహిళా ఓటర్లే ఎక్కువ ఉన్నప్పటికీ ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషుల కంటే మహిళల శాతమే తక్కువ.

గతం కన్నా పెరిగిన పోలింగ్ శాతం

మేదరమెట్ల, మే 15 : కొరిశపాడు మండలంలో సార్వత్రిక ఎన్నికలల్లో భారీగా పోలింగ్ జరిగింది. మండలంలోని 15 పంచాయతీలలో పురుషుల కన్న మహిళలే ఎ క్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. రావినూతల, కుర్రవానిపాలెంలో రెండు ఈవీఎంలో గంట పాటు మొరాయించాయి. దైవాలరావూరులో అత్యధికంగా 90శాతం పోలింగ్ జరిగింది. మేదరమెట్ల పమిడిపాడు, రావినూతల గ్రామాల్లో కూడా ఓటింగ్‌లో మహిళలే ముందున్నారు. మండలంలోని మొత్తం 33,039 ఓటు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 15,949, మహిళలు 17,090 మంది ఉన్నారు. 1141 మంది మహిళలు అధికంగా ఓటు వినియోగించుకున్నారు. మేదరమెట్లలో అత్యధికంగా 8,659 మంది ఓటర్లు ఉండగా వారిలో 7,091 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మేజర్ పంచాయతీ రావినూతలలో 5,409 మంది ఓట్లు ఉండగా 4,514 మంది ఓట్లేశారు. గతంలో కొరిశపాడు మండలంలో తెలుగుదేశం పార్టీకి 2850 వరకు మెజార్టీ వచ్చింది. ఇప్పుడు పోలింగ్ అధికంగా జరగడం తమకు లాభిస్తుందని తెలుగుదేశం వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

బాధ్యతతో వచ్చిన రావినూతలవాసులు

రావినూతలకు చెందిన ఓటర్లు ఎన్నికలల్లో తమ ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో ఇతర దేశాలు, హైదరబాద్, బెంగళూరు వంటి నగరాల నుంచి తరలివచ్చారు. రెండవ శనివారం ఆదివారం రావడంతో శుక్రవారం రాత్రి బయలుదేరి, శనివారం తమ సొంత వాహనాల్లో బయలు దేరి గ్రామాలకు చేరుకున్నారు. హైదరాబాద్, బెంగళూరులో ఉన్న రావినూతలవాసులు పరస్పరం మాట్లాడుకుని సోమవారం ఓటును వినియోగించుకునేందుకు వచ్చారు. బస్సులలో సుమారు 500మంది, సొంత వాహనాల్లో, వివిధ మార్గాల ద్వారా మరో 400 మంది వచ్చి ఓటు వేశారు. వీరిలో కొందరు మాట్లాడుతు రాష్టంలో అభివృద్ధి లేకపోవడం, కక్షపూరిత రాజకీయాలు సహించలేక ఓటు హక్కుతో సరైన అభ్యర్థులను ఎన్నుకునేందుకు వచ్చామన్నారు.

రాష్ట్రంలో అత్యధికంగా దర్శిలో పోలింగ్

దర్శి, మే 15 : సార్వత్రిక ఎన్నికల్లో దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 90.91 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూలేని విధంగా నియోజకవర్గ చరిత్రలో కూడా గరిష్ఠ స్థాయిలో పోలింగ్ నమోదై రికార్డు సృష్టించింది. మొత్తం 2,26,370 మంది ఓటర్లు ఉండగా, 2,05,792 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా ముండ్లమూరు మండలంలో పోలింగ్ నమోదైంది. దర్శి పట్టణంలో 29,717 మంది ఓట్లు ఉండగా 24,219 మంది 81.18 శాతం మంది ఓట్లు వేశారు. దర్శి రూరల్ మండలంలో 43,171 మంది ఓటర్లు ఉండగా 40,016 మంది 92.69 శాతం ఓటింగ్ నమోదైంది. దొనకొండ మండలంలో 37,805 మంది ఓటర్లు ఉండగా, 34,848 మంది 92.21 శాతం ఓటింగ్ నమోదైంది. కురిచేడు మండలంలో 32,330 మంది ఓటర్లు ఉండ గా, 29,570 మంది 91.82 శాతం పోలింగ్ నమోదైంది. ముండ్లమూరు మండలంలో 45,625 మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా 42,342 మంది ఓట్లు వేయగా 93.22 శాతం పోలింగ్ నమోదైంది. తాళ్ళూరు మండలంలో 37,722 మంది ఓటర్లు ఉండగా, 34,797 మంది ఓటు వేయగా 91.98 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గం మొత్తంమీద 1,03,931 మంది పురుషులు, 1,01,860 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా దర్శి మండలంలోని చిన ఉయ్యాలవాడలో 98.64 శాతం పోలింగ్ నమోదై రికార్డు సృష్టించింది.



కంకణంపాడు పంచాయతీలో రాత్రి పూట క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా గ్రామాలకు చెందిన ఇరువర్గాలకు చెందిన వ్యక్తులతో పాటు వివాదాలకు కారణమయ్యే వ్యక్తులను గుర్తించి బైండోవర్లు చేశారు. గతఎన్నికల్లో శివరాపురం గ్రామంలో పోలింగ్ రోజున వివాదం జరగటంతో ఆ గ్రామంపై దృష్టి సారించిన జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్ స్వయంగా ఆ గ్రామంలో శాంతి సమావేశం ఏర్పాటు చేసి గ్రామస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తూర్పుగంగవరం, దోసకాయలపాడు గ్రామాల్లోని బూత్‌ల్లో పోలింగ్ సరళిని పరిశీలించే సమయంలో ఆయనతో పాటు వైసీపీ నాయకులు లోనికి వెళ్లటంతో టీడీపీ శ్రేణులు అభ్యంతరం తెలపటంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. అక్కడే ఉన్న ఎస్సై సర్దుబాటు చేశారు.

ముండ్లమూరు మండలంలో 93.22 శాతం

2019 కంటే 20 శాతం అదనం

ముండ్లమూరు, మే 15 : మండలంలోజరిగిన ఎన్నికల్లో 93.22 పోలింగ్ శాతం నమోదైంది. మొత్తం 45,625 ఓట్లు ఉండగా అందులో పురుషులు 21,473 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్త్రీలు 20,868, ఇతరులు 1, పురుషులు, స్త్రీలు కలిపి 42,342 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 93.22 శాతం పోలింగ్ నమోదైంది. 2019 కంటే 20 శాతం అధికంగా పోలింగ్ నమోదైంది. ఈ సారి ఎక్కువగా మహిళలు, నిరుద్యోగులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొనటంతో ఒక్కసారిగా ఎక్కువ శాతం నమోదైంది. రాష్ట్రంలో దర్శి నియోజక వర్గం పోలింగ్ శాతంలో ప్రథమ స్థానంలో నిలవగా నియోజకవర్గంలో ముండ్లమూరు మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. పోలింగ్‌ను నమోదును ఒకసారి పరిశీలించినట్లయితే మారెళ్ల, ముండ్లమూరు, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో మహిళలు ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైతే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు పట్టణాల నుంచి వచ్చి ఓటింగ్‌లో పాల్గొనటం గమనార్హం.

గతంలో ఎన్నడూ లేనంతగా ప్రశాంతం

తాళ్లూరు, మే 15 : మండలంలోని అన్ని గ్రామాల్లో 92.2శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని 46 పోలింగ్ బూతుల్లో 37,722 మంది ఓటర్లు ఉండగా 34,797 మంది ఓటర్లు ఓటు హక్కువినియోగించు కోగా 92.2శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ లేనంత ప్రశాంతంగా ముగియటంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగానే ఎస్.ఐ వైవీ రమణయ్య గత ఎన్నిక సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరిగిన

వెలిగండ్ల మండలంలో పెరిగిన ఓటింగ్ సరళి

వెలిగండ్ల, మే 15 : మండలంలో 2019 ఎన్నికల కంటే పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ఆ ఎన్నికల్లో 86.50 శాతం పోలింగ్ జరగ్గా ఈ సారి 87.83శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 28,655 మంది ఓటర్లు ఉండగా వారిలో 25,168 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోటాలపల్లి, గుడిపాటిపల్లి, మరపగుంట్ల, మెటుపల్లి, అగ్రహారం, కంకణంపాడులోని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ జరిగింది.

ఓటేసేందుకు వచ్చి..ప్రాణాలు వీడి..

- చిలకలూరిపేట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- టిప్పర్‌ను ఢీకొట్టి దగ్ధమైన ప్రైవేటు ట్రావెల్స్
- నీలాయపాలెంవాసులు నలుగురు దుర్మరణం
- వారిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు
- ఇద్దరు డ్రైవర్లు మృతి



బస్సులోని మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

పర్చూరు, మే 15 : సొంతూరిపై మమకారం.. ఓటు వేయాలన్న దృఢ సంకల్పం.. పిల్లా జెల్లాతో ఇంటిల్లిపాదీ సొంత ఊళ్లకు వచ్చారు. ఓటు హక్కును హక్కు బాధ్యతగా భావించి, ఓటేసి తిరిగి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మణం పాలయ్యారు. ఓటేసేందుకు సొంత ఊళ్లకు వచ్చి ఒక్కరోజు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. తిరిగి వారు ఉద్యోగ, వ్యాపారాలు చేసే ప్రాంతాలకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. అంతలోనే మృత్యువు కాటేసింది. ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామ సమీపంలో ప్రమాదం జరిగింది. చినగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన ఒకే కుటుంబంవాళ్లు కాశీ బ్రహ్మేశ్వరరావు (65), భార్య లక్ష్మి (60), మనవరాలు ఖ్యాతి (10), అదే మండలం గొనసపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (54) సజీవదహనమయ్యారు. నీలాయపాలెం గ్రామానికి చెందిన 10 మంది బస్సులో ప్రయాణిస్తుండగా, అందులో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు మృతి చెందడం విషాదకరం. ఈ సంఘటనలో ఇద్దరు డ్రైవర్లతో సహా బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవ దహనమయ్యారు. కళ్లు తెరిచేలోపే బస్సు కాలి బూడిదయింది. గాఢ నిద్రలో ఉన్న పదుల సంఖ్యలో ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. స్థానికులు అప్రమత్తమై 108, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మిన్నంటిన ఆర్తనాదాలు

అర్ధరాత్రి కారుచీకట్లో బస్సు అగ్నికి ఆహుతి కావడం అందులో ఉన్న ప్రయాణికులు కాలిపోతూ చేసిన ఆర్తనాదాలు పలువురిని దిగ్భ్రాంతికి గురిచేశాయి. అసలు ఏమి జరిగిందో అర్థం కాని స్థితిలో ప్రాణాలతో బయట పడిన వారు తీవ్ర ఆందోళనకు గురిఅయ్యారు.

మాసంపు ముద్దల్లా మృతదేహాలు

ఒక్కసారిగి బస్సు దగ్ధం కావడంతో అందులో ఉన్న ప్రయాణికులు సజీవదహనమయ్యారు. బస్సులో మృతదేహాలు చల్లాచెదురుగా గుర్తించలేని స్థితిలో మాంసం ముద్దల్లా మారాయి. ఎవరి మృతదేహం అనేది గుర్తిచలేని స్థితి నెలకొంది.

కంటతడి పెట్టించిన ప్రమాదం

బస్సులో మృతి చెందిన వారి శరీరాలు చెల్లాచదురుగా మాంసం మద్దల్లా పడి ఉండటం చూపరులను కంటతడి పెట్టించాయి. బంధువుల రోదనలు మిన్నంటాయి.



ఖాళీగా ఉన్న ట్రాఫిక్‌పోలీస్ చెక్‌పోస్టు



అడ్డదిడ్డంగా తిరుగుతున్న వాహనాలు

నగరంలో ట్రాఫిక్ రద్దీ..!

● పట్టించుకోని పోలీసులు

ఒంగోలు(క్రైం), మే15: ఒంగోలు నగరంలో ఒక్కసారిగా ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ఎన్నికల సందర్భంగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు వచ్చిన వారితో పాటు వివిధ గ్రామాల నుంచి ఒంగోలు వచ్చేవారితో కిటకిటలాడిపోయింది. బుధవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వాహనాల రాకపోకలతో నిండిపోయింది. కనీసం ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది లేక పోవడంతో పద్మవ్యూహంలా ట్రాఫిక్ మారింది. బస్టాండ్‌సెంటర్‌లో నగరంలో నుంచి బయటకు పోయే బస్సులు , వివిధ పనులు పై ఒంగోలు వచ్చిన వారి ద్విచక్రవానాలు, కార్లతో కిక్కిరిసి పోవడంతో పాదచారులు సైతం రోడ్డు దాటేందుకు ఇబ్బందులకు గురయ్యారు. బస్టాండ్ సెంటర్ నుంచి బయటకు రావడానికి అరగంట సమయం పడుతుందని పలువురు వాపోయారు. అదే సమయంలో ట్రాఫిక్ పోలీసులు విధులలో లేక పోవడం మరింత సమస్యగా మారింది.



ఆర్టీసీ బస్టాండు వద్ద ఆగిన వాహనాల రాకపోకలు



బస్సుకు అడ్డంగా వచ్చిన కారు

గెలుస్తున్నాం.. అభివృద్ధిలో ముందుంటాం

● టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య



మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, మే 15 : ఎన్నికల్లో చీరాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుస్తున్నాం. అభివృద్ధిలో ముందుంటామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. తనకు సహకరించిన కూటమి శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. చీరాల టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో చెదురు మదురు ఘటనలు తప్ప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వ్యూహాత్మకంగా పనిచేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చీరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు. చంద్రబాబు తన ను నిరంతరం వెన్నుతట్టి ప్రోత్సహించారన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో చంద్రబాబు సహకారం తనకు పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, నాతాని ఉమామహేశ్వరరావు, గుద్దంటి చంద్రమౌళి, వీరయ్యచౌదరి, నాశిక వీరభద్రయ్య, గజవల్లి శ్రీనివాసరావు, బొగ్గుల పార్థసారధి, గూడూరు శివరామప్రసాద్ పాల్గొన్నారు.


కొళాయిల వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

తాగునీటి కోసం తప్పని తిప్పలు

పొదిలి, మే 15 : పొదిలి పట్టణంలో తాగునీటి కోసం తిప్పలు తప్పడం లేదు. కొళాయిల వద్ద గంటల తరబడి వేచి ఉన్నా కనీసం రెండు బిందెలు కూడా రావడంలేదని ప్రజలు వాపోతున్నారు. వాటినే మళ్ళీ వచ్చే 15రోజుల వరకు వాడుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ప్రజలు వాపోతున్నారు. మినరల్ వాటర్ కూడా గతంలో 10 రూపాయలు ఉండేదని, నీటి అవసరాన్ని ఆసరాగా చేసుకొని యజమానులు బబుల్ 15 రూపాయలకు పెంచారని చెబుతున్నారు. కానీ మినరల్ వాటర్ కూడా సరిగా ఫిల్టర్ చేయడం లేదని చెబుతున్నారు. వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి హెచ్చరికలు జారీ చేసినా వారిలో ఏమాత్రం మార్పు లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగునీటిని వారానికి ఒకరోజైనా సరఫరా చేస్తే ఇబ్బందులు కొంతవరకైనా తొలగుతాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మినరల్ వాటర్ ప్లాంట్‌లపై కూడా దృష్టి పెట్టి నాణ్యమైన నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కదం తొక్కిన యువోత్సాహం

● కీలకం కానున్న నూతన ఓటర్లు

మార్కాపురం, మే 15: గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లు పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల్లోపు యువత ఓట్లు 90 శాతానికి పైగా పోలయ్యాయి. మరీ ముఖ్యంగా నూతనంగా ఓట్లు పొందిన యువత 95 శాతానికిపైగా ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం. పోటీలోఉన్న అభ్యర్థుల గెలుపోటముల్లో యువత ఓట్లే కీలక భూమిక పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విద్య, ఉద్యోగరీత్యా దూరప్రాంతాల్లో ఉన్న వాళ్లు కూడా వచ్చి ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. కొందరు అభ్యర్థులు వారు వచ్చి ఓటేసేందుకు చార్జీలను ఇచ్చారు. మరికొందరు ఆయా పార్టీలపై అభిమానంతో స్వచ్ఛందంగా ఖర్చులకుసైతం వెనుకాడకుండా ఓట్లు ఉన్న ప్రాంతాలకు చేరుకున్నారు. ఏదిఏమైనా గతంతో పోల్చితే యువ ఓటర్లలో చైతన్యం ఓటింగ్ సరళిలో స్పష్టంగా కనిపిస్తోంది.

నూతన ఓటర్లలో చైతన్యం

మార్కాపురం నియోజకవర్గంలో ఈ సార్వత్రిక ఎన్నికలకు మొతం 4 వేలకుపైగా యువత నూతనంగా ఓట్లు పొందింది. 18 సంవత్సరాలు నిండిన వాళ్లకు ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం పలుమార్లు అవకాశాలు కల్పించింది. అంతేకాక ఓట్లు నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. రాజకీయ పక్షాలు కూడా దృష్టిపెట్టి 18 సంవత్సరాలు నిండిన వాళ్లకు ఓటు హక్కు వచ్చేందుకు కృషి చేశారు. దీంతో అర్హత కల్గిన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు పొందారు. ఓటు పొందడం ఒక ఎత్తయితే వారంతా ఉత్సాహంగా తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం స్ఫూర్తిదాయకం. సమకాలీన పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహన ఉండే యువత ఎక్కువగా ఓటింగ్ పాల్గొనడం రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిగా మారుతుందనేది నిర్వివాదాంశం.


ఓటు వేసినట్లు చూపుతున్న యువకులు

ఎర్రగొండపాలెంలో 89.40 శాతం పోలింగ్

ఎర్రగొండపాలెం, మే 15 : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 207214 మంది ఓటర్లు ఓటు హక్కు కల్గి ఉండగా సోమవారం జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 18,5242 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 89.40 శాతంగా నమోదు అయ్యింది. నియోజకవర్గంలో 265 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 1,05,230 మంది పురుషులు ఓటర్లు ఉండగా 93,944 మందిఓటు వేశారు. 1,01,982 మంది మహిళా ఓటర్లు ఉండగా 91,296 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఇతరులు 2 ఓట్లు వేశారు, దీనితో జిల్లాలో రెండవ స్థానంలో 89.40 శాతం ఓట్లు నమోదు అయ్యాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 2009లో 72.7 శాతం, 2014లో 78.4 శాతం ,2019లో 79.6 శాతం ఓట్లు పోలుకాగా, 2024లో 89.40 శాతం ఓట్లుపోల్ అయి అధిక శాతం నమోదు చేసుకుంది.

కంభం మండలంలో 82.18 శాతం ఓటింగ్

కంభం, మే 15 : కంభం మండలంలో సోమవారం జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి మొత్తం 37,860 మంది ఓటర్లకు గాను 32,030 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 15,719 మంది, స్త్రీలు 16,310 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. మండలంలో ఉదయం 7గంటల నుంచి ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోటెత్తిన విషయం విదితమే. కాగా కంభం మండలం ఎల్.కోట పంచాయతీలో మొత్తం ఓటర్లు 1,093 ఉండగా పురుషులు 565 మందికి గాను 478 మంది, మహిళలు 528 మందికి గాను 458 మంది ఉన్నారు. మొత్తం 936 ఓట్లు పోలు కాగా 85.64 శాతం పోలైంది. ఈ పంచాయతీలో కమ్మ ఓటర్లు అధిక శాతం ఉండడంతో టీడీపీకి అత్యధికంగా ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది. ఇక లింగాపురంలో మొత్తం 963 ఓట్లకు గాను పురుషులు 472, మహిళలు 491 ఓటు హక్కును వినియోగించుకుని 963 పోలై నూరు శాతం పోలింగ్ జరిగింది. ఈ పంచాయతీ దివంగత మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి స్వగ్రామం కావడం, ఆయన కుమారుడు కందుల గౌతమ్ రెడ్డి పరోక్షంగా టీడీపీకి సపోర్టుగా నిలువడంతో అక్కడ కూడా టీడీపీ ఎక్కువ ఓట్లు నమోదైనట్లు తెలుస్తుంది.

అర్ధవీడు మండలంలో 88.17 శాతం ఓటింగ్

అర్ధవీడు మండలంలో సోమవారం జరిగిన ఎన్నికలకు సంబంధించి మొత్తం 27,951 మంది ఓటర్లకు గాను 25,029 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 12,521 మంది, స్త్రీలు 12,506 మంది, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

గ్రామాల్లో కలిసి కట్టుగా ఉండాలి

బేస్తవారపేట,మే15: ఎన్నికల కౌంటింగ్ జరిగేంతవరకు గ్రామాల్లో ఎటువంటి సమస్యలను పెద్దగా చేయవదని బేస్తవారపేట ఎస్సై బి.నరసింహారావు అన్నారు. బుధవారం బేస్తవారపేట మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల గెలుపుపై ఎటువంటి బెట్టింగ్‌లు పెట్టరాదని,వాటిని దృష్టిలో పెట్టుకొని ఘర్షణలకు దిగటం నేరమని అన్నారు. అందరూ ఎన్నికలకు ముందు గ్రామాల్లో ఎలా ఉన్నారో అలానే కలసి కట్టుగా ఉండాలని గ్రామస్థులను కోరారు.


పెద్ద ఓబినేనిపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఏస్సై

యథేచ్ఛగా పంట కాలువల ఆక్రమణ

● పక్కా గృహాల నిర్మాణం

● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

కంభం, మే 15 : కంభం పట్టణంలో చారిత్రాత్మక కంభం చెరువు ప్రధాన పంట కాలువలన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. పలువురు కాలువలపై పక్కాగృహాలు, రేకుల షెడ్లు నిర్మించుకున్నారు. కంభం నుంచి అర్ధవీడుకు వెళ్ళే నక్కలగండి కాలువ, స్టార్ సినిమా హాలు పక్కన ప్రధాన కాలువ, బోర్డు స్కూల్ సమీపంలోని ప్రధాన పంట కాలువ, కంభం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పంట కాలువ, వాసవి పాఠశాల వెనుక వైపు, రావిపాడుకు వెళ్ళే దారి పక్కన ఉండే ప్రధాన పంట కాలువలను ఇరువైపులా ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించారు. 20 అడుగుల వెడల్పు ఉన్న ప్రధాన పంట కాలువలన్నీ 10 అడుగుల మేర కుచించుకు పోవడంతో వాటి నుంచి నీరు వెళ్ళడం కష్టంగా మారింది. 25 సంవత్సరాల క్రితం పంట కాలువ గట్లపై లారీలు, ట్రాక్టర్లు వెళ్ళేవి. ప్రస్తుతం ఆక్రమణల వలన ద్విచక్ర వాహనం వెళ్ళేందుకు కూడా దారి లేకుండా పోయింది. దీనికితోడు పంట కాలువల్లో దట్టంగా చిల్లచెట్లు పెరగడంతోపాటు గృహాల్లోని మురికి నీరంతా పంట కాలువల్లో చేరుకుపోయి డ్రైనేజీ కాలువలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాలువలను కాపాడాలని, సజావుగా నీరు వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.


నక్కలగండి కాలువపై నిర్మించిన అక్రమ కట్టడాలు


కంభం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా కాలువను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడం

అక్రమ కట్టడాలను పరిశీలించి తొలగిస్తాం

కంభం చెరువు ప్రధాన పంట కాలువలను ఆక్రమించుకుని అక్రమ కట్టడాలపై కంభం ఇరిగేషన్ డీఈ జాకీర్ అహమ్మద్‌ను వివరణ కోరగా తమ సిబ్బందితో వెళ్ళి అక్రమ కట్టడాలను పరిశీలించి వాటిని తొలగించే చర్యలు చేపడతామని తెలిపారు.

దుర్వాసన భరించ లేకపోతున్నాం..

పట్టణంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవాలయం, శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయాలకు వెళ్లాలంటే భక్తులు దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితిని మున్సిపల్ అధికారులు కల్పించారు. వినాయకస్వామి దేవాలయం ఎదుట రోడ్డు మార్జిన్లలో మున్సిపల్ సిబ్బంది పెద్దపాటి డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి మినీ డంపింగ్ యార్డుగా మార్చారు. సమీప వీధుల్లో చెత్తను సేకరించిన సిబ్బంది రిక్షాలలో చెత్తను తీసుకుని వచ్చి రోడ్డు మార్జిన్‌లో ఉన్న పెద్ద డస్ట్‌బిన్లలో పోసి వెళతారు. ఇవి నిండిన తరువాత ట్రాక్టర్‌తో ఇక్కడి చెత్తను డంపింగ్‌యార్డుకు మారుస్తారు. నిత్యం చెత్తను ఇక్కడ పోయడం, మళ్ళీ తీసుకుని వెళ్ళడంతో ఆ రోడ్డుపై వెళ్ళాలంటేనే ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి కనిపిస్తున్నది. పక్కనే దేవాలయం, ఇదే రోడ్డులో దక్షిణ కాశీగా పేరొందిన మరో దేవాలయం, సమీపంలో పాఠశాల, సినిమా థియేటర్, నివాస గృహాలు ఉండడంతో ఆప్రాంతానికి వెళ్ళాలంటేనే దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

-గిద్దలూరు


దేవాలయం ఎదుట రోడ్డు మార్జిన్లలో ఉంచిన డస్ట్‌బిన్లు

ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం

గిద్దలూరు, మే 15 : పట్టణంలోని శాఖా గ్రంథాలయం ఆవరణలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. జూన్ 7వ తేదీ వరకు శిక్షణ శిబిరం జరుగుతుందని గ్రంథపాలకురాలు ఎస్.ఎం.ప్రసన్నకుమారి తెలిపారు. రోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని ఆమె తెలిపారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్లో) తహసీల్దార్ సోమ్లానాయక్‌ను పరామర్శిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా

రోడ్డు ప్రమాదంలో తహసీల్దార్‌కు తీవ్ర గాయాలు

పెద్దారవీడు, మే 15: రోడ్డు ప్రమాదంలో తహసీల్దార్, ఇద్దరు సర్వేయర్లకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం మండలంలోని హనుమాన్‌జంక్షన్(కుంట)లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఎర్రగొండపాలెం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సోమ్లానాయక్ తన కారులో మండల సర్వేయర్ సైదారావు, విలేజ్ సర్వేయర్ దిలీప్‌లతో కలిసి మార్కాపురం నుంచి ఎర్రగొండపాలెం వెళుతున్నాడు. హనుమాన్ జంక్షన్ (కుంట) సమీపంలో త్రిపురాంతకం నుంచి కంభం వెళుతున్న లారీ కారును ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తహసీల్దార్ తలకు తీవ్రగాయాలయ్యాయి. సర్వేయర్లకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే వారిని మార్కాపురంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, సీఐ రాములునాయక్‌లు ఆసుపత్రికి వెళ్లి తహసీల్దార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎస్సై వెంకటసైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న ఎస్ఐ, ఏఎస్ఐలు) ఇన్‌సెట్లో) గాయపడిన కారు డ్రైవర్ మౌలాలి, విద్యార్థులు రామిరెడ్డి, నందకిషోర్

బైకును ఢీకొన్న కారు


● ముగ్గురికి గాయాలు ● నుజ్జునుజ్జయిన కారు

మార్కాపురం రూరల్, మే 15: కారు వేగంగా వచ్చి ముందు వెళుతున్న బైకును ఢీకొనడంతో బైకుపై ఉన్న ఇద్దరికీ, కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని దరిమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని ఏ1 గ్లోబల్ కళాశాల వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దోర్నాల నుంచి మార్కాపురం పట్టణానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ షేక్ మౌలాలి తన కుటుంబ సభ్యులతో కలిసి వస్తున్నారు. అదే సమయంలో దేవరాజుగట్టు సమీపంలోని కిట్స్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దుగ్గిరామిరెడ్డి, నందకిషోర్‌లు బైకుపై మార్కాపురం పట్టణానికి వస్తున్నారు. దీంతో ఏ1 గ్లోబల్ కళాశాల వద్ద కారు వెనుక వైపు నుంచి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న రామిరెడ్డి, నందకిషోర్‌లకు తీవ్ర గాయాలు అవడంతో పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కారు నడుపుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ షేక్ మౌలాలికి కంటిపై, చేయి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని, వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని మార్కాపురం రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్, ఏఎస్ఐలు పరిశీలించారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


పొదిలిలో స్వాధీనం చేసుకున్న బ్లూబెల్ ఐస్‌క్రీం బండ్లు

నాసిరకం ఐస్‌క్రీంలు అమ్మితే చర్యలు

పొదిలి, మే 15 : నాసిరకం ఐస్‌క్రీంలు అమ్మితే చర్యలు తప్పవని ఫుడ్‌సేఫ్టీ అధికారి బి నరసింహుడు అన్నారు. బుధవారం స్థానిక విశ్వనాథపురంలో బ్లూబెల్ ఐస్‌క్రీంలు తిని అస్వస్థతకు గురయ్యారని విషయం తెలుసుకొని పరిశీలించారు. అమ్మఫుడ్స్ గుంటూరు వారి మరో బ్రాంచ్ పొదిలి వెంకయ్యస్వామి దేవాలయం సమీపంలో నిర్వహిస్తున్నారు. పొదిలి సబ్ కాంట్రాక్టర్‌గా హరిప్రసాద్ నడుపుతున్నాడు. ఆక్రమంలో బుధవారం విశ్వనాథపురంలో 160 రూపాయలు వెచ్చించి మహ్మద్ అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. అవి తిన్నతరువాత వాంతులు చేసుకున్నానని బాధితుడు మహ్మద్ తెలిపారు. వ్యాపారులు తయారు చేసిన తేదీ, గడువు ముగిసే తేదీని తప్పకుండా ముద్రించాలని లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఫుడ్‌సేఫ్టీ అధికారి హెచ్చరించారు. ఐస్‌క్రీం శాంపిల్స్‌లను స్టేట్‌ఫుడ్ లేబరేటర్‌కు పంపిస్తామని, అక్కడి క్వాలిటీలో తేడా వస్తే మళ్లీ కేసు బుక్ చేస్తామని ఆయన తెలిపారు. గతంలో అమ్మఫుడ్స్‌పై మార్కాపురంలో కేసు బుక్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం దీనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్సై, సిబ్బంది

33 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొమరోలు, మే15: కొమరోలులోని చిన్నబడి బజార్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 33 ఆర్మీ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మధుసూదన్ రావు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్సై , ఆయన సిబ్బంది రాంప్రసాదు, అంజినాయక్, కిరణ్‌లు చాకచక్యంగా మఫ్టీలో మాటు వేసి మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి ఆర్మీ మద్యం 33 బాటిళ్ళు (750మీ.లీ)ను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసుకున్నారు. అనంతరం నిందితుడిని మద్యం బాటిళ్లను గిద్దలూరు కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

బాధితుడికి పరామర్శ

గిద్దలూరు, మే 15 : ఓటింగ్ సందర్భంగా జరిగిన వివాదం నేపథ్యంలో పట్టణంలోని ఎరుకల కాలనీకి చెందిన బీజేపీ కార్యకర్త సురేష్‌పై అదే కాలనీకి చెందిన కొంతమంది దాడి చేసి గాయపరిచారు. దాంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్‌ను బీజేపీని జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, ఎస్సీ మోర్చ ఇన్‌చార్జి బండారి జయప్రసాద్ తదితరులు పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులు శోచనీయమని, దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


బాధితుడిని పరామర్శిస్తున్న బీజేపీ నేతలు

దర్శిలో జోరుగా బెట్టింగులు

ఒంగోలు ఎంపీతోపాటు దర్శి అసెంబ్లీ అభ్యర్థుల గెలుపుపై పందేలు

రాష్ట్రంలో పలు స్థానాలపైనా గురి...

నమ్మకమైన మధ్యవర్తుల సమక్షంలో చేతులు మారుతున్న డబ్బు

దర్శి, మే 15 : ఎన్నికల ఫలితాలపై దర్శి ప్రాంతంలో జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ఈ బెట్టింగులు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక నుంచే ఆరంభమయ్యాయి. తొలుత ఏ పార్టీ తరపున ఎవరు అభ్యర్థి అవుతారనేదానిపై పందేలు కాయగా.. ఇప్పుడు పోలింగ్ పూర్తయిన తర్వాత పార్టీల విజయాలపై బెట్టింగ్‌లు మరింత ఊపందుకున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభిమానులతో పాటు మరికొంత మంది ఇతర రంగాలకు చెందిన వ్యాపారులు కూడా లాభాపేక్షతో బెట్టింగులు పెడుతున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వర్గీయులు, వైసీపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ సానుభూతిపరులు బెట్టింగులు పెడుతున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందనే విషయంపై పందేలుకు తొలుత ఉధృతంగా ముందుకు వచ్చిన వైసీపీ అభిమానులు పోలింగ్ తర్వాత వారు కాస్త వెనకు అడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దర్శి అసెంబ్లీ సీటు ఎవరు గెలుస్తారు.. ఒంగోలు పార్లమెంట్ సీటు ఎవరు గెలుస్తారు.. జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనే అంశాలపై అధికసంఖ్యలో బెట్టింగులు జరుగుతున్నాయి. అదేవిధంగా సీఎం వైఎస్ జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, సినీహీరో బాలకృష్ణ, నారా లోకేష్‌కు ఆయా నియోజకవర్గాల్లో వచ్చే మెజార్టీలపై జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ప్రతిసారి ఎన్నికల సమయంలో బెట్టింగులు పెట్టటం ఆనవాయితీగా మారింది. 2014లో ఇరువర్గాలు కోట్లాది రూపాయలు బెట్టింగులు పెట్టగా ఆ సమయంలో టీడీపీ వర్గీయులు పందాలు గెలుచుకున్నారు.



2019లో అదేవిధంగా ఇరు పార్టీలకు చెందిన అభిమానులు పందాలు పెట్టగా వైసీపీ వర్గీయులు గెలుచుకున్నారు. ఈ సారీ కూడా కోట్లాది రూపాయలు పందాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో, పందాలు ఎవరికి దక్కుతాయోనని ఎదురు చూస్తున్నారు.

బెట్టింగ్‌లు కాస్తుంది ఇలా...

ఒంగోలు ఎంపీ వైసీపీ అభ్యర్థి తరపున లక్షా ఇరవై వేల రూపాయలు పందెం కాస్తే.. టీడీపీ అభ్యర్థి తరపున లక్ష రూపాయలు బెట్టింగ్ కాస్తున్నారు. అలాగే దర్శి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి గెలిస్తే లక్షా ఇరవై వేల రూపాయలు, టీడీపీ గెలిస్తే లక్ష రూపాయలు ఇచ్చేలా బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇందుకుగాను మధ్యవర్తులు కొందరు ఐదు శాతం, ఇంకొందరు రెండు శాతం కమీషన్ తీసుకుంటున్నట్లు సమాచారం.

కనిగిరిని పట్టి పీడిస్తున్న ట్రాఫిక్ సమస్య

ట్రాఫిక్‌లో అంబులెన్స్‌లు చిక్కుకున్నా పట్టని పోలీసులు

కనిగిరి, మే 15 : కనిగిరిలో రోజురోజుకూ మరింత ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోంది. దశాబ్దాలు గడిచినా హైవే నిర్మాణం పూర్తి కాలేదు. ముఖ్యంగా ఐదేళ్ల వైసీపీ పాలనలో పాలకులు హైవే నిర్మాణం పూర్తి చేయటంలో అలక్ష్యం వహించారు. ఈ క్రమంలో భారీ వాహనాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దీంతో ప్రజలు ట్రాఫిక్‌తో నానా ఇబ్బందులు పడుతున్నారు.

సుదూర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు కనిగిరి పట్టణం ప్రధాన సెంటర్ల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ట్రాఫిక్ సమస్యల మరింత జటిలమైంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు అంబులెన్స్, ఫైర్ఇంజన్ వంటి వాహనాలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. ట్రాఫిక్‌లో అంబులెన్స్‌లు చిక్కుకున్న కారణంగా సమయానికి రోగులను ఆసుపత్రులకు చేర్చలేకపోయాయి. దీంతో రోగులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రతి రోజూ అంబులెన్స్‌లు స్థానిక ప్రభుత్వాసుపత్రికి వస్తూ, పోతూ ఉంటాయి. ఈ క్రమంలో ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. పైగా ప్రభుత్వాసుపత్రి గోడ వెంబడి ఫుట్‌పాత్ వ్యాపారులు రోడ్డుపైకి రావటంతో వాహనాలు మళ్లింపునకు కూడా ఇబ్బందిగా మారింది. ఈ సందర్భంగా రెండు వైపుల నుంచి వాహనాలు వచ్చిన క్రమంలో నడిరోడ్డుపై అంబులెన్స్‌లు చిక్కుకుపోతున్నాయి. సంబంధిత పోలీసులు యంత్రాంగం మొక్కుబడిగా ఒక కానిస్టేబుల్‌ను ట్రాఫిక్ పునరుద్ధరణకు వినియోగించి తగినంత సిబ్బంది లేరని చేతులు దులిపేసుకుంటోంది. దీంతో నిత్యం గంటల కొద్ది వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ ఏర్పడుతుంది. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం కనిగిరిలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వాసుపత్రి నుంచి ఒంగోలు వెళ్లే క్రమంలో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన అంబులెన్స్

అత్యధిక పోలింగ్‌తో విజయంపై కూటమి ధీమా

దర్శి, మే 15 : నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 90.91 శాతం పోలింగ్ నమోదుకావటంతో టీడీపీ కూటమి విజయంపై పూర్తి ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఓటర్లు వచ్చి ఓటు వేశారని భావిస్తున్నారు. వైసీపీ అరాచన పాలపై విసుగుచెంది ఆ పార్టీని ఓడించాలనే పట్టుదలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి టీడీపీకి ఓట్లు వేశారని ఆ పార్టీ వాళ్లు అంచనాలు వేస్తున్నారు. ఇతర దేశాల్లో ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు వారం రోజులు ముందే ఓటు వేసేందుకు వచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఉద్యోగులు ఒక్కసారిగా రావటంతో పట్టణాలు, గ్రామాలు కిలకిటలాడాయి. పోలింగ్ కేంద్రాల వద్ద 6 గంటలకే ఓటర్లు బారులు తీరటం, మండుటెండను సైతం లెక్కచేయకుండా మహిళలు, వృద్ధులు గం టల తరబడి వేచి ఉండి ఓటు వేయటం చూస్తే రాష్ట్రాభివృద్ధి కాంక్షించి టీడీపీ కూటమికి ఓటు వేశారని స్పష్టమవుతుందని టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు. అత్యధిక పోలింగ్ రావటంతో అంచనాకు మించి దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని పార్టీ క్యాడర్ ధీమా వ్యక్తం చేస్తుంది. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి అదేస్థాయిలో మెజార్టీ లభిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల వారీగా లెక్కలు వేసి కొంత మంది విజయంపై ధీమా వ్యక్తం చేసి మెజార్టీలు చెబుతుండగా అన్నింటికీ మించి టీడీపీ కూటమి అనుకూల పరిణామాల వలన అంచనాలకు మించి ఓట్లు వస్తాయని కూటమి వర్గాలు పూర్తి ధీమాతో ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో 600 మందికి ఉచిత అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), మే 15 : బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో 600 మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డిసుభద్ర బుధవారం తెలిపారు. పాఠశాలల్లో మొదటి విడత ప్రవేశాలకు 696 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో బీసీలు 234 మంది, ముస్లింలు 53మంది, ఓసీలు 147 మంది, ఎస్సీలు 244, ఎస్టీలు 18 మంది ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మొదటి విడత ప్రైవేశాలకు ఎంపికైన వారు వారికి కేటాయించిన పాఠశాలల్లో ఈనెల 10వతేదీలోపు సంబంధిత సర్టిఫికెట్లతో సమర్పించి ప్రవేశం పొందాలి. నిర్ణీత గడువులోపు జిల్లాలో మొత్తం 600 మంది విద్యార్థులు తమకు కేటాయించిన పాఠశాలల్లో ప్రవేశం పొందారు. 91 మంది తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరేందుకు విముఖత చూపారు. మిగిలిన ఐదుగురికి ప్రవేశాల కోసం ఈనెల 20 వరకు అవకాశం కల్పించారు. మొదటి విడత మిగిలిపోయిన సీట్లను రెండో విడత లాటరీలో ఎంపికైన విద్యార్థులతో భర్తీ చేస్తామని సుభద్ర తెలిపారు.

వెల్లంపల్లిలో కిలో పొగాకు రూ.299

మద్దిపాడు, మే 15: వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు కొనుగోలు ఊపందుకుంది. కిలో రూ.299 గరిష్ఠ ధర పలికింది. సీతారాంపురం, బసవన్నపాలెం నుంచి 1020 బేళ్ల రాగా 985 బేళ్ల పొగాకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అయితే కనిష్ఠ ధర రూ.270, సరాసరిన కిలో రూ.269 వచ్చిందని వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ తెలిపారు. రైతులు నాణ్యమైన పొగాకును వేలం కేంద్రానికి తీసుకురావాలని ఆయన సూచించారు.

ఐటీఐల ప్రవేశాల కోసం దరఖాస్తులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 15: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024-24 విద్యా సంవత్సరంలో మొదటి విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా కన్వీనర్, ఒంగోలు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీ. నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను వచ్చేనెల 10వ తేదీ సాయంత్రం ఐదుగంటల లోపు నమోదు చేసుకోవాలన్నారు. నమోదుకు సంబంధించిన పత్రాలను ప్రింట్ తీసుకోవాలని, దరఖాస్తుల ప్రింట్ కాపీని, ఒరిజనల్ సర్టిఫికెట్లను తీసుకొని ప్రభుత్వ ఐటీఐలలో కచ్చితంగా వచ్చేనెల 10వతేదీలోపు వెరిఫికేషన్‌ను చేయించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8143130711 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో అత్యధికంగా దర్శిలో పోలింగ్

దర్శి, మే 15 : సార్వత్రిక ఎన్నికల్లో దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 90.91 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూలేని విధంగా నియోజకవర్గ చరిత్రలో కూడా గరిష్ఠ స్థాయిలో పోలింగ్ నమోదై రికార్డు సృష్టించింది. మొత్తం 2,26,370 మంది ఓటర్లు ఉండగా, 2,05,792 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా ముండ్లమూరు మండలంలో పోలింగ్ నమోదైంది. దర్శి పట్టణంలో 29,717 మంది ఓట్లు ఉండగా 24,219 మంది 81.18 శాతం మంది ఓట్లు వేశారు. దర్శి రూరల్ మండలంలో 43,171 మంది ఓటర్లు ఉండగా 40,016 మంది 92.69 శాతం ఓటింగ్ నమోదైంది. దొనకొండ మండలంలో 37,805 మంది ఓటర్లు ఉండగా, 34,848 మంది 92.21 శాతం ఓటింగ్ నమోదైంది. కురిచేడు మండలంలో 32,330 మంది ఓటర్లు ఉండ గా, 29,570 మంది 91.82 శాతం పోలింగ్ నమోదైంది. ముండ్లమూరు మండలంలో 45,625 మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా 42,342 మంది ఓట్లు వేయగా 93.22 శాతం పోలింగ్ నమోదైంది. తాళ్లూరు మండలంలో 37,722 మంది ఓటర్లు ఉండగా, 34,797 మంది ఓటు వేయగా 91.98 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గం మొత్తంమీద 1,03,931 మంది పురుషులు, 1,01,860 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా దర్శి మండలంలోని చిన ఉయ్యా లవాడలో 98.64 శాతం పోలింగ్ నమోదై రికార్డు సృష్టించింది.



కంకణంపాడు పంచాయతీలో రాత్రి పూట క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

ముండ్లమూరు మండలంలో 93.22 శాతం పోలింగ్

2019 కంటే 20 శాతం అదనం

ముండ్లమూరు, మే 15 : మండలంలోజరిగిన ఎన్నికల్లో 93.22 పోలింగ్ శాతం నమోదైంది. మొత్తం 45,625 ఓట్లు ఉండగా అందులో పురుషులు 21,473 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్త్రీలు 20,868, ఇతరులు 1, పురుషులు, స్త్రీలు కలిపి 42,342 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 93.22 శాతం పోలింగ్ నమోదైంది. 2019 కంటే 20 శాతం అధికంగా పోలింగ్ నమోదైంది. ఈ సారి ఎక్కువగా మహిళలు, నిరుద్యోగులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొనటంతో ఒక్కసారిగా ఎక్కువ శాతం నమోదైంది. రాష్ట్రంలో దర్శి నియోజక వర్గం పోలింగ్ శాతంలో ప్రథమ స్థానంలో నిలవగా నియోజకవర్గంలో ముండ్లమూరు మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. పోలింగ్‌ను నమోదును ఒకసారి పరిశీలించినట్లయితే మారెళ్ల, ముండ్లమూరు, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో మహిళలు ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాఫ్‌వేర్ ఉద్యోగులైతే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు పట్టణాల నుంచి వచ్చి ఓటింగ్‌లో పాల్గొనటం గమనార్హం.

గతంలో ఎన్నడూ లేనంతగా ప్రశాంతం

తాళ్లూరు, మే 15 : మండలంలోని అన్ని గ్రామాల్లో 92.2శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని 46 పోలింగ్ బూతుల్లో 37,722 మంది ఓటర్లు ఉండగా 34,797 మంది ఓటర్లు ఓటు హక్కువినియోగించు కోగా 92.2శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ లేనంత ప్రశాంతంగా ముగియటంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగానే ఎస్.ఐ వైవీ రమణయ్య గత ఎన్నిక సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరిగిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా గ్రామాలకు చెందిన ఇరువర్గాలకు చెందిన వ్యక్తులతో పాటు వివాదాలకు కారణమయ్యే వ్యక్తులను గుర్తించి బైండోవర్లు చేశారు. గతఎన్నికల్లో శివరాపురం గ్రామంలో పోలింగ్ రోజున వివాదం జరగటంతో ఆ గ్రామంపై దృష్టి సారించిన జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్ స్వయంగా ఆ గ్రామంలో శాంతి సమావేశం ఏర్పాటు చేసి గ్రామస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తూర్పుగంగవరం, దోసకాయలపాడు గ్రామాల్లోని బూత్‌ల్లో పోలింగ్ సరళిని పరిశీలించే సమయంలో ఆయనతో పాటు వైసీపీ నాయకులు లోనికి వెళ్లటంతో టీడీపీ శ్రేణులు అభ్యంతరం తెలపటంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. అక్కడే ఉన్న ఎస్సై ఇరువర్గాలు గొడవ పడకుండా సర్దుబాటు చేశారు.

వెలిగండ్ల మండలంలో పెరిగిన ఓటింగ్ సరళి

వెలిగండ్ల, మే 15 : మండలంలో 2019 ఎన్నికల కంటే పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ఆ ఎన్నికల్లో 86.50 శాతం పోలింగ్ జరగ్గా ఈ సారి 87.83 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 28,655 మంది ఓటర్లు ఉండగా వారిలో 25,168 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోటాలపల్లి, గుడిపాటిపల్లి, మరపగుంట్ల, మెటుపల్లి, అగ్రహారం, కంకణంపాడులోని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ జరిగింది.

మెజార్టీపై కేడర్‌తో డాక్టర్ ఉగ్ర సమీక్ష

297 బూత్‌ల నుంచి పోలింగ్‌పై వివరాలు సేకరణ

కనిగిరి, మే 15 : ఎన్నికల్లో టీడీపీ మెజార్టీపై కనిగిరి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 6మండలాల నుంచి 297 కేంద్రాల ఓటింగ్, పోలింగ్ వివరాలను టీడీపీ నాయకులు, కార్యకర్తల నుంచి విడివిడిగా వివరాలు సేకరించారు. అంతేకాకుండా బూత్ ఏజెంట్లతో లోతైన చర్యలు జరపటంతో పాటు ప్రత్యర్థి పార్టీ ఏజెంట్ల తీరు,తెన్నులపై ఆరా తీశారు. వైసీపీకి వచ్చిన పోలింగ్‌పై కారణాలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీకి చెందిన ఏజెంట్ల నడవడికపై లోతైన చర్చ చేశారు. వివరాలు తెలియచేసేందుకు వచ్చిన నాయకులు, బూత్ ఏజెంట్లు, కార్యకర్తలతో అమరావతి ప్రాంగణం కిక్కిరిసి పోయింది.



అమరావతి గ్రౌండ్స్‌కు చేరుకున్న నియోజకవర్గ నాయకులు, ఏజెంట్లు

టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన వారిని శిక్షించాలి

పామూరు, మే 15 : పోలింగ్ సందర్భంగా, టీడీపీ కార్యకర్తలను వైసీపీ శ్రేణులు అకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కంబాలదిన్నె, వీరభద్రపురం, గోపాలపురం గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్న సమయంలో పోలింగ్‌ను విఘాతం కలిగించేందుకు వైసీపీ మద్దతుదారులు టీడీపీ ఏజెంట్లపై అకారణంగా దాడికి పాల్పడ్డారన్నారు. గోపాలపురంలో వైసీపీ సానుభూతిపరుడు పామూరు పంచాయతీ ఉప సర్పంచ్ సాయి తన మద్దతుదారులతో పోలింగ్ బూత్‌వద్ద ఘర్షణ పడటమే కాకుండా పామూరు నుంచి కొంత మంది అనుచరులతో కలిసి వచ్చి టీడీపీ ఏజెంట్ల ఇళ్లపైకి వచ్చి పరుష పదజాలంతో మాట్లాడారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గోపాలపురం బాధితులతో కలిసి ఎస్ఐ ఎం సైదుబాబుకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి రమణయ్య, పాలపర్తి మస్తాన్‌రావు, పిడుగు శ్రీనివాసులు, జనసేన నాయకులు వై రహీముల్లా, దరిశి ఏడుకొండలు ఉన్నారు.



ఫిర్యాదు చేస్తున్న ఎన్డీయే కూటమి సభ్యులు

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

దొనకొండ, మే 15 : మండల వ్యవసాయశాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు జనుములు, పిల్లి పెసరలు, జీలుగలు 50శాతం రాయితీపై అందజేయనున్నట్లు ఏవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ ఏడాది మండలానికి జీలుగలు మూడు క్వింటాళ్లు, జనుములు ఏడు క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు మీ గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ నెంబర్‌తో మీకు కావాల్సిన విత్తనాలు పొందవచ్చని వ్యవసాయాధికారి తెలిపారు.

ఇద్దరు అనాథ వృద్ధులకు ఆశ్రయం

కురిచేడు, మే 15 : కురిచేడు మండలం పడమర వీరాయపాలెంలోని కరుణా వృద్ధాశ్రమం డైరెక్టర్ కాశయ్య నరసరావుపేటలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఎండలకు తాళలేక సొమ్మసిల్లిన ఇద్దరు వృద్ధులను అక్కున చేర్చుకుని ఆశ్రయం ఇచ్చారు. అక్కడ జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న నారాయణ ఇద్దరు అనాథ వృద్ధుల గురించి కాశయ్యకు సమాచారం ఇచ్చారు. కాశయ్య అక్కడకు వెళ్లి వారికి ప్రాథమిక చికిత్స చేసి పడమర వీరాయపాలెంలోని తన ఆశ్రమానికి తీసుకువచ్చారు. ఇద్దరు అనాథ వృద్ధులకు ఆశ్రయం ఇచ్చిన కాశయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

దర్శిలో మరో మూడు ఎన్నికల కేసులు

దర్శి, మే 15 : ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలపై పోలీసులు మరో మూడు కేసులు నమోదు చేశారు. బొట్లపాలెంలో తమపై మరణాయుధాలతో దాడిచేసి గాయపర్చారని తమ్మిశెట్టి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు వైసీపీ వర్గీయులు గంగిరెడ్డి అంజిరెడ్డి, మరో 11 మందిపై కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన భోగిరెడ్డి సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ వర్గీయులు బత్తిన శ్రీను మరో 10 మందిపై కేసు నమోదు చేశారు. దేవరంలో కె.నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ వర్గీయులు సానె గురవయ్య మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. దర్శి-కురిచేడు రోడ్డులో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కారుపై రాళ్లతో దాడి చేసిన వైసీపీ వర్గీయులపై కేసు నమోదు చేయకపోవటంపై టీడీపీ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అక్కడ జరిగిన సంఘటన వీడియోలను పరిశీలిస్తే ఎవరు ఎవరిపై దాడులు చేశారో స్పష్టమవుతుందని టీడీపీ వర్గీయులు చెబుతున్నారు.

వైసీపీ నాయకుడిపై కేసు నమోదు

పీసీపల్లి, మే 15 : టీడీపీ కార్యకర్తపై దాడి చేసిన ఘటనలో వైసీపీ నాయకుడిపై పీసీపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంగళవారం లింగన్నపాలేనికి చెందిన టీడీపీ కార్యకర్త భైరబోయిన మల్లికార్జున్ లక్ష్మక్కపల్లికి వెళ్లాడు. అక్కడ ఉన్న అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రత్నారెడ్డి అతని అనుచరులు మరికొంతమంది తనపై దాడిచేశారంటూ మల్లికార్జున్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు రత్నారెడ్డి మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఫిర్యాదు విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు మల్లికార్జునే తమపై దాడిచేశాడని మాలకొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మల్లికార్జున్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

మౌనంగా ఉంటున్నామని మరీ రెచ్చిపోవద్దు..!

- ప్రణీత్‌రెడ్డి, కావ్యశ్రీ, భాస్కర్‌రెడ్డిలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- నిందితులపై 24గంటల్లో చర్యలు తీసుకోకుంటే ఆందోళన
- వెంగముక్కలపాలెం ఘటనపై దామచర్ల హెచ్చరిక



విలేకరులతో మాట్లాడుతున్న దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), మే 15: ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో వైసీపీ మూకలు దాడులకు పాల్పడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని, మౌనంగా ఉంటున్నామని మరీ రెచ్చిపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ హెచ్చరించారు. బుధవారం వెంగముక్కలపాలెంలో బాధితులను పరామర్శించిన దామచర్ల అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఒంగోలు నియోకవర్గంలో వైసీపీ ముఠా చేసే అరాచకాలు ప్రజలు చూస్తున్నారని చెప్పారు. ప్రజలు టీడీపీకి ఓటు వేశారనే కారణంతో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దొంగఓట్లు వేసేందుకు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత 7గంటల సమయంలో బూత్‌లోకి వచ్చి గందరగోళం సృష్టించడంతోపాటు, ప్రశ్నించిన టీడీపీ ఏజెంట్లపై ప్రత్యక్ష దాడులు చేయడం దుర్మార్గమన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు టీడీపీ ఏజెంట్‌ను చెప్పుతో కొడుతున్న వీడియోలు అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా ఉన్నాయని చెప్పారు. వైసీపీ మూకల దాడిలో గాయపడి టీడీపీ శ్రేణులు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికి వారిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన దామచర్ల, దాడులు సంస్కృతి టీడీపీకి లేదన్నారు. మంచిగా, మౌనంగా ఉంటున్నామని చేతకానితనంగా భావించవద్దని స్పష్టం చేశారు. వైసీపీ దాడులను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, డీజీపీ, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. 24 గంటల్లో దాడికి పాల్పడిన వైసీపీ ముఠాపై కేసు నమోదు చేసి అరెస్టు చేయకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని దామచర్ల హెచ్చరించారు. మరో ఇరవై రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడతాయని, ప్రజాతీర్పులో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని ఆయన చెప్పారు. అధికారులు కూడా వాస్తవాలు గుర్తించాలని, బాధితులపై బైండవర్ కేసులు ఎలా నమోదు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కావ్యశ్రీ, ప్రణీత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు దాడి కేసులు కూడా నమోదు చేయాలని దామచర్ల డిమాండ్ చేశారు.

23 నుంచి సెల్‌ఫోన్ రిపేర్‌పై ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం,మే 15: ఈ నెల 23వ తేదీ నుంచి నిరుద్యోగ యువతకి సెల్‌ఫోన్ రిపేరుపై ఉచిత శిక్షణ ఇ వ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ఒ క ప్రకటనలో తెలిపారు.19 నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న గ్రామీణ నిరుద్యోగ యువకులు ఈ శిక్షణకు అ ర్హులని ఆ యన తెలిపారు. ఉ మ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువకులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఆ యన కోరారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగిన వారు మాత్రమే ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.శిక్షణా కాలంలో వసతి,ఉచిత భోజనవసతి కల్పించబడుతుందని ఆ యనతెలిపారు. ఇతర వివ రాలకు 9573363141 నంబర్‌ను సంప్రదించాలని ఆ యన కోరారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

నాగులుప్పలపాడు, మే 15: ఉప్పుగుండూరు గ్రామంలో అడ్వాన్స్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఎస్ఏ)ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. చీరాల కోటి ఫ్రెండ్స్ టీం విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో చీరాల కోటి ఫ్రెండ్స్, స్టార్ బాయ్స్ రజానగరం జట్ల మధ్య ఉత్కంఠంగా జరిగిన మ్యాచ్‌లో కోటి ఫ్రెండ్స్ విజేతగా నిలిచి ప్రథమ బహుమతి రూ.30,116 అందుకొన్నారు. రెండవ బహుమతి స్టార్ బాయ్స్ రజానగరం రూ.20,116, మూడవ బహుమతి యువ లెవన్స్ ఒంగోలు రూ.15,116 నాల్గవ బహుమతి అడ్వాన్స్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రూ.10,116 దక్కించుకున్నారు. విజేతలకు దాతలైన కొలకలూరి విజయ్, కొలకలూరి వినయ్, కొంజేటి సురేష్, మాదాసు రాంబాబు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది.



ప్రథమ బహుమతి అందిస్తున్న దాతలు





● కాలిబూడిదైన బస్సు, టిప్పర్

కొన్ని గంటల ముందు వరకు అమ్మమ్మ, తాతయ్యకు కబుర్లు చెబుతూ ఆడుకుంది ఆ పాప.. బుజ్జిబుజ్జి మాటలకు మురిసిపోతూ మెల్లిగా మనవరాలితో కలిసి నిద్రలోకి జారుకున్నారు.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఓటేయడానికి వచ్చిన ఓయువకుడు అప్పుడే అమ్మా నాన్నతో మాట్లాడి రెప్పవాల్చారు.. పిల్లల చదువుల కోసం హైదరాబాద్ లో ఉంటూ ఓట్ల పండగలో పాల్గొనడానికి స్వగ్రామం బాట పట్టి తిరుగు ప్రయాణమయిన వ్యక్తి మరొకరు... ఇలా అందరూ దాదాపుగా ఓటేయడానికి సొంతూరి బాట పట్టి హైదరాబాద్‌కు తిరుగుపయనమయిన వారే ఆ బస్సులో ఉన్నారు.

అర్ధరాత్రి ఘోరం





మృతి చెందిన కాశీ బ్రహ్మేశ్వర రావు ఆయన మనుమరాలు ఖ్యాతి సాయి



మృతి చెందిన లక్ష్మి



మృతి చెందిన శ్రీనివాసరావు

తెల్లవారుజాము **1.30** గంటలు

బస్సులో అంతా నిద్రావస్థలో ఉన్నారు. అకస్మాత్తుగా ఎదురుగా వస్తున్న గ్రావెల్ లోడుతో ఉన్న టిప్పర్ ఆ బస్సును ఢీకొంది. ప్రమాద ధాటికి టిప్పర్ డీజిల్ ట్యాంకర్ పేలిపోయి మంటలు ప్రారంభమయ్యాయి. క్షణాల్లో ఆ మంటలు బస్సుకు అంటుకున్నాయి. బస్సులోని ప్రయాణికులు ఈ హఠాత్పరిణామానికి నివ్వెరపోయారు. ఆర్తనాదాలు చేస్తూ బస్సు దిగి రావడానికి ప్రయత్నించారు. వీరిలో కొందరు బస్సు దిగిరాగా మరికొందరు బస్సులోనే చిక్కుకు పోయారు. టిప్పర్, ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులోని ప్రయాణికులు నలుగురు సజీవ దహనం అయ్యారు.

- గ్రావెల్ లోడు టిప్పర్ - బస్సు ఢీ
- మంటలలో చిక్కుకున్న ట్రావెల్స్ బస్సు
- ఆరుగురి సజీవ దహనం ● మృతుల్లో ఓ చిన్నారి
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆహుతి
- చిలకలూరిపేటకు సమీపంలో ఘటన
- ఓటు వేసి హైదరాబాద్ తిరిగి వెళుతుండగా విషాదం
- సంఘటనా స్థలంలో భీతావహ దృశ్యాలు

బస్సులోనే.. సజీవ దహనం

చిలకలూరిపేట, చినగంజాం, పర్చూరు, బాపట్ల, గుంటూరు, మే 15: పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు సమీపంలో బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనం అయ్యారు. చీరాల చిలకలూరిపేట మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. బాపట్ల జిల్లా చినగంజాం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ట్రావెల్ బస్సు చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెం డొంక సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొంది. టిప్పర్ ఆయిల్ ట్యాంకు పగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సు పూర్తిగా తగలబడి పోగా, టిప్పర్ ధ్వంసమైంది. చిలకలూరిపేట 108 వాహనం సిబ్బంది అక్కడకు చేరుకుని 29 మంది గాయపడినట్టుగా గుర్తించారు. వారికి ప్రాథమిక చికిత్స చేశారు. వీరిలో 20 మందిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉన్నారు. వారిలో నీలాయపాలెం గ్రామానికి చెందిన భార్య భర్తలు ఉప్పుగుండూరి కాశీ బ్రహ్మేశ్వరరావు(64), లక్ష్మి(55), వారి మనుమరాలు ముప్పరాజు ఖ్యాతి సాయిని(8), గొనసపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు(52)తో పాటు చీరాలకు చెందిన ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అంజి (35), టిప్పర్ డ్రైవర్ మధ్యప్రదేశ్‌కు చెందిన హరిసింగ్ (39) మృతుల్లో ఉన్నారు.

* రెప్పపాటులో తీవ్ర విషాదం

టిప్పర్ ఢీకొన్న ఘటనలో క్షణాల్లో మంటలు వ్యాప్తితో రెప్పపాటులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏం జరిగిందో తెలుసుకునే లోపలే బస్సును మంటలు చుట్టుముట్టాయి. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు ఏం జరుగుతుందో అర్థం కాక ప్రాణాలు కాపాడుకునేందుకు ఎవరికి తోచినట్లు వారు కిటికీల్లో నుంచి అద్దాలు పగలగొట్టుకొని కిందకు దూకేశారు. వయసు రీత్యా పెద్దవారైనా కాశీబ్రహ్మేశ్వరరావు లక్ష్మీ దంపతులకు ఏం చేయాలో పాలుపోలేదు. ఇంతలో భావన చిన్నారి ఖ్యాతి శ్రీ సాయిని వెంటబెట్టురేని కిందకు దిగేందుకు మెయిన్ డోర్ వద్దకు వెళ్లారు. అయితే మెయిన్ డోర్ విరిగి లోపలికి పడడంతో పాటు మంటలు ఎగిసి పడడంతో అటు నుంచి కిందకు దిగడానికి సాధ్యం కాలేదు. అదే సమయంలో వెనకవైపు కిటికీ అద్దాలు పగలగొట్టి కిందకు దిగుతున్నట్లు తెలుసుకున్న భావన చిన్నారి చేయి పట్టుకుని అటువైపు వెళ్ళింది. ఎగిసి పడుతున్న మంటలు.. హాహాకారాలతో భయపడిన చిన్నారి ఎటుపోవాలో అర్థం కాక తాతయ్య అంటూ కాశీ బ్రహ్మేశ్వరరావు వద్దకు వెళ్ళింది. దీంతో చిన్నారిని లాక్కొంచేందుకు భావన ప్రయత్నించింది. అప్పటికే పరిస్థితి చేయి దాటి పోతుండడంతో బయటకు దిగిన ప్రయాణికులు భావనను బలవంతంగా కిటికీ నుంచి బయటకు లాగేశారు. దీంతో భావన ప్రాణాలతో బయట పడింది. బస్సులో చిక్కుకుపోయిన కాశీ బ్రహ్మేశ్వరావు లక్ష్మిలతో పాటు వారి మనవరాలు ఖ్యాతి అగ్నికి ఆహుతయ్యారు. ప్రమాదం నుంచి మృత్యుంజయురాలైన భావన ప్రస్తుతం గుంటూరులోని రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.



ప్రమాద స్థలంలో పరిశీలన జరుపుతున్న అడిషనల్ డీజీ శంఖబ్రత బాగ్చి, గుంటూరు ఎస్పీ తుషార్ డూడి

*సంఘటనా స్థలంలో అధికారులు

ప్రమాదం గురించి తెలిసిన వెంటనే చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఘటనాస్థలికి వచ్చారు. అగ్నిమాపక దళం మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా అప్పటికే బస్సు పూర్తిగా తగలబడింది. బస్సులోని నలుగురు ప్రయాణికులు గుర్తుపట్టలేని రీతిలో మాంసపు ముద్దలుగా మిగిలారు. వీరితోపాటు టిప్పర్ డ్రైవర్, బస్సు డ్రైవర్ కూడా సజీవ దహనమయ్యారు. అడిషనల్ డీజీ శంఖబ్రతబాగ్చీ, గుంటూరు ఎస్పీ తుషార్ డూడి, నరసరావపేట డీఎస్పీ వర్మ, నరసరావుపేట ఆర్డీవో సరోజిని, చిలకలూరిపేట ఆర్డీవో నాగలక్ష్మి తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనా స్థలం వద్దే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహపు భాగాలను బంధువులకు అప్పగించారు.

బిడ్డను కోల్పోయి రోదిస్తున్న వెంకట సుబ్బారావు

ముప్పరాజు వెంకట సుబ్బారావు అనే వ్యక్తి ఒంగోలులోని సిరి చందన స్కానింగ్ సంస్థలో పనిచేస్తుంటారు. వారి కుమార్తె ముప్పరాజు ఖ్యాతి సాయి (8). ఆ పాప మూడవ తరగతి వరకు చదువుకుంది. నాలుగవ తరగతిలో చేరటానికి సిద్ధంగా ఉన్న సమయంలో వేసవి సెలవులు వచ్చాయి. తాతయ్య అమ్మమ్మలతో కలిసి కొద్దిరోజులు హైదరాబాదులో ఉండడానికి బస్సులో వారితో బయలుదేరింది. ఈ ప్రమాదంలో ఆ పాప మృతి చెందడంతో వెంకట సుబ్బారావుతో పాటు ఆయన కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.









చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



● **షాక్‌కు గురయ్యాం : తాటి సాయిలక్ష్మి సోపిరాల**

చినగంజాంలో మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో బస్సు ఎక్కాం. గంటసేపు ప్రయాణించగానే ప్రమాదానికి గురైంది. నిద్ర మత్తులో ఏమి జరిగిందో తెలుసుకునే లోపే మంటలు వ్యాపించాయి. బుధవారం హైదరాబాద్‌లో ఇంటర్వ్యూకి హాజరు కావాల్సి ఉంది. భగవంతుడి దయవల్ల ప్రాణాపాయం తప్పింది.

● **కళ్ల ముందే దగ్ధమైంది : టి.రాజ్యలక్ష్మి, మమత**

బస్సులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. బస్సులో మంటలు, బయట చిమ్మచీకటి ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. ప్రాణాలు దక్కించుకునేందుకు కొంతమంది కాలుతున్న ద్వారం గుండా, కొంతమంది కిటికీ అద్దాలు పగలుకొట్టుకుని బయటకు దూకారు. మేము తప్పించుకుని బయటకు వచ్చేలోపే బస్సు కళ్ల ముందే దగ్ధమైంది.

అర్ధరాత్రి స్పందించిన ఏలూరి

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో సంఘటన స్థలం వద్దకు వచ్చారు. క్షతగాత్రులను తన వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున 5 గంటల వరకు ఆయన సంఘటనా స్థలంలోనే ఉన్నారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మంత్రి విడదల రజిని ప్రమాదం జరిగిన తీరును చూసి చలించి పోయారు. మృతులకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని పుల్లారావు డిమాండ్ చేశారు. పక్కనే జరుగుతున్న ఓడరేవు నకరికల్లు రోడ్డు విస్తరణ పనుల గుత్తేదారు సరైన భద్రత, సూచికల ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన గ్రావెల్‌ను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఆ క్రమంలోనే టిప్పర్ ఎదురుగా వస్తున్న ట్రావె ల్స్ బస్సును ఢీకొంది. బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడన్న అనుమానాలున్నాయి.



రోధిస్తున్న బంధువులు



పలువురుకి గాయాలు

చినగంజాం: స్వగ్రామంలో ఓటు వేసి వెళ్తుండగా జరిగిన ఘటనలో చినగంజాం మండలానికి చెందిన నలుగురు సజీవ దహనమవగా పలువురు గాయపడ్డారు. పసుమర్రు వద్ద జరిగిన దుర్ఘటనలో నీలాయపాలెం గ్రామానికి చెందిన ఉప్పుగుండూరు కాశీబ్రహ్మేశ్వరావు(65), ఆయన భార్య లక్ష్మి(55), మనవరాలు ముప్పరాజు సాయికార్తిశ్రీ(8), గొనసపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసులు(53) బస్సులో సజీవ దహనమయ్యారు. గొనసపూడి గ్రామానికి చెందిన యాముల ఆకాష్, గడ్డిపూడి తేజ, కడవకుదురుకి చెందిన గొల్లపూడి ఉదయభాను, తాటి రాజ్యలక్ష్మి, చినగంజాం పంచాయతీ అంబేద్కర్ నగర్‌కు చెందిన మేడికొండ అంకయ్య, మేడికొండ సౌజన్య, మేడికొండ అక్షయ, బొలిమేర సుధాకర్, బడుగు సంజన, సోపిరాల గ్రామానికి చెందిన తాటి సాయిలక్ష్మీ, దొడ్డా మమత, కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్‌కు చెందిన వాయిల అంజలి, రామచంద్రానగర్‌కు చెందిన పెద్దింగు నాగరాజు, ఆయన భార్య లక్ష్మి, కుమారుడు ఈశ్వరసాయి, బొమ్మిడి మాలతి, మోటుపల్లి పంచాయతీ పరిధిలోని అడవీధిపాలేనికి చెందిన రాయని బాలాజీ, నీలాయపాలెం గ్రామానికి చెందిన ఉప్పుగుండూరు భావన, కన్నెగంటి స్మైలీ, సామినేని సింధుజ, ఆమెభర్త అంజిబాబులకు గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయట పడ్డా రు. ఈ ఘనతో ఆయా గ్రామాల్లో విషాదం అలుముకుంది. గొనస పూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో హైదరాబాదులో ఉంటున్నారు. గ్రామంలోని పొలాలను కౌలుకు ఇచ్చి వాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ, హైదరాబాద్‌లో పిల్లలను చదివించుకుంటున్నారు. గ్రామంలో ఓటు వేయడానికి కుటుంబసభ్యులతో వచ్చారు. శ్రీనివాసరావు భార్య అంజమ్మ, కుమారుడు సోమవారం రాత్రి హైదరాబాదు వెళ్లారు. మం గళవారం రాత్రి శ్రీనివాసరావు హైదరాబాదు వెళ్తూ సజీవ దహనమయ్యారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న పోలీసులు

పోలింగ్ 85.15%

మండేఎండలకు తోడు పాలకపార్టీ శ్రేణులు అరాచకాలను లెక్క చేయకుండా ఓటర్లు బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన పోలింగ్ శాతం చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా మూడో స్థానంలో బాపట్ల జిల్లా నిలిచింది. మే 13న జరిగిన పోలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ మరింత ఊపందుకోవడం వల్లే ఈ స్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది. ముఖ్యంగా అర్ధరాత్రి వరకు జరిగిన పోలింగ్ నియోజకవర్గాల్లో చీరాల, అద్దంకి ఉన్నాయి.

నియోజకవర్గం	మొత్తంఓట్లు	పోలైన ఓట్లు	శాతం
● వేమూరు	1,97,458	1,70,666	86.43
● రేపల్లె	2,27,232	1,87,673	82.59
● బాపట్ల	1,90,925	1,58,500	83.02
● పర్చూరు	2,29,333	2,00,264	87.32
● అద్దంకి	2,44,057	2,15,375	88.25
● చీరాల	2,02,711	1,67,466	82.61
మొత్తం	12,91,716	10,99,944	85.15

- అద్దంకిలో అత్యధికంగా 88.25 శాతం నమోదు
- పోటెత్తిన మహిళా ఓటర్లు, వారిదే అగ్రస్థానం
- పోస్టల్ బ్యాలెట్‌ను కూడా కలుపుకొంటే 86.45 శాతం
- ప్రతికూల పరిస్థితులను లెక్క చేయకుండా కదలిన ఓటర్లు

బాపట్ల, మే15(ఆంధ్రజ్యోతి): మండుటెండను సైతం లెక్కచేయకుండా, పాలకపార్టీ శ్రేణుల దౌర్జన్యాలకు వెరవకుండా పెద్దఎత్తున బారులు తీరిన ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్న సంగతి తెలిసిందే. పోలింగ్‌కు సంబంధించి నియోజకవర్గాలతో పాటు బాపట్ల జిల్లాలో నమోదైన పోలింగ్ శాతాలను ఎన్నికల కమిషన్ బుధవారం ప్రకటించింది. బాపట్ల జిల్లావ్యాప్తంగా 85.15 పోలింగ్‌శాతం నమోదవగా, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా కలుపుకుంటే ఈ శాతం 86.45గా నమోదైంది. ఇక బాపట్ల పార్లమెంట్‌లోని సంతనూతలపాడును కలుపుకుంటే 85.48 శాతంగా, పోస్టల్ బ్యాలెట్‌ను కూడా కలుపుకుని 86.72గా ఉంది. 2019 ఎన్నికల్లో బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఓటింగ్ శాతం 86.33గా నమోదు కాగా ప్రస్తుతం 86.72గా నమోదు కావడంతో పెరుగుదల నమోదైంది.



బాపట్లలో ఓట్లు వేసేందుకు క్యూ కట్టిన మహిళలు

12,91,716 ఓటర్లకు గాను..

బాపట్ల జిల్లాలో మొత్తం 12,91,716 ఓటర్లకుగాను పురుషులు 6,29,794 మంది, మహిళలు 6,61,841 మంది ఉండగా ఇతరులు 81గా ఉన్నారు. వీరిలో తమ ఓటు హక్కు నేరుగా వినియోగించుకున్న వారు 10,99,944 మందికాగా ఇందులో 5,61,358 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకుని అగ్రస్థానంలో నిలిచారు. ఇక పురుషుల విషయానికొస్తే ఆ సంఖ్య 5,38,548గా ఉంది. పోస్టల్ బ్యాలెట్‌లు మొత్తం 17,805 ఉండగా ఇందులో 16,767 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ వినియోగం విషయంలో జిల్లాలో 94.17 శాతం నమోదు కావడం గమనార్హం.

అద్దంకిలో అత్యధికంగా..

అద్దంకిలో మొత్తం ఓటర్లు 2,44,057 మంది ఓటర్లు ఉండగా రికార్డు స్థాయిలో 2,15,375 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోనే అత్యధికంగా 88.25 పోలింగ్ శాతం అద్దంకిలో నమోదైంది. తర్వాత స్థానంలో 87.32తో పర్చూరు నిలిచింది. ఇక్కడ మొత్తం ఓటర్లు 2,29,333 ఉండగా 2,00,264 మంది ఓటు వేశారు. వేమూరు నియోజకవర్గంలో 1,97,458 ఓటర్లకు 1,70,666 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 86.43 శాతం నమోదైంది. బాపట్లలో మొత్తం ఓటర్లు 1,90,925 మంది ఉండగా ఇందులో 1,58,500 మంది ఓటేయడంతో 83.02గా ఉంది. చీరాలలో మొత్తం ఓటర్లు 2,02,711 మంది ఓటర్లు ఉండగా 1,67,466 మంది ఓటు వేయగా 82.61 శాతంగా నమోదైంది. రేపల్లెలో 2,27,232 ఓటర్లు ఉండగా 1,87,673 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 82.59 శాతం నమోదైంది.

- బాపట్ల పార్లమెంట్ స్థానంలోని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,14,638 ఉండగా ఇందులో 1,87,721 ఓట్లుపోల్‌కాగా 87.46 శాతం నమోదైంది. బాపట్ల పార్లమెంట్‌స్థానం మొత్తం చూస్తే సరాసరిన 85.48 శాతంగా ఉంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా కలుపుకుంటే ఈ శాతం 86.72గా నమోదైంది.
- బాపట్ల పార్లమెంట్ స్థానం పోస్టల్ బ్యాలెట్ మొత్తానికి వస్తే ఈ సంఖ్య 19,772గా ఉంది. ఇందులో పోలైనవి 18,672గా ఉన్నాయి. 94.43 శాతంగా నమోదైంది.

పోస్టల్ బ్యాలెట్ ఇలా...

నియోజకవర్గం	మొత్తం	పోలైనవి	శాతం
● వేమూరు	2,076	1981	95.42
● రేపల్లె	3818	3,582	93.81
● బాపట్ల	2,899	2,719	93.79
● పర్చూరు	2,920	2,766	94.72
● అద్దంకి	2,821	2,702	95.78
● చీరాల	3,271	3,017	92.23
మొత్తం	17,805	16,767	94.17



స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతపై సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రంజిత్ బాషా

బాపట్ల, మే 15: బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఈవీఎంలను భద్రపరిచిన ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. భద్రతా ఏర్పాట్లపై బుధవారం ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కంట్రోల్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల ఫుటేజిలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ, ఎలక్షన్‌సెల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, రూరల్ ఇన్‌స్పెక్టర్ వై.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రీపోలింగ్ లేకుండా ఎన్నికలు

జిల్లా వ్యాప్తంగా సాధారణ ఎన్నికలను రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలనే సంకల్పంతో ప్రజలు ఓటు వేశారని అందుకే ఓటింగ్‌శాతం పెరిగిందని చెప్పారు. పోలింగ్ రోజున గడువు ముగిసన తర్వాత కూడా 250 కేంద్రాల్లో పోలింగ్ జరిగిందన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలింగ్ రోజున కేంద్రాల బయట మాత్రమే చిన్నచిన్న ఘర్షణలు జరిగాయన్నారు. 30 కేసులు నమోదు చేసి అందులో 241 మందిని నిందితులుగా చేర్చామన్నారు. సమావేశంలో డీఆర్వో సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతులకు నివాళి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే ఏలూరి



చిన్నారి ఖ్యాతి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఏలూరి

చినగంజాం, మే 15 : రోడ్డు ప్రమాదంలో చెలరేగిన మంటల్లో చిక్కుకొని నలుగురు మృత్యువాత పడిన వారి స్వగృహాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం వెళ్లి వారి కుటుంబాల వారిని పరామర్శించారు. పసుమర్రు రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ఏలూరి బాసటగా నిలిచారు. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న ఆయన హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు వైద్య సేవలు అందించేలా చొరవచూపారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఓటు వేసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదం మృత్యు రూపంలో కబళించడం కలిచివేసిందన్నారు. రోడ్డు ప్రమాదం ఘటన పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒకే మండలానికి చెందిన నలుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. చినగంజాం మండలం నీలాయపాలేనికి చెందిన ఉప్పుగుండూరు కాశీబ్రహ్మేశ్వరరావు, లక్ష్మీ, ఖ్యాతి శ్రీసాయి దావులూరి శ్రీనివాసులు మృతి చెందడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 6గంటల వరకు అక్కడే ఉండి పెద్ద దిక్కుగా నిలిచారు. గొనసపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు, నీలాయపాలెం గ్రామానికి చెందిన ఉప్పుగుండూరు కాశీబ్రహ్మేశ్వరరావు, లక్ష్మీ మృతదేహాలకు బుధవారం ఎమ్మెల్యే ఏలూరి, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్‌తో కలిసి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బస్సు ప్రమాదంలో గాయపడిన గొనసపూడి గ్రామానికి చెందిన యామల ఆకాష్ స్వగృహానికి ఏలూరి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పెద్దదర్శి గ్రామానికి చెందిన ముప్పరాజు ఖ్యాతి బస్సు ప్రమాదంలో సజీవ దహనం కావడంతో ఆమె నివాసానికి వెళ్లి, కుటుంబసభ్యులను పరామర్శించారు. బాధిత కుటంబాలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ వారిని ఏలూరి ఓదార్చారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్ గ్రామానికి చెందిన క్షతగాత్రులను, కాశీబ్రహ్మేశ్వరావు కుటుంబసభ్యులను ఎంపీపీ కోమట్ల అంకమ్మ రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

ఎమ్మెల్యే గొట్టిపాటి



నర్సరావుపేటలో చికిత్స పొందుతున్న నేతలను పరామర్శిస్తున్న గొట్టిపాటి రవికుమార్

సంతమాగులూరు (అద్దంకి), మే 15 : ఎన్నికలలో ఓటమి భయంతోనే టీడీపీ శ్రేణులపై వైసీపీ నేతలు దాడులకు పాల్పడ్డారని ఎమ్మెల్యే, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల సందర్భంగా సంతమాగులూరు మండలం మిన్నెకల్లులో వైసీపీ నేతల దాడిలో గాయపడి నర్సరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న కంభంపాటి పెద్దరామయ్య, కంకి సలోమాన్, మాణిక్యరావు, పూర్ణయ్య, జిర్రా విజయ్‌భాస్కర్, భాగ్యరాజు, రాజేష్‌ను రవికుమార్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వైసీపీ నేతలు దాడులకు పాల్పడి వాళ్ల ఓటమిని వాళ్లే ముందే అంగీకరించారన్నారు. వైసీపీ కార్యకర్తలను ఉసిగొల్పి దాడులు చేయటం సరికాదన్నారు. పోలీసుల వైఫల్యంతోనే వైసీపీ నేతలు బరితెగించారని అన్నారు. పరామర్శించిన వారిలో అట్లా చినవెంకటరెడ్డి ఉన్నారు.

కొంపముంచిన ఈత సరదా

సముద్రతీరానికి వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్న బాలుడు


కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతదేహన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శివకుమార్(ఇన్‌సెట్లో) జయప్రకాష్

వాడరేవు(చీరాలటౌన్), మే 15 : సరదాగా సముద్రతీరంలో మునిగేందుకు వచ్చి బాలుడు మృత్యువాత పడిన సంఘటన బుధవారం వాడరేవు సముద్రతీరంలో జరిగింది. అందిన వివరాల ప్రకారం చీరాల మున్సిపల్ పరిధిలోని విఠల్‌నగర్‌కు చెందిన దున్నా జయప్రకాష్(16) ఇటీవల 9వ తరగతి పూర్తి చేశాడు. తండ్రి రూబేను, అన్న సంతోష్ కూలి పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. అయితే గతేడాది అనారోగ్యం కారణంగా తల్లి మృతిచెందింది. ఇదిలావుండగా బుధవారం అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు మైనర్‌లు వల్లెపు వాసు, డొక్కా రత్నశేఖర్‌తో కలిసి జయ ప్రకాష్ సముద్రానికి వెళ్లారు. వాడరేవు - రామాపురం మధ్యలో గల ప్రాంతంలో కొద్దిసేపు మునిగాక మిగిలిన ఇద్దరు ఒడ్డుకు చేరారు. కానీ ప్రకాష్ మునుగుతూనే ఉన్నాడు. ఈక్రమంలో వచ్చిన అలల తాకిడికి ఒక్కసారిగా గల్లంతయ్యాడు. మిత్రులు మెరైన్ పోలీసులకు సమాచారం అందించడంతో వెతికే ప్రయత్నం చేశారు. కానీ కొద్దిసేపటికే అదే సమీపంలో జయప్రకాష్ విగత జీవిగా ఒడ్డుకు చేరాడు. సమాచారం అం దుకున్న ఈపూరుపాలెం ఎస్‌ఐ శివకుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడి మృతిపై కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మృతదేహాల కోసం ఎదురు చూపులు



మృతదేహాల కోసం ఎదురుచూస్తూ రోదిస్తున్న చిన్నగంజాం మండల వాసులు

పర్చూరు, మే 15 : చిలకలూరిపేట మండలం, ఈపూరువారిపాలెం వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో కాలిపోయిన మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు రోదిస్తూ ఎదురు చూస్తున్న సంఘటన బుధవారం సంఘటన స్థలం వద్ద చోటుచేసుకుంది. ప్రైవేటు ట్రావెల్ బస్సు టిప్పర్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగి ఆరుగురు ప్రయాణికులు కాలి బూడిదయ్యారు. బస్సు పూర్తిగా దగ్ధం కావడం అందులో ఉన్న మృతదేహాలు మాంసం ముద్దలుగా పడి చెల్లాచెదరుగా ఉండడంతో ఎవరి మృతదేహం అనేది అర్థంకాని స్థితి మృతదేహాలు పడి ఉన్నాయి. దీంతో తమ వారి మృతదేహాల కోసం ఎదురు చూస్తూ రోదించారు.

తూర్పున తిరుగులేదు!

- కూటమికే అనుకూల పవనాలు
- టీడీపీకంతా స్థానిక అభ్యర్థులు
- వైసీపీకి స్థానికేతరులు
- ఇటు ఐక్యత.. అటు విభేదాలు
- ఏడు స్థానాల్లో విజయంపై తమ్ముళ్లలో ధీమా
- ఐదుచోట్ల గెలుపుపై అధికారపార్టీలో ఆశలు



ఒంగోలులో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓట్లు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉన్న తూర్పు ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల ఫలితాలపై యావత్తు ప్రజానీకం దృష్టిసారించారు. ఈ ప్రాంతంలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో కొత్త ప్రకాశంలో మూడు, బాపట్ల జిల్లాలో 3, నెల్లూరు జిల్లా పరిధిలలో ఒకటి ఉన్నాయి. ఈ ఏడు స్థానాల్లో నాలుగింటిని గత ఎన్నికల్లో టీడీపీ కైవసం చేసుకొంది. ఒక పార్టీ గాలికొట్టిన సందర్భాలు మినహాయిస్తే గతంలో అన్ని స్థానాల్లో టీడీపీ విజయం సాధించింది. అందుకు అన్ని స్థానాల్లో టీడీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉండటమే కారణం. గత ఎన్నికల్లో జగన్ అనుకూల వాతావరణంలోనూ టీడీపీ నాలుగు స్థానాలు కైవసం చేసుకోవడం ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం టీడీపీతో జనసేన, బీజేపీలు కలవడం ఉద్యోగులు, యువత, విద్యార్థులు, వ్యాపార వర్గాల్లో కూటమి అనుకూల వాతావరణం నెలకొనడం తోడైంది. అలాగే కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల పట్ల ఓటర్లపై ఆకర్షణ కనిపించింది. వీటికి మించి స్థానికంగా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించడం, కూటమి పార్టీల శ్రేణులు సమష్టిగా పని చేయడం అన్నిచోట్ల కనిపించింది. వైసీపీలో ఎక్కువచోట్ల స్థానికేతర అభ్యర్థులు కావడం, పార్టీలో నెలకొన్న అనైక్యతలు సమస్యలుగా కనిపించాయి. కొన్ని వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకతను వైసీపీ అంగీకరిస్తూనే వృద్ధులు, మహిళా ఓటర్లపై నమ్మకంతో ఉన్నారు. ఎక్కువ స్థానాల్లో ఓటర్లను ప్రలోభపరిచే అంశాల్లో ముందు ఉండటంపై వైసీపీ నాయకులు ఆశలు పెట్టుకోవడం విశేషం.

ఉమ్మడి ప్రకాశంలోని తూర్పుప్రాంతంలో ఉన్న ఏడు స్థానాల్లో అధికశాతం టీడీపీ కూటమి కైవసం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీడీపీకి జనసేన బీజేపీల కలయిక కలిసిరాగా, ఆరు స్థానాలలో టీడీపీ స్థానిక అభ్యర్థులను రంగంలో దించింది. ఆ ఆరింటిని వైసీపీ స్థానికేతరులను రంగంలోకి దించింది. వాటిల్లో గ్రూపు విభేదాలు సమస్యాత్మకంగా మారాయి. టీడీపీ కూటమి ఐదు స్థానాల్లో విజయంపై పూర్తి నమ్మకంతోనూ, రెండు స్థానాల్లో గట్టి పోటీ మధ్య బయటపడతామని అంచనా వేస్తోంది. వైసీపీ విషయానికొస్తే అద్దంకి, పర్చూరులో విజయావకాశాలు లేవని, మిగిలిన స్థానాల్లో విజయంపై ఆశతో ఫలితాల వైపు చూస్తోంది. మొత్తం పరిస్థితిని చూస్తే చీరాల, కందుకూరులో గట్టి పోటీ జరగ్గా మిగిలిన ఐదు స్థానాల్లో టీడీపీ కూటమి అనుకూల వాతావరణం నెలకొంది. అయితే ప్రలోభాలపైనే నమ్మకంతో వైసీపీ శ్రేణులు ఉన్నాయి.

ఒంగోలులో మారిన వాతావరణం

ప్రతిష్టాత్మక పోటీ జరిగినా ఒంగోలు నియోజకవర్గంలో రాజకీయపరమైన అనుకూల వాతావరణం టీడీపీకి వరంగా మారింది. వైసీపీకి పోల్ నిర్వహణలో విజయం సాధించామనే నమ్మకం కనిపిస్తోంది. గత ఎన్నికలలో వైసీపీ అభ్యర్థి బాలినేని 23వేల అధిక్యతను పొందారు. గతంలో వైసీపీకి అధిక్యతను ఇచ్చిన ఉద్యోగ, వ్యాపారవర్గాల ఓటర్లతోపాటు కాపు సామాజికవర్గ ఓటర్లలో భారీగా గండిపడింది. గత ఎన్నికల్లో 10వేల ఓట్లు పొందిన జనసేన, ఈ పర్యాయం టీడీపీకి గట్టి మద్దతుగా నిలబడింది. టీడీపీ అభ్యర్థి జనార్దన్ గత ఎన్నికల్లో వైఫల్యం చెందిన పోల్ మేనేజ్‌మెంట్‌లో పూర్తి జాగ్రత్తలు తీసుకున్నారు. వైసీపీకి దళిత, ముస్లిం, బీసీల్లో యాదవ సామాజికవర్గ ఓటర్లలో అధికృత ఉందనే నమ్మకంతో ఉంది. అయితే కులాలకతీతంగా ఉద్యోగ, వ్యాపారవర్గాలు, యువత, నిరుద్యోగులు టీడీపీవైపు మొగ్గుచూపడంతో వైసీపీకి భారీ నష్టం జరిగిందని విశ్లేషకుల అంచనా. బ్రాహ్మణ ఓటర్లతోపాటు, యాదవేతర బీసీ ఓటర్లలో టీడీపీ కూటమి ఓట్లు పెరగడం కనిపిస్తోంది. కమ్మ, కాపు, ఆర్యవైశ్యుల్లో టీడీపీ మంచి అధిక్యతను పొందినట్లు వెల్లడైంది. అభివృద్ధి అంశాలు దామచర్లకు కలిసొచ్చింది. అయితే గత నాలున్నరేళ్లలో నగరంలో జరిగిన భూదందాలు, అల్లరి మూకల ఆగడాలు, వైసీపీ శ్రేణుల దాడులు ఆ పార్టీకి కనిపించని నష్టాన్ని కలిగించింది. మొత్తంగా చూస్తే ఒంగోలురూరల్ మండలంలో టీడీపీ అధిక్యత గతం కన్నా మూడింతలు పెరగబోతుంది. కొత్తపట్నం మండలంలో గత ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన అధిక్యతలో భారీగా గండి పడబోతుంది. నగరంలో నడిబొడ్డు ప్రాంతంలోని అన్ని బూత్‌లలో టీడీపీ అనుకూల వాతావరణం కనిపించగా, మురికివాడల్లో వైసీపీకి అధిక్యత కనిపించింది. గెలుపుపై ఇరు పార్టీలో ధీమా ఉన్నప్పటికీ అనుహ్య పరిస్థితులు మినహా టీడీపీకే మొగ్గు కనిపిస్తోంది. అందుకూ విస్తృత ప్రజాసంబంధాలు ఉన్నా మాగుంట టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ఉండటం కూడా ఒక కారణంగా భావిస్తున్నారు.

కొండపిలో మళ్లీ అదే ఫలితం

కొండపిలో ఈ పర్యాయం కూడా టీడీపీకి సానుకూలత కనిపిస్తోంది. అభ్యర్థి స్వామి స్థానికుడు కావడం అండగా దామచర్ల కుటుంబం ఉండటం, మాగుంట రాక కలిసొచ్చింది. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు మద్దతు టీడీపీకి కలిసొచ్చింది. వైసీపీ అభ్యర్థి సురేష్ స్థానికేతరుడు కావడం నియోజకవర్గ వైసీపీలో గ్రూపు విభేదాలు తారస్థాయిలో ఉండటం ప్రతికూల అంశాలు. డబ్బు పంపిణీలో వైసీపీ ముందు ఉన్నప్పటికీ సొంత సామాజికవర్గం ఓటర్ల మద్దతుగా వారు చేసిన ప్రయత్నం ప్రత్యర్థి సామాజికవర్గంలో ఓట్ల చీలకకు తావిచ్చింది. వైసీపీలో రెండు వర్గాల వారు కాడి కిందపడేశారు. ఇది కొన్ని గ్రామాల్లో టీడీపీ ఓట్ల పెరుగుదలకు దోహదపడింది. డబ్బు పంపిణీలోనూ తనకు ఉన్న అనుభవంతో పరిస్థితిని చక్కబెట్టుకోవడంలో సురేష్ ముందుండంతో గట్టిపోటీని ఇచ్చినప్పటికీ విజయావకాశాలపై అనుమానాలు తప్పలేదు. వైసీపీకి బలమైన సింగరాయకొండ మండలంలో ఆ పార్టీ అధిక్యతకు భారీగా గండిపడటం ఖాయంగా కనిపిస్తోంది. అంతోఇంతో ఆ పార్టీకి ఆమండలంలో అధిక్యత లభించిన టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లో టీడీపీకి మెజార్టీ అధికంగానే ఉండే అవకాశం ఉంది. పొన్నలూరు, మర్రిపూడి మండలాల్లో అధిక్యతపై వైసీపీ కూడా ఆశలతో ఉన్నప్పటికీ అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. కొండపి మండలంలో టీడీపీకి స్పష్టమైన అధికృత కనిపిస్తోంది. స్థానికేతరుడు అయినప్పటికీ అభ్యర్థి మార్పు వైసీపీకి కొంత ఉపయోగపడినా మారిన రాజకీయ పరిణామాలు మాగుంట రాక తదితర అంశాలతో టీడీపీనే గెలిచే ఆవకాశం కనిపిస్తోంది.

సంతనూతలపాడులో వార్ వన్‌సైడ్

ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గంలో స్థానికేతరుడైన వైసీపీ అభ్యర్థి నాగార్జునకు ఆ పార్టీలో అన్ని గ్రూపుల నుంచి అవసరమైన సహకారం లభించలేదు. అసమ్మతివాదులను కలుపుకోని పోయేందుకు నాగార్జున చేసిన ప్రయత్నాలు పూర్తిగా ఫలించలేదు. టీడీపీ అభ్యర్థి విజయకుమార్ టీడీపీ, జనసేన నాయకులను ఐక్యంగా నడపడంలో సఫలీకృతులయ్యారు. టీడీపీ శ్రేణులు పట్టుదలతో పనిచేశారు. వైసీపీ నుంచి టీడీపీలోకి కొంతమంది చేరడం, పరోక్షంగా కొంతమంది మద్దతివ్వడం కూటమికి కలిసొస్తుంది. ముఖ్యంగా చీమకుర్తి మండలంలో వైసీపీ అధిక్యతకు గండిపడింది. అక్కడ బూచేపల్లి కుటుంబం దర్శిలో రంగంలో ఉండటం ఒక కారణం. చీమకుర్తిలో జనసేన ఓట్లు బదిలీకావడం బూచేపల్లి వ్యతిరేకవర్గం సహకరించడం కూడా కలిసొచ్చింది.

వైసీపీకి బలమైన గ్రామాలైన పల్లామల్లి, చంద్రపాడు వంటి వాటిలో టీడీపీ బలం పెరిగింది. ఈ పరిస్థితిల్లో మండలంలో ఆధిక్యతపై ఇరు పార్టీల ధీమా ఉన్నప్పటికీ వైసీపీ గతంలో సాధించిన అధిక్యతను కోల్పోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఎస్‌ఎన్‌పాడు, ఎన్‌జీపాడు మండలాల్లో టీడీపీ కూటమికి బలమైన అధిక్యత లభించబోతుంది. మద్దిపాడు మండలంలో ఇరుపార్టీలో పోటాపోటీగా ఉన్నప్పటికీ ఎవరికైనా స్వల్ప అధిక్యత కనిపిస్తోంది. దీంతో సుమారు 10వేల అధిక్యత లభిస్తోందన్న ధీమాలో టీడీపీ ఉండగా, కనీసం నాలుగు, ఐదు వేలతోనైనా బయటపడగలమని ఆశతో వైసీపీ ఉన్నారు.

చీరాల, కందుకూరులో నువ్వానేనా..

చీరాల, కందుకూరు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ నువ్వానేనా అన్నట్లు సాగింది. చీరాలలో త్రిముఖ పోటీ జరిగింది. వైసీపీ అభ్యర్థి వెంకటేష్, టీడీపీ అభ్యర్థి కొండయ్యయాదవ్ మధ్యలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమంచి రంగంలోకి వచ్చారు. మూడు పార్టీల్లోనూ విజయావకాశాలపై ధీమా ఉన్నప్పటికీ త్రిముఖ పోటీ టీడీపీకి కలిసివచ్చే అవకాశాలను కొట్టేయలేమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలలో టీడీపీ, వైసీపీలు పోటీపడగా, కాంగ్రెస్ అభ్యర్థి కొంతమేర వెనుకబడ్డారు. అయితే యాదవులు అధికంగా ఉండే గ్రామంలో టీడీపీ అభ్యర్థిపై దాడి జరగడం, బలహీనవర్గాల్లో కొంత టీడీపీకి కొంత ఊతమిచ్చింది. పోలింగ్ చివర్లో వైసీపీ, కాంగ్రెస్ శ్రేణులు ఘర్షణలో మునిగితేలుతుండగా, మిగిలిన ఓట్లను పోల్ చేయించుకోవడంలో టీడీపీ సఫలీకృతమైంది. ఆర్యవైశ్యుల ఓట్లలో టీడీపీకి ఊహించిన దానికన్నా ఎక్కువే పడ్డాయి. వేటపాలెం మండలంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రధాన పోటీదారులుగా ఉండగా చీరాల మునిసిపాలిటీలో ముగ్గురు మధ్య పోటీ నడిచింది. యాదవ సామాజికవర్గం ఉన్న గ్రామాలన్నీ టీడీపీకి సానుకూలంగా మారాయి. వైసీపీ ఓట్లు చీలక కలిసిసొస్తుందన్న భావన టీడీపీ శ్రేణుల్లో విజయంపై నమ్మకాన్ని పెంచింది. కందుకూరులో వైసీపీ, టీడీపీల మధ్య గట్టిపోటీ నెలకొంది. అయితే వైసీపీ అభ్యర్థి మధుసూదన్ స్థానికేతరుడు కావడం, ప్రధానంగా బలమైనవర్గం కలిగిన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి రంగంలో లేకపోవడం వైసీపీకి మైనస్‌లుగా మారాయి. కందుకూరు పట్టణంలో ఆర్యవైశ్య ఓటర్లు టీడీపీకి అండగా నిలిచారు. జనసేన రూపంలో కాపు సామాజికవర్గం ఓట్లు టీడీపీకి పడ్డాయి. అలాగే వలేటివారిపాలెం, లింగసముద్రం మండలంలో టీడీపీకి ఆధిక్యత వస్తుంది. గుడ్లూరు మండలంలో వైసీపీకి ఆధిక్యత ఉంది. ఉలవపాడు మండలంలో ఆధిక్యతపై ఇరుపార్టీలూ విశ్వాసంతో ఉన్నాయి. రెడ్డి సామాజికవర్గానికి సంబంధించి వైసీపీ ఓట్లను టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి మార్చుకోగలిగాడన్న ప్రచారం ఉంది. దీంతో టీడీపీ ఆశలు పెరిగాయి. గ్రూపులకతీతంగా నియోజకవర్గంలో బలమైన కమ్మ, యాదవ సామాజికవర్గం అభ్యర్థులను రంగంలోకి దించడంతో అంచనాల విషయంలో అందరిలోనూ తడబాటు కనిపిస్తోంది.

అద్దంకి, పర్చూరులో...

గత ఎన్నికల్లోనూ టీడీపీ విజయం సాధించిన అద్దంకి, పర్చూరుల్లో ఈసారి పట్టుకోసం వైసీపీ అధినాయకత్వం ముందు నుంచి పలు ప్రయత్నాలను చేసింది. స్థానికేతరులైన అభ్యర్థులను రంగంలోకి దించగా, టీడీపీ కూటమికి తిరిగి రవికుమార్, సాంబశివరావులను బరిలోకి దింపింది. అద్దంకిలో డాక్టర్ గరటయ్య వైసీపీకి రాజీనామా చేయగా, పర్చూరులో మండల, గ్రామస్థాయిల్లో పలువురు బలమైన నేతలు టీడీపీలో చేరగా, మరి కొందరు సైలెంట్ అయ్యారు. ఓటర్ల ప్రభావిత చర్యలకు వైసీపీ ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ టీడీపీ కూటమి నుంచి కూడా ఎక్కడా తగ్గలేదు. పోలింగ్ అనంతరం పరిణామాలను పరిశీలిస్తే అద్దంకి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ టీడీపీ సానుకూల వాతావరణం నెలకొంది. సంతమాగులూరు మండలంలోనూ టీడీపీకే ఆధకత్య వచ్చే అవకాశాలున్నాయి. బల్లికురవ మండలంలో టీడీపీకి గతంలో 800 ఓట్ల ఆధిక్యత రాగా, ఇప్పుడు రెట్టింపు అయ్యే అవకాశాలున్నాయి. అద్దంకి పట్టణంలో టీడీపీ ఆధిక్యత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. పంగులూరు కొరిశపాడు మండలాల్లో మంచి ఆధిక్యత లభించే అవకాశాలున్నాయి. పర్చూరు నియోజకవర్గంలో చినగంజాం మండలంలో వైసీపీ ఆధిక్యతకు పూర్తిగా గండిపడింది. జనసేన కలయిక, ఇతర అంశాలతో పర్చూరు, కారంచేడు మండలాల్లో టీడీపీ ఆధిక్యత పెరిగే పరిస్థితులు స్పష్టంగా ఉన్నాయి. యద్దనపూడి మండలంలో స్థానిక పరిస్థితులు, గొట్టిపాటి వర్గీయుల్లో కూడా కొందరు అదనంగా కలిసిరావడం ఏలూరికి దళిత, బలహీనవర్గాల్లో పలువురు కొత్తగా మద్దతు ప్రకటించడంతో అక్కడా ఆధిక్యత వస్తుంది. ఇంకొల్లు మండలంలో గట్టిపోటీ జరిగినప్పటికీ దగ్గుబాటి వర్గీయులు ఎక్కువమంది కలిసివచ్చారు. దీంతో నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎప్పుడూ రాని ఆధిక్యత టీడీపీకి లభించే అవకాశాలు లేకపోలేదు.

బాధితులపైనే బైండోవర్ కేసులు!

- వెంగముక్కలపాలెం టీడీపీ శ్రేణులపై పోలీసుల ఒత్తిడి
- గ్రామానికి చేరుకుని బాధితులు, పోలీసులతో మాట్లాడిన దామచర్ల
- కావ్యశ్రీ, భాస్కర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డిలపై కేసు పెట్టాలని డిమాండ్



పోలీసులతో మాట్లాడుతున్న జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), మే 15 : ఎన్నికల పోలింగ్ సందర్భంగా వెంగముక్కలపాలెంలో జరిగిన ఘర్షణలో బాధితులపైనే పోలీసులు బైండర్ కేసులకు సిద్ధమయ్యారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో పోలింగ్ సమయం ముగిసిన తర్వాత వెంగముక్కలపాలెంలోని ఓ పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లిన వైసీపీ అభ్యర్థి బాలినేని కోడలు కావ్యశ్రీ, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి, ఆయన వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డి ఓట్లు వేసే ప్రయత్నం చేయగా, దానిని టీడీపీ ఏజెంట్లు అడ్డుకున్న విషయం విదితమే. దీంతో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ నేతలు దౌర్జన్యం చేసి, దాడి చేశారు. వారి అనుచరులు అర్ధరాత్రి టీడీపీ శ్రేణుల ఇళ్లలోకి చొరబడి మరో విడత దాడి చేశారు. అయితే తమపై జరిగిన దాడిపై బాధితులు బాలినేని ప్రణీత్‌రెడ్డి, కావ్యశ్రీ, కుండా భాస్కర్‌రెడ్డితోపాటు వారి అనుచరులపై తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నేటికి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఇదిలా ఉంచితే బుధవారం బాధితులైన టీడీపీ శ్రేణులను బైండవర్ చేసేందుకు పోలీసులు అత్యుత్సాహం చూపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకునేందుకు వెంగముక్కలపాలెంకు రావడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దాడిచేసిన వారిని అరెస్టు చేయకుండా, కనీసం కేసు నమోదు చేయకుండా పోలీసులు బాధితులను బైండవర్ చేయడం సరికాదని తేల్చిచెప్పారు. అయితే పోలీసులు మరింత ఒత్తిడి చేయడంతో విషయం తెలుసుకున్న టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ హుటాహుటిన వెంగముక్కలపాలెంకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. అండగా ఉంటానని భరోసా కల్పించారు. అదేసమయంలో పోలీసులతో మాట్లాడిన దామచర్ల చట్టప్రకారం నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. ముందుగా ప్రణీత్‌రెడ్డి, కావ్యశ్రీ, భాస్కర్‌రెడ్డితోపాటు దాడికి పాల్పడిన వారి అనుచరులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, ఆ తర్వాతనే టీడీపీ శ్రేణులపై బైండవర్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. వెంగముక్కలపాలెంలో జరిగిన వైసీపీ మూకల దాడిని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, డీజీపీకి, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని, 24 గంటల్లో వారిపై కేసు నమోదు చేయకుంటే ఎస్పీ కార్యాలయం ఎదుట, డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

మృతుల కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం ఇవ్వాలి

మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్



సంఘటనా స్థలం వద్ద మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

పర్చూరు, (చిన్నగంజాం), మే 15 : పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం పసుమర్రు సమీపంలోని ఈపూరివారిపాలెం వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి ఈపూరివారిపాలెం వద్ద జరిగిన ప్రమాద స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆనవాళ్లు కూడా గుర్తించే పరిస్థితి లేకుండా ఆరుగురు సజీవ దహనం అయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈఘోర ప్రమాదంలో చిన్నగంజాం మండలానికి చెందిన ఆరుగురు సజీవ దహనం కావడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బైపాస్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ ముందస్తు చర్యలు తీసుకోక పోవడమే ప్రమాదానికి కారణమని అన్నారు. బైపాస్ వారు సైడు రోడ్డు నుంచి మెయిన్ రోడ్డులోకి వెళ్లే వాహనాలకు ఇండికేషన్ జాగ్రత్తలు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ఈ దారుణం జరిగిందన్నారు. దీనిలో కాంట్రాక్టర్, అధికారుల లోపం చాలా స్పష్టంగా కనిపిస్తుందన్నారు. వారి నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్ల ఆరుగురు నిండు ప్రాణాలు గాలిలో కలసిపోయాయన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కాంట్రాక్టర్‌పై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు ప్రతిపాటి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టీడీపీ శ్రేణుల్లో సర్వేల జోష్

- కూటమికే విజయావకాశాలు
- బెట్టింగ్‌లకు ముందుకొస్తున్న పలువురు
- వెనక్కి తగ్గుతున్న వైసీపీ నాయకులు
- ఆ కేడర్‌లో ఆందోళన
- గొట్టిపాటిని కలుస్తున్న గ్రామాల నేతలు



గొట్టిపాటిని కలిసిన వల్లాపల్లి టీడీపీ నేతలు

బల్లికురవ, మే 15 : పోలింగ్ ముగిసి రెండు రోజులు కావడం పలు సంస్థల సర్వేలు టీడీపీ కూటమికే అధిక సీట్లు వస్తాయని ప్రకటిస్తుండడంతో టీడీపీ శ్రేణులో జోష్ నెలకుంది. గ్రామాల్లో పోలింగ్ తీరును విశ్లేషించుకుంటున్న నేతలు గెలుపు అవకాశాలపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు ఈసారి అన్ని మండలాల్లో మంచి మెజారిటీ వస్తుందని వారు అంటున్నారు. వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ నుండడంతో కూటమికి 120కి పైగా సీట్లు వస్తాయని, ఎమ్మెల్యే గొట్టిపాటి 20వేల మెజార్టీతో గెలుపొందుతారంటూ పలువురు బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు. బల్లికురవ మండలంలో టీడీపీకి 2500పైబడి మెజార్టీ వస్తుందని లక్షల్లో బెట్టింగ్‌లు కాశారు. టీడీపీ వైపు నుంచి ఎక్కువ మంది బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నా వైసీపీ నేతలెవరూ ముందుకు రావడంలేదు. పోలింగ్ ముగిశాక బెట్టింగ్‌లకు ఎవరు ముందుకు రావడం లేదని టీడీపీ నేతలు అంటున్నారు. కొన్ని గ్రామాలపై కూడా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఎవరికి వారు గ్రామాలపై మెజార్టీపై కూడా బెట్టింగ్‌కు సిద్ధమవుతున్నారు. జాతీయ సర్వేలు కూడా టీడీపీ కూటమికి జై కొట్టడంతో గ్రామాలలో టీడీపీ కార్యకర్తలు కూడా తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ఎవరికి వారు సంతోషంలో మునిగి తేలుతున్నారు. ఐదేళ్లలో గ్రామాలలో అభివృద్ధి అనే మాటేలేదన్నారు. టీడీపీ కూటమి రాగానే అభివృద్ధి పనులు మొదలు పెడతామని అంటున్నారు.

ఎమ్మెల్యేను కలిసేందుకు భారీగా వెళ్తున్న శ్రేణులు

నెల రోజుల నుంచి గ్రామాలలో ఎన్నికల సందడి సాగింది. ప్రతి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని టీడీపీ కూటమి శ్రేణులు ఐక్యతతో నిర్వహించారు. గొట్టిపాటికి భారీ మెజార్టీ తేవాలని సమన్వయంతో పనిచేశారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తండోపతండాలుగా తమ నేత గొట్టిపాటిని కలిసేందుకు తరలివస్తున్నారు. రెండురోజులుగా చిలకలూరిపేటలో ఆయన నివాసానికి వెళ్లి కలిసి ముందస్తు అభినందనలు తెలుపుతున్నారు. గ్రామాలవారీగా ఎన్నికల తీరుపై, ఫలితాలను గొట్టిపాటి దృష్టికి తీసుకెళ్తున్నారు.



శాంతినగర్‌లో బారులు తీరిన మహిళలు.. ఐక్యనగర్‌లో ఈవీఎంలు ఆగిపోవడంతో వేచి ఉన్న వృద్ధులు

సార్వత్రిక ఎన్నికల్లో అతివల ఓట్లే కీలకం

- సింహభాగం ఓట్లు వారివే
- చీరాల ఎమ్మెల్యే స్థానాన్ని నిర్ణయించనున్న మహిళలు

చీరాలటౌన్, మే 15 : 2024 సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యే స్థానాన్ని నిర్ణయించడంలో అతివల ఓట్లే కీలకంగా మారాయి. ఓటర్లలోనే కాకుండా ఓటు హక్కు వినియోగించుకున్న సంఖ్యలో కూడా మహిళలే అధికంగా మారి ముందంజలో ఉన్నారు. ఈక్రమంలో వీరి ఓట్లపైనే ప్రధాన పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. ఒకవైపు టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు చేరువుగా ఉన్నాయి. కావున కచ్చితంగా విజయం మాదేనంటూ తమ్ముళ్ల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నేరుగా మహిళలకు సంక్షేమ పథకాలు ఇచ్చామని, విజయం మాదేనంటూ వైసీపీ శ్రేణులు ఉన్నాయి.

2024 సార్వత్రిక ఎన్నికల చీరాల అసెంబ్లీ వివరాలు

	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
	98,729	1,03,958	24	2,02,711
పోలైనవి :	81,772	85,681	13	1,67,466

సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి కచ్చితంగా 82.61 శాతంతో పెరిగిందనే చెప్పాలి. నియోజకవర్గంలో పలు చోట్ల గంటల కొద్దీ ఈవీఎంలు మొరాయించాయి. అంతేకాకుండా ఎండలు కూడా ఆరోజు భగ్గుమన్నాయి. కానీ ఓటర్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఓటును వినియోగించుకున్నారు. కానీ అధికారులు వైఫల్యం కొట్టొచ్చినట్లుగా కనిపించింది. గత ఎన్నికల సమయంలో ఈవీఎంలు గంటలకొద్దీ ఆగిపోయి పోలింగ్ చాలా ఆలస్యంగా జరిగింది. అలాంటప్పుడు ఈసారి ఆ పొరపాటు మళ్లీ జరుగకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా చర్య లు తీసుకోలేదు. దీంతో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావల్సిన పోలింగ్ ఆది నుంచే మిషన్లు సతాయిస్తూ స్లోగా ముందుకు సాగింది. దీం తో ఓటర్లు గంటల కొద్దీ ఎండలో నిల్చుని అవస్థలు పడుతూ పడిగాపులు పడాల్సి వచ్చింది. ముఖ్యంగా బూత్ నెంబర్ 76 ఐక్యనగర్‌లో మూడు సార్లు ఈవీఎంలు ఆగిపోయాయి. దీంతో అక్కడ అన్ని పార్టీలకు చెందిన ఏజెంట్ల సంతకాలతో ఈవీఎంలు మార్చి, మార్చి ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఎన్నికలు ముగిశాయి. మొత్తంగా మహిళలు ఎవ్వరికి పట్టం కడతారో వేచి చూడాల్సి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య, టీడీపీ నేతలు

గెలుస్తున్నాం.. అభివృద్ధిలో ముందుంటాం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

చీరాల, మే 15 : ఎన్నికల్లో చీరాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుస్తున్నాం. అభివృద్ధిలో ముందుంటామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం ఎం కొండయ్య అన్నారు. తన గెలుపునకు సహకరించిన కూటమి శ్రేణులు, నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో చెదురుమదురు ఘటనలు తప్ప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వ్యూహాత్మకంగా పనిచేశారన్నారు. నియోజకవర్గంలో అన్నివర్గాల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చీరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు. చంద్రబాబు తనను నిరంతరం వెన్నుతట్టి ప్రోత్సహించారన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో చంద్రబాబు సహకారం తనకు పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, నాతాని ఉమామహేశ్వరరావు, గుద్దంటి చంద్రమౌళి, వీరయ్యచౌదరి, నాశిక వీరభద్రయ్య, గజవల్లి శ్రీనివాసరావు, బొగ్గుల పార్థసారథి, గూడూరు శివరామప్రసాద్, సయ్యద్ బాబు, కౌతవరపు జనార్దనరావు, ఎంఆర్ఎఫ్ రమేష్ పాల్గొన్నారు.

రేపు బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

మార్టూరు, మే 15 : మండల పరిధిలో మార్టూరు గన్నవరం రోడ్డులో బొబ్బేపల్లి దండుదారి వద్ద పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం స్వామి వారి ఆరాధన, గురుపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తామని అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని, మార్టూరు ప్రాంత భక్తులు అందరూ హాజరై స్వామి వారి ఆశీస్సులను పొందాలని కమిటీ సభ్యులు కోరారు.

పూనూరులో అర్చకుడు మృతి

యద్దనపూడి, (మార్టూరు) మే 15: యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ రెండవ అర్చకులు జీవీ నరసింహాచార్యులు (51) అనారోగ్య కారణంగా బుధవారం వేకువ జామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అర్చకత్వంతోపాటు ప్రైవేటు వైద్యునిగా రూపాయి ఫీజు తీసుకోకుండా వైద్య సేవలందించేవారు. బుధవారం ఉదయం పూనూరు గ్రామస్థులతోపాటు, చుట్టుపక్కల గ్రామాల వారు తరలి వచ్చి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. సాయంత్రం నరసింహాచార్యులు అంత్యక్రియలు పూర్తయ్యాయి.

19న గంగవరంలో మెడికల్ క్యాంప్

ఇంకొల్లు, మే 15 : మండలంలోని గంగవరం మంచాల వెంకట్రామయ్యరంగమ్మ కల్యాణ మండపంలో ఈ నెల 19వ తేదీన ఆదివారం గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ, అనంతలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ రోగులకు కేవలం రెండు వందల రూపాయలకే రెండు నెలలకు సరిపడా మందులను అందజేయనున్నారు. ఈ అవకాశాన్ని గంగవరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మంచాల రమేష్ బాబు కోరారు.

మండలంలో పోలైన ఓట్లు 34,792

ఇంకొల్లు, మే 15 : ఇంకొల్లు మండలంలో 13 పంచాయతీల పరిధిలో 20 గ్రామలలో 54 కేంద్రాలలో పోలింగ్ నిర్వహించగా 34,792 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఇంకొల్లు మండలంలో మొత్తం 40,480 ఓటర్లు ఉండగా 34792 మంది జరిగిన ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇంకొల్లు పంచాయతీలో ఇంకొల్లు, హనుమోజిపాలెం, గొల్లపాలెం గ్రామాలలో 20 వార్డులలో 13,591 ఓటర్లు ఉండగా, 11364 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కోనంకిలో గొడవపై నాలుగు కేసులు

మార్టూరు, మే 15 : ఎన్నికలు పోలింగ్ జరిగిన సోమవారం నాడు మండలంలోని కోనంకి గ్రామంలో తెలుగుదేశం వైసీపీ పార్టీ కార్యకర్తలకు మధ్య జరిగిన గొడవలో గాయపడిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగు క్రిమినల్ కేసులను నమోదు చేసినట్లు మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్ వీ రాజశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. రెండు పార్టీలకు చెందిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన 15 మందిపై, వైసీపీకి చెందిన 15 మందిపై కేసు నమోదు చేశామన్నారు. తహసీల్దారు వద్ద బైండోవర్ చేశామన్నారు.

మహిళా కార్మికులకు చీరల పంపిణీ

మార్టూరు, మే 15 : మార్టూరులో గ్రానైట్ పరిశ్రమ యజమాని పొత్తూరి శివ దంపతులు తమ వివాహ దినోత్సవం సందర్భంగా బుధవారం గ్రామ పంచాయతీలోని మహిళా పారిశుధ్య కార్మికులకు, ఎస్టీ కాలనీలోని పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

పెరిగిన పోలింగ్ ఎవరికి లాభం..?

చీరాల, మే 15 : చీరాల నియోజకవర్గంలో పోలింగ్ శాతం గతంలో కంటే భారీగా పెరిగింది. అది ఎవరికి లాభిస్తుందనే అంశంపై రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సా గుతోంది. చీరాల నియోజకవర్గంలో మొత్తం 2,02,711 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 98, 729మంది, మహిళలు 1,03,958 మంది, ఇతరులు 24 మంది ఉన్నారు. వారిలో 1,67,466 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81,772 మంది పురుషులు, 85,681 మంది మహిళలు, ఇతరులు 13 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 218 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. అందులో వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం బూత్ నెంబరు 172లో అత్యధికంగా 1226 ఓట్లు పోలయ్యాయి. కొత్తపేట వివేకానందకాలనీలో బూత్ నెంబరు 154లో అత్యల్పంగా 380 ఓట్లు పోలయ్యాయి. ఈ క్రమంలో రాజకీయ విశ్లేషకులు తమ అంచనాలకు పదును పెడుతున్నారు. కూడికలు, తీసివేతలతో బిజీబిజీగా ఉన్నారు.

వాగు లోకి దూసుకుపోయిన కారు

వ్యక్తి మృతి, పలువురికి గాయాలు

కారంచేడు(పర్చూరు), మే 15: కారు అదుపుతప్పి వాగులోకి దూసుకుపోయి వ్యక్తి మృతి చెందగా, పలువురికి స్వల్పగాయలైన సంఘటన కారంచేడు మండల పరిధిలోని రామానాయుడు వారధి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. చిలకలూరిపేట నుంచి కుటుంబ సభ్యులతో వాడరేవు వెళతుండగా కారు అదుపు తప్పి పక్కనే ఉన్న వాగులోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో కారు డ్రైవర్ మహబూబ్ సుభాని(55) మృతి చెందగా, కారులో ఉన్న మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న కారంచేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై సురేష్ తెలిపారు.

వ్యక్తిపై మరోవ్యక్తి ఇనుపరాడ్‌తో దాడి

చీరాలటౌన్, మే 15 : వ్యక్తిపై మరోవ్యక్తి ఉద్దేశపూర్వకంగా ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక విఠల్‌నగర్‌లోని పోలేరమ్మ గుడి సమీపానికి చెందిన పట్నాన పాపారావు సిమెంట్ లోడ్ ఆటో డ్రైవర్, అలాగే అదే ప్రాంతానికి చెందిన బస రాంబాబు బోరింగ్స్ పని చేస్తుంటాడు. వీరిద్దరికీ మంగళవారం రాత్రి ఓ కార్యక్రమంలో భోజనాల వద్ద వివాదం జరిగింది. ఈక్రమంలోనే బుధవారం పనికి వెళ్లేందుకు ఆటో ఇంటి వద్ద బయటకు తీస్తున్న సమయంలో రాంబాబు పథకం ప్రకారం వచ్చి ఒక్కసారిగా ఇనుపరాడ్డుతో గట్టిగా తలపై మోది పరారయ్యాడు. ఈ నేపథ్యంలో పాపారావు రక్త గాయలతో ఉండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

ధర్మం వైపు నిల్చున్న ఓటర్లు

- కూటమి విజయం తథ్యం
- ప్రజా తిరుగుబాటు వైసీపీకి గుణపాఠం కానుంది
- ఎమ్మెల్యే గొట్టిపాటి

సంతమాగులూరు (అద్దంకి), మే15 : మంచికి, చెడుకు మధ్య జరిగిన ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ధర్మం వైపు నిలబడ్డారని ఎమ్మెల్యే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద బుధవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నేతలతో రవికుమార్ ఎన్నికల సరళిపై చర్చించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే భారీ ఓటింగ్ నమోదైందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమన్నారు. చంద్రబాబు నిర్విరామ కృషికి ఈ ఎన్నికలు నిదర్శనంగా నిలువబోతున్నాయన్నారు. ఎన్నికలలో పవన్‌కల్యాణ్, బీజేపీ నేతల కృషి మరువలేనిదన్నారు. ఆంధ్ర ప్రదేశ్ భవిష్యత్‌కు, తెలుగుజాతి ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పు చిరకాలం గుర్తుండబోతుందన్నారు. వైసీపీ సీనియర్ నాయకులకు సైతం డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి స్థానికంగా ఓటర్లు భారీగా తరలి వచ్చి ఎన్నో కష్టాలు ఎదురైనా ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలివచ్చినందుకు రవికుమార్ ధన్యవాదములు తెలిపారు. ప్రజా తిరుగుబాటు వైసీపీకి గుణపాఠం కాబోతుందని, ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం, అద్దంకి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని గొట్టిపాటి ధీమా వ్యక్తం చేశారు. పలు మండలాల నేతలు ఆయా గ్రామాలలో వచ్చే మెజార్టీల వివరాలను రవికుమార్‌కు వివరించారు.

అద్దంకిలో 88 శాతం పోలింగ్

అధికంగా వినియోగించుకున్న పురుష ఓటర్లే



జూనియర్ కాలేజీ వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

అద్దంకి, మే 15 : అద్దంకి నియోజకవర్గంలో 13వ తేదీ జరిగిన పోలింగ్ లో 88.25 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్వో సునీల్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం లో మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉండగా 2,15,375 మంది ఓటు హక్కు వినియోగించుకొని 88.25 శాతం ఓటింగ్ జరిగింది. మొత్తం 1,19,570 మంది పురుషులు కాగా 1,05,718 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 88.42 శాతం మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం మహిళా ఓటర్లు 1,24,475 మంది కాగా 1,09,654 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 88.10 శాతం మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతరులు 12 మంది కాగా ముగ్గురు మా త్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 25 శాతం మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్ల పరంగా పరిగణలోకి తీసుకుంటే పురుషులు 1,05,718 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, మహిళలు 1,09,654 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం పరిగణలోకి తీసుకుంటే పురుషులు 88.42 శాతం, మహిళలు 88.10 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటర్ల పరంగా మహిళా ఓటర్లే ఎక్కువ ఉన్నప్పటికీ ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషుల కంటే మహిళల శాతమే తక్కువ.

ఓటేసేందుకు వచ్చి..ప్రాణాలు వీడి

- చిలకలూరిపేట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- టిప్పర్‌ను ఢీకొట్టి దగ్ధమైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు
- నీలాయపాలెంవాసులు నలుగురు దుర్మరణం
- వారిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు
- ఇద్దరు డ్రైవర్లు మృతి



బస్సులోని మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

పర్చూరు, మే 15 : సొంతూరిపై మమకారం.. ఓటు వేయాలన్న దృఢ సంకల్పం.. పిల్లాజెల్లతో ఇంటిల్లిపాదీ సొంత ఊళ్లకు వచ్చారు. ఓటు హక్కును హక్కు బాధ్యతగా భావించి, ఓటేసి తిరిగి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మణం పాలయ్యారు. ఓటేసేందుకు సొంత ఊళ్లకు వచ్చి ఒక్కరోజు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. తిరిగి వారు ఉద్యోగ, వ్యాపారాలు చేసే ప్రాంతాలకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. అంతలోనే మృత్యువు కాటేసింది. ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామ సమీపంలో ప్రమాదం జరిగింది. చినగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన ఒకే కుటుంబంవాళ్లు కాశీ బ్రహ్మేశ్వరరావు (65), భార్య లక్ష్మి (60), మనవరాలు ఖ్యాతి (10సం), ఆదే మండలం గొనసపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (54) సజీవదహనమయ్యారు. నీలాయపాలెం గ్రామానికి చెందిన 10 మంది బస్సులో ప్రయాణిస్తుండగా, అందులో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు మృతి చెందడం విషాదకరం.

ఈసంఘటనలో ఇద్దరు డ్రైవర్‌లతో సహా బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవ దహనమయ్యారు. కళ్ల తెరిచేలోపే బస్సు కాలి బూడిదయింది. గాఢ నిద్రలో ఉన్న పదుల సంఖ్యలో ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. స్థానికులు అప్రమత్తమై 108, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మిన్నంటిన ఆర్తనాధాలు

అర్థరాత్రి కారుచీకట్లో బస్సు అగ్నికి ఆహుతి కావడం అందులో ఉన్న ప్రయాణికులు అగ్నికి ఆహుతి అవుతూ చేసిన ఆర్తనాదాలు పలువురిని దిగ్భ్రాంతికి గురిచేశాయి. అసలు ఏమి జరిగిందో ఏమీ జరగబోతుందో అర్థంకాని స్థితిలో ప్రాణాలతో బయట పడిన వారు తీవ్ర ఆందోళనకు గురిఅయ్యారు.

మాసంపు ముద్దల్లా మృతదేహాలు

ఒక్కసారిగి బస్సు దగ్ధం కావడంతో అందులో ఉన్న ప్రయాణికులు సజీవదహనమయ్యారు. బస్సులో మృతదేహాలు చల్లాచెదురుగా గుర్తించలేని స్థితిలో మాంసం ముద్దల్లా మారాయి. ఎవరి మృతదేహం అనేది గుర్తించలేని స్థితి నెలకొంది.

కంటతడి పెట్టించిన ప్రమాదం

ఘటనా స్థలంలో బస్సులో మృతి చెంది చెల్లాచదురుగా మాంసం ముద్దల్లా పడిఉన్న మృతదేహాలు చూపరులను కంటతడి పెట్టించాయి. బంధువుల రోదనలు మిన్నంటాయి.

బస్ ప్రమాదంలో చీరాలవాసి దుర్మరణం

- మరో 15 రోజుల్లో కుమార్తె నిశ్చితార్థం..ఈలోపే ఘటన
- ప్రమాదం జరిగిన సుమారు 10 గంటల తరువాత కుటుంబ సభ్యులకు సమాచారం
- పెద్ద దిక్కును కోల్పోయి బోరున విలపిస్తున్న కుటుంబం
- రాలేనని చెప్పినా ట్రావెల్స్ వారు బలవంతంగా తీసుకెళ్లారని బంధువులు ఆరోపణ



చీరాలటౌన్, మే 15 : చిలకలూరి పేట వద్ద అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చీరాల సమీపంలోని పేరాలకు చెందిన షేక్ మస్తాన్ షరీఫ్(45) దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం షరీఫ్ సుమారుగా 25 సంవత్సరాలుగా కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కొంత కాలంగా చీరాల్లోని ఓ ప్రైవేటు బస్‌కు కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇతనికి భార్య నజ్మా, కుమార్తె రిజ్వాన, కుమారుడు అబ్బాస్ సంతానం. అయితే కుమారుడిని చదివించే స్తోమత లేకపోవడంతో వెల్డింగ్ పనికి వెళుతున్నాడు. కుమార్తెకు నూజివీడులో మంగళవారం సంబంధం కుదిరింది. ఈనెల 30న నిశ్చితార్థంకు మాట్లాడుకున్నారు. అయితే నూజివీడు నుంచి ప్రయాణం చేసి రాత్రికి ఇంటికి చేరారు. అయితే ట్రావెల్స్ యజమాని కచ్చితంగా బస్‌కు రావాల్సిందేనని తీసుకువెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెప్తున్నారు. కానీ రాత్రి 10 గంటల తరువాత డ్యూటీకి వెళ్లిన తరువాత బుధవారం ఉదయం 10 గంటలకు సంఘటన స్థలం నుంచి ఫోన్ వచ్చిందని కుటుంబ సభ్యులు చెప్తున్నారు. ప్రమాదంలో షరీఫ్ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విపిస్తున్నారు. అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న షరీఫ్ కుమార్తె వివాహం కూడా ఆగే పరిస్థితి ఉందని స్థానికులు విషాదం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో భారీగా పోలింగ్

- అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్న మహిళలు
- గతం కన్నా పెరిగిన శాతం


మేదరమెట్ల, మే 15 : కొరిశపాడు మండలంలో సార్వత్రిక ఎన్నికలల్లో భారీగా పోలింగ్ జరిగింది. మండలంలోని 15 పంచాయతీలలో పురుషుల కన్న మహిళలే ఎ క్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ రోజు సోమవారం క్యూలైన్‌లలో భారీగా మహిళలే కనిపించారు. కోన్ని పోలింగ్ కేంద్రాలల్లో అతి జాగ్రత్త వలన పోలింగ్ చాలా ఆలస్యంగా జరిగింది. రావినూతల, కుర్రవానిపాలెంలో రెండు ఈవీఎంలో గంట పాటు మొరాయించాయి. దైవాలరావూరులో అత్యధికంగా 90శాతం పోలింగ్ జరిగింది. మేదరమెట్ల పమిడిపాడు, రావినూతల గ్రామాల్లో కూడా ఓటింగ్‌లో మహిళలే ముందున్నారు. మండలంలోని మొత్తం 33,039 ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 15,949 మంది, మహిళలు 17,090 మంది పాల్గొనగా మండలంలో పురుషుల కన్నా 1141 మంది మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మేదరమెట్లలో అత్యధికంగా 8,659 మంది ఓటర్లు ఉండగా వారిలో 7,091 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు కన్నా 303 మంది మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మేజర్ పంచాయతీ అయిన రావినూతలలో 5409 మంది ఓట్లు ఉండగా 4514 మంది ఓట్లేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళా ఓటర్లే ముందంజలో ఉన్నారు. వాతావరణం చల్లబడడం కారణంగా ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపించారు. ఇతర రాష్ట్రాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి చాలా మంది ఓటు హక్కును వినియోగించుకోవడానికి స్వగ్రామాలకు చేరుకున్నారు. వారిలో ఎక్కువ మంది ఉదయమే క్యూలైన్‌లో నిలబడి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో కొరిశపాడు మండలంలో తెలుగుదేశం పార్టీకి 2850 వరకు మెజారీ వచ్చింది. గతం కంటే పోలింగ్ అధికంగా జరగడం తమకు లాభిస్తుందని తెలుగుదేశం వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.



బెంగళూరు, హైదరాబాద్ నుంచి బస్సుల్లో వచ్చిన ఓటర్లు

బాధ్యతతో వచ్చిన రావినూతల వాసులు

సార్వత్రిక ఎన్నికలల్లో తమ ఓటును వినియోగించుకోవడానికి పెద్ద సంఖ్యలో ఓటు వేయడానికి ఓటర్లు రావినూతలకు విచ్చేశారు. ఇతర దేశాలు, హైదరబాద్, బెంగళూరు వంటి నగరాల నుంచి పెద్ద సంఖ్యలో ఓట్లు వేయడానికి తరలి వచ్చారు. రెండవ శనివారం ఆదివారం రావడంతో శుక్రవారం రాత్రి బయలుదేరి, శనివారం తమ సొంత వాహనాల్లో బయలు దేరి గ్రామాలకు చేరుకున్నారు.బస్సులలో సుమారు 500 మంది, సొంత వాహనాల్లో , వివిధ మార్గాల ద్వారా మరో 400 మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చారు. వీరిలో కొందరు మాట్లాడుతు రాష్టంలో అభివృద్ధి లేకపోవడం, కక్షపూరిత రాజకీయాలు సహించలేక ఓటు హక్కుతో సరైన అభ్యర్థులను ఎన్నుకునేందుకు వచ్చామన్నారు.



'మా అభ్యర్థే గెలుస్తాడు. రూపాయికి రూపాయిన్నర పందెం. అబ్బే.. మా అభ్యర్థికి మెజారిటీ పదివేలపైన వస్తుంది. దీనిపై రూపాయికి రూపాయి. పాత జిల్లాలోని పది స్థానాల్లో ఆరింట ఒకే పార్టీ గెలుస్తుంది. రూపాయికి రూపాయి బెట్. రాష్ట్రంలో ఈదఫా ప్రభుత్వంలోకి వచ్చేది మా పార్టీయే. 120కిపైగా సీట్లు వస్తాయి. ఇదిగో.. ఈ రెండెకరాల పొలం బెట్ కడుతున్నా'...!

రూపాయికి రూపాయిన్నర!

పార్టీల గెలుపోటములపై జోరుగా పందేలు

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బెట్టింగ్స్

ఒక్కో నియోజకవర్గంలో రూ.7 కోట్ల వరకు..

నెల్లూరు (జడ్పీ), మే 15 : సార్వత్రిక ఎన్నికల ఘట్టం ముగియడంతో అభ్యర్థుల గెలుపోటములు, మెజారిటీలు, ప్రభుత్వ ఏర్పాటుపై జిల్లాలో భారీ ఎత్తున పందేలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఐపీఎల్ బెట్టింగుల్లో మునిగి తేలుతున్న పందెపు రాయుళ్లతోపాటు తాజాగా రాజకీయ నాయకుల నుంచి సామాన్యుల వరకు రూ.కోట్లలో పందేలు పెడుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పది నియోజకవర్గాలలో ప్రధాన పోటీ వైసీపీ, టీడీపీల మధ్య నెలకొనడంతో ఆయా పార్టీల అభ్యర్థుల పైన, ప్రభుత్వం ఏర్పాటుపైన పందేల జోరు ముమ్మరంగా ఉంది. నియోజకవర్గాలవారీగా టీడీపీ అభ్యర్థి గెలుస్తాడని కొందరు.. వైసీపీ అభ్యర్థి గెలుస్తాడని ఇంకొందరు పందేలు కాస్తుం డగా, కొన్ని నియోజకవర్గాల్లో తమ అభ్యర్థి గెలిస్తే రూపాయి ఇవ్వండి, ఓడితే రూపాయిన్నర ఇస్తామంటూ పందేలు కాస్తున్నారు. రూపాయి అంటే రూ.లక్ష.. రూపాయిన్నర అంటే రూ.లక్షన్నర అని అర్థం ఈ పరిస్థితి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఉండగా, మిగతా నియోజక వర్గాల్లో రూపాయికి రూపాయి పందెం కాస్తున్నారు. ఇప్పటికే ఒక్కో నియోజక వర్గంలో దాదాపుగా రూ. 6 కోట్ల నుంచి 7కోట్ల దాకా పందేలు పెట్టినట్లు సమాచారం. ఇక అభ్యర్థుల గెలిచే చోట మెజారిటీపై బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాలకు కనీసంగా ఆరు సీట్లు తమపార్టీకే వస్తాయని కొంతమంది పందేలు కాస్తుండగా, అన్ని రావని ఎదురు పందేలు కాసేవారూ ఎక్కువగా ఉంటున్నారు.

● **ప్రభుత్వ ఏర్పాటుపై భారీగా...**

ఇక రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందన్న అంశంపైనా బెట్టింగ్ జోరుగా సాగుతోంది. ఇది రూ. కోట్లలోనే ఉంటోంది. జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న వ్యక్తుల సైతం ప్రభుత్వ ఏర్పాటుపైన పందెం కాస్తున్నారు. వైసీపీ కంటే ఎన్డీఏ కూటమికి ఒక సీటు ఎక్కువగా వస్తుందని కొందరు, కూటమి కంటే వైసీపీకే ఎక్కువ సీట్లు వస్తాయని కొందరు పందెం కోసం సిద్ధమవుతున్నారు. అలాగే ఈసారి మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తుందని కొందరు, అంతసీన్ లేదు.. ఎన్డీఏ కూటమిదే ప్రభుత్వమని పందెం కాస్తున్నారు. ఇలా ఎన్ఆర్ఐలతోపాటు ప్రముఖ పార్టీల నాయ కులు, అభ్యర్థులు సైతం పందెం కాస్తున్నట్టు సమాచారం. ఏది ఏమైనా వచ్చే నెల నాల్గవ తేదీన వెల్లడయ్యే ఫలితాలపైనే పందె పురాయుళ్లతోపాటు రాజకీయన నాయకులు, అన్నివర్గాల ప్రజలు ఆశలు పెట్టుకుని ఉన్నారు.

● **ఉలవపాడులో రూ.12 లక్షలు**

ఉలవపాడు : కందుకూరులో విజయంపై ఇరుపార్టీల నాయకులు రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు. వైసీపీ వర్గీయులు బుర్రా మధుసూదన్ గెలుస్తాడని రూ.10 లక్షలకు సై అంటే.. టీడీపీ వర్గీయులు ఇంకో రెండు లక్షలు కలిపి ఇంటూరి నాగేశ్వరరావు భారీ మెజారిటీతో గెలుస్తాడని పందేనికి దిగారు. మరొకరైతే వైసీపీ గెలుపుపై ఎకరం భూమిని బెట్టింగ్‌లో పెట్టాడు. ఉలవపాడు మండలం 4 నుంచి 5 వేల మెజారిటీ వైసీపీకి వస్తుందని రూ. 1 లక్ష మన్నేటకోటకు చెందిన నాయకులు పందెం కాయగా, 2019 ఎన్నికల్లో 5800 మెజారిటీ వచ్చింది ఇప్పుడు సమం చేస్తూ ఒక్క ఓటైనా టీడీపీకి మెజారిటీ వస్తుందే కానీ వైసీపీకి రాదని లక్ష ఎదురు పందెం కాసినట్టు సమాచారం.

● **కోవూరులోనూ జోరుగా..**

కోవూరు : కోవూరు నియోజకవర్గ ఫలితం, అభ్యర్థుల మెజారిటీపై పందేలు జోరుగా సాగుతున్నాయి. నగదుతో పాటు పొలాలను కూడా పందెంలలో పెడుతున్నారు. గ్రామాలు, పోలింగ్ స్టేషన్లవారీగా మెజారిటీల విషయమై పందేలకు దిగుతున్నారు. అంతేగాక ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపడతారనే అంశంపైనా జోరుగా చర్చలు సాగి పందెం కాస్తున్నారు.





నియోజకవర్గాల నుంచి నెల్లూరుకు చేరుకున్న ఈవీఎంలు

తేలిన ఓటింగ్ లెక్క!


● **జిల్లాలో 79.63 శాతం పోలింగ్ నమోదు**

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), మే 15 : రెండ్రోజుల తర్వాత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ లెక్క తేలింది. ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి వరకు పోలింగ్ జరగ్గా 14వ తేదీన ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. ఆ తర్వాత బుధవారం పూర్తి పోలింగ్ వివరాలను అధికారులు వెల్లడించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో సరాసరి 79.63 శాతం పోలింగ్ నమోదయినట్టు ప్రకటించారు. అత్యధికంగా కందుకూరులో 88.96 శాతం, అత్యల్పంగా నెల్లూరు రూరల్‌లో 67.76 శాతం పోలింగ్ జరిగింది. ఇక సర్వేపల్లిలో 83.88 శాతం, కావలిలో 83.03 శాతం, ఆత్మకూరులో 83.49 శాతం, కోవూరులో 79.29 శాతం, నెల్లూరు సిటీలో 71.72 శాతం, ఉదయగిరిలో 81.92 శాతం పోలింగ్ జరిగింది. కాగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జిల్లాలో 1.20 శాతం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లెక్కన మొత్తం చూసుకుంటే జిల్లాలో దాదాపు 81 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. 2019లో 78.5శాతం పోలింగ్ జరిగింది. అప్పటితో పోల్చుకుంటే 2 శాతంపైగా పోలింగ్ శాతం పెరిగింది.

నేటి నుంచి వేదగిరిపై బ్రహ్మోత్సవాలు

21న బంగారు గరుడసేవ, 22న కల్యాణం ● 23న రథోత్సవం, 26తో ముగింపు

భారీగా ఏర్పాట్లు చేసిన దేవదాయ శాఖ



ఆలయం ఎదుట గాలిగోపురం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

నెల్లూరురూరల్, మే 15 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం మొదలుకానున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు, దేవదాయ శాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. నేటి ఉదయం అంకురార్పణతో శ్రీవారి ఉత్సవాలు మొదలుకానుండగా, భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.17న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనంపై శ్రీవారు ఊరేగనున్నారు. 18న చప్పర ఉత్సవం, రాత్రికి హంసవాహన సేవ, 19న సింహవాహన సేవ, 20న హనుమంత సేవ, 21 మోహిని ఉత్సవంతో అఖండ జ్యోతి, మూలవర్లకు అభిషేకం అనంతరం బంగారు గరుడ సేవ జరగనుంది. 22న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిల సమేతంగా లక్ష్మీనరసింహస్వామి వార్ల కల్యాణం, 23న నరసింహపురంలో రథోత్సవం జరగనుంది. 25న చక్రస్నానం, 26న పుష్పయాగం అనంతరం ఏకాంతసేవతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటి సౌకర్యం, పార్కింగ్ ప్రాంతాన్ని సిద్ధం చేస్తున్నారు. అలాగే నెల్లూరులోని ములుముడి బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబా టులోకి తెస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో గిరికృష్ణ తెలిపారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

నెల్లూరు(విద్య), మే 15 : పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా సంబంధిత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు లాగిన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు కూడా అదే వెబ్‌సైట్ నుంచి జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని ఉపయోగించి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

26న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జిల్లాలో 2024వ సంవత్సరం టెన్త్ పరీక్షల్లో 475 మార్కులకు పైగా సాధించిన యాదవ విద్యార్థులకు ఈనెల 26వ తేదీన నగరంలోని జెట్టి శేషారెడ్డి భవనంలో ప్రతిభా పురస్కారాలు అందచేస్తున్నట్లు యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన యాదవ విద్యార్థులు సంబంధిత తేదీన టెన్త్ మార్కుల జాబితాలో హాజరు కావాలని తెలిపారు.

‘ప్రకాశం’లో పర్మిట్లు జిల్లాలో తవ్వకాలు!

● క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల్లో వెలుగుచూస్తున్న వాస్తవాలు
● 90 వేల మెట్రిక్ టన్నులు తరలించినట్లు నిర్ధారణ
● 30 మంది లీజుదారులకు నోటీసులు
● రూ.వందల కోట్ల ప్రజా సంపద స్వాహా

నెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమాలు, అవినీతికి కాదేదీ అనర్హం అన్నట్లు వైసీపీ ప్రభుత్వంలో తెల్లరాయి (క్వార్ట్జ్) అక్రమాల బాగోతం జరిగింది. తీగలాగితే డొంక కదులుతున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు తేలుతుండడం సంచలనాన్ని సృష్టిస్తోంది. అసలు జిల్లాలో ఇన్ని లక్షల టన్నులకు పర్మిట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆ ఖనిజాన్ని దేశం నుంచి ఎలా దాటించగలిగారు అన్న కోణంలో విచారణ సాగించగా మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇతర దేశాలకు తరలిన తెల్లరాయికి ప్రకాశం జిల్లాలో పర్మిట్లు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రకాశం జిల్లాలో ఈస్థాయిలో క్వార్ట్జ్ రాదు కదా మరి పర్మిట్లు ఎలా ఇచ్చారయ్యా.. అని లోతుగా పరిశీలించగా ప్రభుత్వ స్థాయిలో పెద్దల హస్తం ఉన్నట్లు బయటపడింది. నెల్లూరు జిల్లాలో క్వార్ట్జ్‌కు పర్మిట్లు ఆపేయడంతో ప్రకాశం జిల్లాలో తవ్వుతున్నట్లు పర్మిట్లు తెచ్చుకొని ఆ ముసుగులో నెల్లూరు జిల్లాలో ఖనిజాన్ని కొల్లగొట్టారు. ఇలా సుమారు 90 వేల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను ప్రకాశం జిల్లాలోని పర్మిట్ల ద్వారా నెల్లూరులో అక్రమంగా తవ్వి రాష్ట్రం, దేశం దాటించారు. అంతర్జాతీయ మార్కెట్లో టన్ను క్వార్ట్జ్ విలువ రూ.30 వేలకుపైగా ఉంది. ఆ లెక్కన చూసుకుంటే సుమారు రూ.270 కోట్ల ప్రజా సంపదను అక్రమంగా తవ్వి తరలించారు.

● **లీజుదారులకు నోటీసులు**

ఈ వ్యవహారంలో 30 మంది ప్రకాశం జిల్లా లీజుదారులకు మైనింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎక్కడ తవ్వకాలకు పర్మిట్లు తీసుకున్నారు? అక్కడ ఎంత తవ్వారు..? ఆ పర్మిట్లు నెల్లూరు జిల్లాకు ఎందుకొచ్చాయి? ఏ మేరకు ఎగుమతులు చేశారు? అందుకు సంబంధించిన లెక్కలు? ఇలా అనేక అంశాలపై సదరు లీజుదారుల నుంచి రాబట్టేందుకు మైనింగ్ అధికారులు విచారణ సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అనధికారికంగా క్వార్ట్జ్ తవ్వకాలు జరిపిన వైసీపీ నేతలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ కుంభకోణంలో అసలు సూత్రధారులు వైసీపీ పెద్దలు అయినప్పటికీ వారెక్కడా ప్రత్యక్షంగా కనిపించలేదు. అయితే వారి అనుచరుల ద్వారా ఈ అవినీతి భాగోతాన్ని నడిపించారు. ఇప్పుడు వారందరూ ఇరుక్కుపోతు న్నారు. ఆ కోవలోనే ఇప్పుడు వీరి కోసం పర్మిట్లు తీసుకున్న ప్రకాశం జిల్లాలోని వ్యక్తులు కూడా ఇరుక్కుపో యారు. కాగా నెల్లూరు జిల్లాలోని క్వార్ట్జ్‌ను లీజు మాటున వైసీపీ నాయకులకు అధికారికంగా కట్టబెట్టే ప్రయత్నాలు కొన్ని నెలల క్రితం జరిగాయి. తవ్వకాలకు టెండర్లు పిలిచినా అనూహ్యంగా రద్దు చేశారు. ఆ తర్వాతనే ప్రకాశం జిల్లా పర్మిట్లు ఇప్పించి వాటి ద్వారా జిల్లాలో విలువైన ఖనిజాన్ని కొల్లగొట్టారు. ఏదిఏమైనా విచారణలో మున్ముందు ఇంకెన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయో చూడాలి.



తవ్వకాల నుంచి వెలికితీసిన తెల్లరాయి (ఫైల్)

వారొచ్చేదాకా వీరే దిక్కు!

● మార్కెట్లోకి ఉలవపాడు మామిడి
● జాతీయ రహదారిపై వెలుస్తున్న అంగళ్లు
● ఇతర ప్రాంతాల వ్యాపారుల రాక ఆలస్యం
● చిరువ్యాపారులపైనే సాగుదారుల ఆశలు
● రోజుకు నలభై టన్నుల వరకు విక్రయం

ఉలవపాడు, మే 15 : మామిడి కాయల సీజన్ వచ్చిందంటే ఉలవపాడు జాతీయ రహదారి వెంట ఇరువైపులా అంగళ్లు వెలుస్తాయి. ఉలవపాడుతో పాటు చుట్టుపక్కల మండలాలైన గుడ్లూరు, సింగరాయకొండ, కందుకూరు, కావలి రూరల్ మండలాల్లో వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. ఉలవపాడుకు చెందిన రైతులే ఎక్కువగా చుట్టు పక్కల మండలాల్లో తోటలను కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. ఆయా ప్రాంతాలలో పంటకొచ్చిన కాయలను ఇక్కడ నుంచే ఎగుమతి చేస్తుంటారు. అందుకే గుంటూరు, విజయవాడలతోపాటు బయట రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు ఉలవపాడు నుంచే తమ లావాదేవీలు కొనసాగిస్తున్నారు. అయితే వారు నూజివీడు, కడప మామిడి సీజన్ పూర్తయ్యేవరకు ఉలవపాడు వైపు చూడరు. అలాంటి సమయంలో జాతీయ రహదారికి ఇరువైపులా వెలసిన అంగళ్ల నిర్వాహకులు మామిడి రైతును ఆపద్బాంధవుల్లా ఆదుకుంటున్నారు. ఉలవపాడు, రాజుపాలెం, చాగొల్లు, వీరేపల్లి గ్రామాలకు సంబంధించిన చిరు వ్యాపారులు సుమారు 100 మంది దాకా ప్రతి ఏడాది ఏప్రిల్ మొదలు అంగళ్ల కోసం పందిళ్లు వేసుకుంటారు. రోజుకు సరాసరిన 30 నుంచి 40 టన్నులు మామిడి వ్యాపారం ఇక్కడ నుంచే జరుగుతుంది. రైతు నమ్మకం మీద ముందస్తుగా అంగళ్లకు సరుకు తోలి 2, 3 రోజుల తర్వాత డబ్బులు తీసుకుంటారు. హైవేపై ఈ అంగళ్లు లేకుంటే ఎప్పటికో బయటి నుంచి వచ్చే వ్యాపారుల కోసం ఎదురుచూసి ముందస్తు చేతికొచ్చిన పంట అమ్ముడుపోక సాగుదారు నష్టపోయేవాడు.

అందుబాటులో ధర

మే నెల మూడో వారం వచ్చిందంటే మామిడి కాయలు క్రమేణా పక్వానికి వచ్చినట్టే. దీంతో పంట చేతికి వచ్చేసరికి చెట్లమీద నిలబడటం కష్టం అందుకే వచ్చిన రేటుకు అమ్ముకోవడానికే రైతు చూస్తుంటాడు. ఈ క్రమంలో ప్రస్తుతం బంగినపల్లి టన్ను మేలి రకం రూ. 50 వేల వరకు పలుకుతోంది. ఈ నెలాఖరుకు ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఉలవపాడుకు చేరుకుని, నాణ్యతను బట్టి ధర నిర్ణయించి కొనుగోలు చేస్తారు. చివరి దశ వరకు కాపు నిలుపుకున్న రైతులకు సుమారు టన్ను ధర రూ.70 వేల నుంచి 80 వేల వరకు పలికే అవకాశాలు ఉంటాయి. ఏప్రిల్‌లో కొద్దిపాటి వర్షం కురిసి ఉంటే కాయ సైజు పెరిగి ధర ఆశాజనకంగా ఉండేదని రైతులు అంటున్నారు. ఈ ఏడాది ఆశించినంత దిగుబడి లేదని, ఉన్న పంటను ఎలాంటి ప్రకృతి ఆటంకాలు సంభవించకుండా చివరి వరకు అమ్ము కుంటే కొంతలో కొంత ఊరట ఉంటుందని అంటున్నారు.



ఉలవపాడు జాతీయ రహదారి వెంట ఒకవైపు వెలసిన మామిడి కాయల దుకాణాలు



బీసీజీ వ్యాక్సిన్

వయోజనులకు నేటి నుంచి క్షయ వ్యాక్సిన్

నెల్లూరు (వైద్యం), మే 15 : సాధారణంగా ఇప్పటి వరకు పుట్టిన పిల్లలకు వేసే క్షయ వ్యాక్సిన్ బీసీజీని తొలిసారిగా గురువారం వయోజనులకు వేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో తొలిదశలో నెల్లూరు జిల్లా ఉంది. 18 ఏళ్లు నిండి షుగర్ వ్యాధితో బాధపడేవారికి, 60 ఏళ్లు నిండిన వారికి, ఇప్పటికే క్షయ మందులు వాడి కోలుకున్న వారికి ఈ వ్యాక్సిన్ వేయనున్నారు. క్షయ వ్యాధిగ్రస్థులకు సన్నిహితంగా ఉన్న కుటుంబ సభ్యులకు కూడా ఈ వ్యాక్సిన్ వేస్తారు. ఎవరెవరికి ఈ వ్యాక్సిన్ వేయాలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఓ జాబితా సిద్ధం చేశారు. ఇప్పటికే 3 లక్షల డోసుల వ్యాక్సిన్ జిల్లాకు రాగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వాటిని చేర్చారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ నియంత్రణ అధికారి మాట్లాడుతూ నోడల్ అధికారుల ఆధ్వర్యంలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

వేట విరామం.. కదలని తెప్పలు



అల్లూరు, మే 15 : సముద్రం లో చేపల వేటకు విరామం కావడంతో తెప్పలన్నీ తీరానికి చేరాయి. ప్రతీఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు వేట విరామం ప్రకటించడం ఆనవాయితీ. సముద్రంలో చేపలు ఉత్పత్తి చేసే కాలం కావడంతో మత్స్యకారులు వేటకు వెళ్ల కూడదని తమ కట్టుబాటుగా మత్స్యకారులు దురాయి వేసుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఎవరైనా చేపల వేటకు వెళ్తే నౌకాదళంలోని ఓ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటారు. వేటకు వచ్చిన వారిని అదుపులోకి తీసుకుంటారు. ఈ కారణంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా తమ తెప్పలను తీరప్రాంతంలో రెండు నెలల పాటు నిలిపి వేసి విరామం ప్రకటించారు.

ఓటెత్తిన జనం.. ఎవరికో పట్టం ?

● ఉదయగిరిలో 81.92 శాతం పోలింగ్ ● అత్యధికం జలదంకి - 85.95 ● అత్యల్పం సీతారామపురం - 76.80

ఉదయగిరి రూరల్, మే 15: ఉదయగిరి నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో 81.92 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో అత్యధికంగా జలదంకి మండలం 85.95 పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా సీతారామపురం మండలంలో 76.80 శాతం నమోదైంది. నియోజవకర్గంలోని 323 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,41,677 మంది ఓటర్లు ఉండగా 1,97,970 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

వలస జీవుల కరుణ ఎవరిపైనో ?

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న వలస జీవుల కరుణ ఈ ఎన్నికల్లో ఏ పార్టీపై పడిందోనని ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు అంచనాలు వేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, ఉదయగిరి, కలిగిరి, కొండాపురం మండలాల్లో సుమారు 40 శాతం మంది ప్రజలు ఇతర ప్రాంతాల్లో వివిధ వ్యాపారాలు, పనులు చేసుకొని జీవిస్తున్నారు. ఎన్నడూలేని విధంగా సార్వత్రిక ఎన్నికలకు 200 బస్సులు, 500 కార్లలో వలస ఓటర్లు భారీగా తరలివచ్చారు. 30-35 శాతం మంది ఓటు వేసేందుకు నియోజకవర్గానికి వచ్చారు. దీంతో ప్రధాన పార్టీల నేతలు, కార్యకర్తలు వలస ఓటర్ల చూపు తమవైపు అంటే తమవైపు అని అంచనాలు వేసుకొంటున్నారు. ఏదిఏమైనా గెలుపోటములు శాసించే వలస ఓటర్ల తీర్పు చూడాలంటే వచ్చేనెల 4వ తేదీ వరకు వేచి ఉండాల్సిందే.

మండలం	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు	ఓటింగ్ నమోదు శాతం 2019	ఓటింగ్ నమోదు శాతం 2024
సీతారామపురం	19,160	14,715	75.96	76.80
ఉదయగిరి	30,264	24,238	78.0	80.09
దుత్తలూరు	22,591	18,152	72.6	80.35
వరికుంటపాడు	25,925	22,177	70.0	85.54
వింజమూరు	33,369	26,093	77.0	78.20
కలిగిరి	37,963	31,637	84.36	83.34
కొండాపురం	34,591	28,455	75.8	82.26
జలదంకి	37,814	32,503	81.0	85.95
మొత్తం:	2,41,677	1,97,970	78.68	81.92

ముగిసిన ఎన్నికలు.. మూగబోయిన పల్లెలు !



ఉదయగిరిలో బోసిబోయిన వీధులు

ఉదయగిరి, మే 15: అసెంబ్లీ ఎన్నికల్లో చివరి ఘట్టమైన పోలింగ్ ముగియడంతో గ్రామాలు మూగబోయాయి. ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకునే వరకు ప్రచార రథాల పాటలతో నాయకుల ఉపన్యాసాలతో, వచ్చిపోయే అతిథులతో గ్రామాలు సందడిగా ఉండేవి. ఓటర్ల చుట్టూ తిరుగుతూ తమ పార్టీకే ఓటు వేయాలని ఇంటింటికి తిరిగిన నాయకుల సందడి లేక పోవడంతో గ్రామాల్లో వీధులు వెలవెల బోతున్నాయి. మే 13న ఎన్నికల పోలింగ్ పూర్తి కావడంతో ఎక్కడ వారు అక్కడే గప్‌చుప్‌గా ఉండిపోయారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో అభ్యర్థుల భవితలు బయటపడిన తర్వాత గ్రామాల్లో నెలకొన్న మరికొంత ఉత్కంఠకు తెరపడనుంది.

వ్యక్తిగత పనులపై దృష్టి: తమ పార్టీ అభ్యర్థి గెలవాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు సొంత పనులను సైతం పక్కనబెట్టి రెండు, మూడు నెలలపాటు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. వారి పార్టీ గెలిస్తే వారే గెలిచినట్టుగా భావించి ప్రతి ఇంటికి వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఒక చేతిలో పార్టీ జెండా మరో చేతిలో ఓటర్ లిస్టు పట్టుకుని గల్లిగల్లి తిరిగి ఎంతో శ్రమపడ్డారు. ఓట్ల పండుగ ముగియడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇక వారి వ్యక్తిగత పనులపై దృష్టిపెట్టారు. వ్యవసాయం చేసుకునే రైతులు, ప్రైవేటు ఉద్యోగులు, చిరు వ్యాపారులు సైతం వారి పనుల్లో నిమగ్నమయ్యారు. పార్టీ కోసం, అభ్యర్థి కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు వారి కష్టానికి ఫలితం దక్కాలని ఆశిస్తున్నారు.

ఎవరి ఖర్చులు వారివే: ప్రధాన పార్టీల అభ్యర్థుల కోసం ప్రచారాలు చేసిన నాయకులు, కార్యకర్తలు ఇక నుంచి ఎవరి ఖర్చులు వారే పెట్టుకుని గ్రామాల్లో చలామణి అవ్వాలి. ఇన్ని రోజులపాటు పోటీ చేస్తున్న అభ్యర్థులు రోజువారీగా డబ్బులు పంపించారు. కానీ ఎన్నికలు పూర్తి కావడంతో ఏది తాగాలన్నా ఏమి తినాలన్నా ఎటు వెళ్లాలన్నా వారి వ్యక్తిగతంగా ఖర్చులు పెట్టుకోవాలి. రెండు నెలలపాటు ప్రతి రోజు అభ్యర్థులు ఇచ్చిన డబ్బులతో గ్రామాల్లో తిరిగిన వారు నేడు వారి జేబుల్లో నుంచే పెట్టుకోక తప్పడం లేదు. రెండునెలల పాటు ఏదో పార్టీ మీటింగ్‌కు ప్రచారానికి వెళుతూ రోజు కు 200 నుంచి 500 రూపాయల వరకు సంపాదించుకుంటూ భోజనం సైతం దొరి కింది. దీనికితోడుగా వారి పిల్లలను కుటుంబ సభ్యులను సైతం తీసుకెళ్లి ఓ గంట తిరిగి డబ్బులు తెచ్చుకున్నారు. కానీ ఇప్పుడు ఉదయం వెళ్లి సాయంత్రం వరకు పనిచేసి డబ్బులు సంపాదించక తప్పదు.

పార్టీలకతీతంగా కార్యకర్తల చర్చలు: రెండు నెలలపాటు నువ్వానేనా అన్నట్టుగా ప్రచారం నిర్వహిస్తూ వారి పార్టీ అభ్యర్థి కోసం కొట్లాటలకు సైతం దిగిన కార్యకర్తలు నేడు వారి గ్రామాల్లో పార్టీలకు అతీతంగా చర్చల్లో మునిగిపోయారు. పలు పత్రికల్లో వచ్చిన కథనాలు, ఎన్నికల పోల్స్ చెబుతున్న ఫలితాలపై రాష్ట్ర రాజకీయాలు ఎలా ఉంటాయో అంటూ చర్చించుకుంటున్నారు. ఎన్నికల స్టంట్ ఉండడంతో వారి బలాబలాలు చూపించేందుకు అభ్యర్థి మెప్పుపొందేందుకు చేసిన రాజకీయం ఓ భాగమని చాటిచెప్తున్నారు. ఇప్పుడు హోటళ్లు, కల్లు, మద్యం షాపుల వద్ద గ్రామాలు, కూడళ్లల్లో అన్ని పార్టీల కార్యకర్తలు కలిసి ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడతారో లెక్కలు వేసుకుంటున్నారు. ఎవరు గెలిచినా, ఓడినా మనమంతా కలిసి ఉండాల్సిన అవసరముందని,పార్టీలు వేరైనా ఐక్యమత్యాన్ని చాటాలని మాట్లాడుకుంటున్నారు.

సీతారాముల ఉత్సవాలు ప్రారంభం

ఉదయగిరి రూరల్, మే 15: మండలంలోని శకునాలపల్లిలో బుధవారం శ్రీ సీతారాముల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామివార్లకు గణపతి, పుణ్యాహ వచనం, నవగ్రహ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామం, పరిసర గ్రామాల భక్తులు స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధన్వంతరి ఆరోగ్య పీఠం అధ్యక్షుడి మృతి

ఉదయగిరి రూరల్, మే 15: మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు, ధన్వంతరి పీఠం అధ్యక్షుడు వీఎల్ నారాయణరావు గుండెపోటుతో బుధవారం చిత్తూరు జిల్లా కలికిరిలో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం బుచ్చిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు

మర్రిపాడు. మే 15: డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు రైతులకు ఆశాజనకంగా ఉన్నాయి. బుధవారం బోర్డుకు రైతులు 963బేళ్లను తీసుకొని రాగా, 18కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 910బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 53 బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ట ధర రూ. 299 కాగా కనిష్ట ధర రూ. 205 పలకగా సగటున ధర రూ. 275.55గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ స్తంభాలు మార్చండి

ఉదయగిరి, మే 15: మండలంలోని బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి బీసీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీ ఏర్పడినప్పుడు విద్యుత్ శాఖాధికారులు ఏర్పాటు చేసిన స్తంభాలు పెచ్చులూడి ఇనుపచువ్వలు బయటపడి ప్రమాదానికి చేరువలో ఉన్నాయన్నారు. బలమైన గాలులు వీచినా, వర్షాలు కురిసినా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోపాటు కూలే దశలో ఉన్నాయని, పలుమార్లు విద్యుత్ శాఖాధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకొని స్తంభాలు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

కాకర్ల సురేష్‌కు అభినందనల వెల్లువ



టీడీపీ కార్యాలయంలో నాయకులతో కాకర్ల సురేష్

వింజమూరు, మే 15: ఉదయగిరి నియోజక వర్గం లోని 8 మండలాల నుంచి టీడీపీ నాయకులు వింజ మూరు పంచాయతీ పరిధి లోని బొమ్మరాజు చెరువు సమీపంలో ఉన్న తెలుగు దేశం పార్టీ కార్యాల యానికి చేరుకుని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌కు అభినందనలు తెలి యజేస్తున్నారు. ఉదయగిరి కోటపై దాదాపు 25వేల మెజారిటీతో తెలుగుదేశం జెండా ఎగరబోతుందని భరోసా కల్పిస్తున్నారు. 8 మండలాల్లో ఉదయగిరి మినహాయించి అన్ని మండలాల్లో టీడీపీ విజయం సాధిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరిలో కూడా స్వల్ప మెజారిటీ వైసీపీకి వచ్చే అవకాశం ఉందని విశ్లేషణ చేస్తున్నారు. పార్టీ కార్యాలయంలో నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలతో కాకర్ల సురేష్‌ని ఘనంగా సన్మానిస్తున్నారు. జూన్ 4వ తేదీ సంబరాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. 120 సీట్లు పైబడి తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేయనున్నట్లు తెలిపారు. కాకర్ల సురేష్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే, ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని, ఉదయగిరిని సిరుల గిరిగా చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు ఉన్నారు.

సాధారణ విధులకు అధికార యంత్రాంగం సన్నద్ధం

ఆత్మకూరు : ఎన్నికల బాధ్యతల నుంచి విముక్తి లభించడంతో సాధారణ విధులకు అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. దాదాపు ఒకటిన్నర నెలపాటు ఆత్మకూరు నియోజకవర్గంలో సమస్యలకు సంబంధించిన వందలాది అర్జీలు పేరుకుపోయాయి. అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైల్స్ దుమ్ముకొట్టుకుపోయాయి. మండల, మున్సిపల్ సమీక్ష సమావేశాలకు బ్రేక్ పడ్డాయి. ప్రతి సోమవారం ఎంతో హంగామా, హడావిడిగా కనిపించే ప్రభుత్వ కార్యాలయాలు ఈ రెండు నెలలు బోసిపోయాయి. గత 40 రోజులకు పైగా సమస్యల పేరుతో ప్రజలు అధికారుల చుట్టూ తిరిగినా ఇప్పుడు కాదంటూ వారిని వెనక్కి సాగనంపారు. ఎన్నికల విధుల నుంచి విముక్తి లభించడంతో అధికార యంత్రాంగం సాధారణ విధుల్లో నిమగ్నమైంది.

గ్రామాల్లో కుక్కల స్వైర విహారం



వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ఉదయగిరి, మే 15 : గ్రామాల్లో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో విచ్చల విడిగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మేజర్ పంచాయతీ ఉదయగిరితోపాటు గండిపాలెం, అప్పసముద్రం, బిజ్జం పల్లి, గన్నేపల్లి, అయ్యవారిపల్లి, కృష్ణం పల్లి, కుర్రపల్లి, శకునాలపల్లి, దాసరిపల్లి తదితర పంచాయతీల్లో కుక్కల బెడదకు ప్రజలు వణికి పోతున్నారు. పగలు రాత్రి సమయాల్లో బయటికి రాలేని పరిస్థితులున్నాయి. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. ముఖ్యంగా పిల్లలు కుక్కకాటుకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణకు చర్యలు : మల్లికార్జున ఈవోపీఆర్డీ

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.. ఇదివరకే ఉదయగిరి మేజర్ పంచాయతీలో కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు తీసుకుని, పిచ్చికుక్కలపై ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు కుక్కలను పట్టించి ఇతర ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం.

కంపచెట్ల మధ్య వసతిగృహం

● విద్యార్థుల అవస్థలు



కంపచెట్ల మధ్య ఉన్న వసతిగృహం

ఆత్మకూరు : మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ జంక్షన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ సమీకృత గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో మౌలిక వసతులు కొరవడడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. వసతి గృహంలో ఈ ఏడాది 3 నుంచి 10వ తరగతి వరకు చదివే 70 మంది విద్యార్థులు ఉన్నారు. వసతిగృహానికి ప్రహరీగోడ లేక రక్షణ కరువైంది. వసతిగృహం పరిసర ప్రాంతాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉండడంతో విషపురుగుల బెడద విద్యార్థులను కలవరపరుస్తోంది. దానికితోడు వసతిగృహం ఎదుట పెద్దగోతులలో నీరు నిల్వ ఉండి దోమలకు నిలయంగా ఉన్నాయి. విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ఈ వసతిగృహం పట్టణానికి దూరంగా ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహ సముదాయానికి ప్రహరీగోడ నిర్మించడంతో పాటు పరిసర ప్రాంతాలను చదును చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు



అయ్యవారిపల్లె చెరువులో నీటి కోసం వెంపర్లాడుతున్న మూగజీవాలు

వలేటివారిపాలెం, మే 15 : మండలంలోని అయ్యవారిపల్లె, మాలకొండ, రామలింగాపురం, పోలినేనిచెరువు, గరుకపాలెం, పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, చుండి, కాకర్లవారిపాలెం, అంకభూపాలపురం తదితర గ్రామాల్లో నీరు లేక మూగజీవాలు అలమటిస్తున్నాయి. పల్లెల్లో పశువుల దాహర్తి తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయంలో లక్షలు వెచ్చించి నీటి తొట్టెలు నిర్మించారు. నేడు అవి నిరుపయోగంగా మారాయి. నిర్వహణ సక్రమంగా లేక కొన్ని శిథిలావస్థకు చేరగా, మరికొన్ని చెత్తకుండీలను తలపిస్తున్నాయి. మండలంలో 14,692 గేదెలు, 460 ఆవులు, 25,738 గొర్రెలు, 7,063 మేకలు ఉన్నాయి. వర్షాభావంతో వాగులు, వంకలు, చెరువుల్లో చుక్కనీరు లేదు. నీటి వసతి కల్పించని అధికారుల తీరుపై పశు పోషకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న నీటి తొట్టెలకు మరమ్మతులు చేసి వాటిలో నీటి సౌకర్యం కల్పించాలని పశుపోషకులు కోరుతున్నారు.

కుంగిన జాతీయ రహదారి



బ్రిడ్జి నిర్మాణం వద్ద కుంగిన రోడ్డుకు మరమ్మతులు

కలిగిరి, మే 15: కావలి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కావలి- కలిగిరి మధ్య పలు చోట్ల బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టారు. అయితే జలదంకి నుంచి కలిగిరి మధ్యలో బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి కావడంతోపాటు రహదారి పనులు దాదాపుగా కావచ్చాయి. అయితే బ్రిడ్జి నిర్మాణాలు అనంతరం ఆయా ప్రాంతాలవద్ద అడుగుభాగం నుంచి మట్టి లేయర్లు నాసిరకంగా వేయడంతో రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. రహదారి పూర్తయిందని వాహనదారులు వేగంగా వచ్చే క్రమంలో బ్రిడ్జిల వద్ద కుంగిన రహదారి విషయం గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు కుంగిన బ్రిడ్జిలవద్ద మరమ్మతులు చేస్తున్న క్రమంలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంపై వాహనదారుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా రోడ్డుపనులు నాణ్యతగా చేయాలని వారు కోరుతున్నారు.

పేకాట ఘర్షణలో వ్యక్తికి గాయాలు

కందుకూరు, మే 15 : పేకాట ఆడుతూ ఇద్దరి మధ్య రేగిన వివాదం కత్తిపోట్లకు దారితీసింది.కందుకూరులోని శ్రీనగర్‌కాలనీ ప్రాంతంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది.అదే కాలనీకి చెందిన ఇరువురు పేకాట ఆడుతుండగా వివాదం జరిగింది.డబ్బులు విషయంలో గొడవ జరిగి ఎద్దు శివపై మరో వ్యక్తి కోడి కత్తితో దాడి చేశాడు.శివకు తీవ్ర గాయాలు కావడంతో ఏరియా హాస్పటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తీసుకువెళ్లారు.ఇరువురు కూడా ఎన్నికల కోసం హైదరాబాద్ నుంచి కందుకూరుకు వచ్చినట్లు తెలిసింది.

నేడు గుడ్లూరు మండల సమావేశం

గుడ్లూరు, మే 15 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై వెంకటేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభం కానున్న ఈ సమావేశానికి మండల అధికారులతోపాటు ప్రజాప్రతి నిధులు హాజరుకావాలని తెలిపారు.

గెలుపుపై ఇరుపార్టీల ధీమా

లింగసముద్రం, మే 15 : జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడంతో మెజారిటీ తమకంటే తమకంటూ వైసీపీ, టీడీపీలు భావిస్తున్నాయి. మండలంలోని 30,953 ఓట్లకుగాను 28,015 ఓట్లు పోలయ్యాయి. భారీగా యువత, మహిళలు, ఇతర నగరాల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కూడా ఓటింగ్‌కు తరలి వచ్చారు.దీంతో తమకే మెజారిటీ వస్తుందంటూ టీడీపీ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద ఈ ఎన్నికల్లో మండలంలో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందో చూడాలంటే జూన్ 4 వరకు ఆగాల్సిందే.

నేడు ఉచితంగా ఒడుగులు

బిట్రగుంట, మే 15: బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని ఎంకే ఫంక్షన్ హాల్లో గురువారం బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఒడుగుల కార్యక్రమం నిర్వహించ నున్నట్లు జిల్లా ముస్లిం మైనార్టీ నేత షేక్ సమీఉల్లా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలోని పేదముస్లింల పిల్లలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు గురువారం ఉదయం 8 గంటలలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తహార్ మహమ్మద్ హుస్సేన్, ఖాదర్‌బాషా, ఖలీల్, బడీర్ శ్రీధర్ పాల్గొన్నారు.

433 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 15: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 455 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 14కంపెనీ ప్రతినిధులు పాల్గొని 433బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-2, ఆర్‌ఆర్-3, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 22బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.300, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.270.08గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

అల్లూరు, మే 15 : అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసి ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడిన వారికి వెంటనే గుర్తించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా... ప్రజలు టీడీపీని ఆదరించారు : కావ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, మే15: వైసీపీ నాయకులు పోలింగ్ రోజు ఎన్ని హింసలు పెట్టినా, ఎన్ని కుయుక్తులు పన్నినా ఓటర్లు టీడీపీని ఆదరించారని కావలి టీడీపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ సరళి టీడీపీకి అనుకూలంగా ఉందని, పోలింగ్ కేంద్రాల వద్ద అలజడులు సృష్టించి ఓటర్లను భయపెట్టేందుకు వైసీపీ కుయుక్తులు పన్నిందన్నారు. ఇందులో భాగంగానే అల్లూరు మండలం బీరంగుంట, అల్లూరు రామకృష్ణకళాశాల, కావలి రూరల్ మండలం ముసునూరులో అలజడులు సృష్టించి దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ దాడుల్లో బీరంగుంటకు చెందిన శ్రీనివాసులు గాయపడ్డారన్నారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అరాచకపాలన నుంచి విముక్తి పొందాలని ఓటర్లు చైతన్య వంతులై కసిగా ఓట్లు వేసి టీడీపీని ఆదరించారని చెప్పారు. తమ విజయం పోలింగ్ రోజే ఖాయమైందని, జూన్‌లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్, టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, గుత్తికొండ క్రిషోర్, మన్నవ రవిచంద్ర, మొగిలి కల్లయ్య, జ్యోతి బాబూరావు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, అబ్దుల్ రహీం, దేవకుమార్, షేక్ ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి 61వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న రవికుమార్

కావలిటౌన్; మే15: కావలి ఆర్టీసీ డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవికుమార్ బుధవారం రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో 61వ సారి రక్తదానం చేశారు. రక్తదాన ప్రేరణలో భాగంగా ప్రతి ఏడాదిలో రెండు,మూడు సార్లు రక్తదానం చేయడంతోపాటు రక్తదాన ఆవశ్యకతను ఆయన ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ (పర్సనల్) గంగు విజయకుమారి, రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, కావలిశాఖ రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు దామిశెట్టి సుధీర్‌నాయుడు తదితరులు అభినందించారు.

వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం



అడవిలో ఏర్పాటుచేసిన గుంటలో నీరు తాగుతున్న మూగజీవాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొండాపురం, మే15: మండలంలోని గానుగపెంట పంచాయతీ పరిధిలో ఉన్న సామాజిక అడవిలో వన్యప్రాణులకు నీటివసతి లేక జింకలు మరణించాయి. దీంతో గతనెల 30 వతేదీన ఆంధ్రజ్యోతిలో 'వన్యప్రాణుల దాహార్తిని తీర్చండి' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కృత్రిమంగా ప్రత్యేక నీటి గుంటను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీ భాషా మాట్లాడుతూ అడవిలో ప్రత్యేకంగా గుంటను ఏర్పాటుచేసి నీటిని నింపామన్నారు. పంచాయతీ సర్పంచి పర్యవేక్షణలో ఈగుంటలో నీటిని ప్రతి రోజూ పరిశీలించి, అయిపోయిన వెంటనే ట్రాక్టరు ట్యాంకుతో మళ్లీ నింపుతారని తెలిపారు.

గిరిజనులకు పొంచి ఉన్న ముప్పు

● విష పురుగులకు నిలయంగా అట్టల ఫ్యాక్టరీ పరిసరాలు
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
● మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు

కావలి రూరల్, మే 15 : పట్టణంలోని ముసునూరు ఇందిరమ్మ కాలనీలోని అట్టల ఫ్యాక్టరీ వ్యర్థాలతో తమకు ప్రమాదం పొంచి ఉందని స్థానిక గిరిజనులు వాపోతున్నారు. ఫ్యాక్టరీలోని వ్యర్థాలను రోడ్డుపై వేయడంతో అవి పెద్దకుప్పగా మారాయి. దీంతో చిన్నపాటి గాలి వీచినా వ్యర్థాలు మొత్తం సమీపంలో ఉన్న గిరిజన కాలనీలోని ఇళ్లలోకి చేరుతున్నాయి. దీంతో ఇళ్లలోని నీరు కూడా కలుషితమౌతున్నదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి విషసర్పాల నిలయంగా మారాయి. నిత్యం ఏదో ఒక ఇంట్లో పాములు చేరటంతో ఆ ప్రాంత వాసులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని గిరిజనులు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు అక్కడకు వచ్చి నానా హంగామా చేసి మామూళ్లు దండుకుని పోతున్నారే తప్ప... రోడ్డు పై వేసిన చెత్తకుప్పలను తొలగించలేక పోతున్నారని గిరిజనులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై నిల్వ ఉన్న చెత్తను తొలగించి, విషసర్పాల నుంచి తమను కాపాడాలని వారు కోరుతున్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని వారు పేర్కొన్నారు.



విష పురుగులకు నిలయంగా అట్టల ఫ్యాక్టరీ పరిసరాలు



అట్టల ఫ్యాక్టరీ వద్ద రోడ్డుపై చేరిన వ్యర్థాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కందుకూరు, మే 15 : పట్టణంలోని మహదేవపురం అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ ఎస్‌ఐ ఆనంద్ భాస్కర్ కథనం మేరకు, కే కిషోర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై శ్రీనివాస కాలనీకి వెళ్లేందుకు మహదేవపురం అడ్డరోడ్డు వద్ద రోడ్డు మలుపు తిరిగే క్రమంలో సింగరాయకొండ నుంచి కందుకూరుకు వస్తున్న పాల వ్యాన్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన కిషోర్‌ని ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ వసతులు లేకపోవడంతో ఒంగోలులోని ప్రైవేటు హాస్పిటల్‌కి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. పాలవ్యాన్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.